J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 24




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 43 సంచిక : 46 19.04.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



## ఏపీలో మోగిన ఎన్నికల నగారా



# నోటి మాటలు, నోట్ల మూటలతో నాయకులు రె'ఢీ'

### మరో అవకాశం ఇవ్వమంటున్న వైసీపీ

### కూటమిని గెలిపించాలంటున్న జేఎస్‌పీ

### ఇదే చివరి అవకాశం అంటున్న టీడీపీ

### ఎవరు గెలిచినా ఓకే అంటున్న బీజేపీ

**ఆంధ్రప్రదేశ్‌లో** ఎన్నికల నిర్వహణకు అధికారికంగా సైరన్ మోగింది. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యింది. ఏప్రిల్ 18 ఉదయం 9గంటల నుండి ఎన్నికల అధికారిక నియమావళి అమలులోకి వచ్చింది. దేశం మొత్తంలో 7 విడతలలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో 4వ విడత ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. అందుకు సంబంధించిన అధికారిక ప్రకటన గురువారం ఉదయం విడుదలయ్యింది. ఏప్రిల్ 18వ తేదీ నుండి 25వ తేదీ వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు. 26వ తేదీ స్క్రూటినీ చేస్తారు. ఉపసంహరణకు 29 వరకూ గడువు ఉంటుంది.

ఏప్రిల్ 27వ తేదీ నుండి మే 13 వరకూ పదహారు రోజులపాటు అసలు సిసలు ఓట్ల పండగ జరుగుతుంది. మే13 సాయంత్రానికి పోలింగు ముగిసి తుఫాను వెలసిన ప్రశాంతత ఏర్పడుతుంది. ఆ తరువాత జూన్ 4న ఫలితాలు వెలువడే వరకు అంతా సస్పెన్సే.

ఇప్పటికే వేసవి వేడితో పాటు నాయకుల మాటల వాడి, పరస్పర విమర్శల దాడి జోరందుకుంటున్నాయి. నోటి మాటలతో నోట్ల మూటలతో తాము అమాయకులనుకుంటున్న ప్రజలని మరోసారి మోసం చేయడానికి అన్ని పార్టీల నాయకులు ప్రజాక్షేత్రంలో తిరుగుతున్నారు.

22 లో



## నెల్లూరు జిల్లాలో మొత్తం ఓటర్లు 19,36,817

3 లో
వివరాలు 3లో...

## 'సేవాభూషణ్' వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పుట్టినరోజు (ఏప్రిల్ 19) సందర్భంగా ప్రత్యేక కథనాలు



లోపలి పేజీల్లో..

## శ్రీరస్తు - శుభమస్తు - సౌభాగ్యమస్తు!



మా ఆత్మబంధువులు, ఆత్మీయ సింధువులు
మా కుటుంబ శ్రేయోభిలాషులు, మా హితైషులు
**డాక్టర్ కేశవ్‌రామిరెడ్డి - డాక్టర్ అనుపమ ల**
గారాల పట్టి

## ప్రణవి - అఖిల్

కొంగుముడి వేసుకుని కొత్త దంపతులై,
మాంగల్యబంధంతో నూరేళ్ళ అనుబంధాన్ని పెనవేసుకున్న
ఆనంద తరుణంలో
మా ఆత్మీయ శుభాకాంక్షలు.

**డాక్టర్ కే.కృష్ణకిషోర్ - వాసంతి**
**రోషిణి - అంబికా ఈశ్వర్**
**డాక్టర్ కిషోర్స్ రత్నం విద్యాసంస్థలు**
ఆంధ్రప్రదేశ్.



రకరకాల వ్యాధులు, జబ్బులతో విలవిలలాడుతున్న పేదలకు వైద్యచికిత్సలందించి వారి ప్రాణాలు నిలిపేందుకు 'విపిఆర్ వైద్యం' పేరుతో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి-ప్రశాంతిరెడ్డి దంపతులు కోట్లాది రూపాయలను వెచ్చిస్తూ సమాజానికి తమవంతు సేవలందిస్తున్నారు. పెద్దసంఖ్యలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ, నిరుపేదలకు వైద్యసేవలతో పాటు వారికి అవసరమైన మందులను కూడా ఉచితంగా అందజేస్తున్నారు. నెల్లూరుజిల్లా ప్రజలకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా మేమున్నామంటూ భరోసా ఇస్తూ ఆదుకునే దాతలు జిల్లాలో ఎవరైనా ఉన్నారా అంటే.. వారే వేమిరెడ్డి దంపతులు. వరదలొచ్చినా కరువులొచ్చినా అండగ నిలిచే మహాదాతలు వేమిరెడ్డి దంపతులే. కరోనా కష్టసమయంలో వారు కోట్లాది రూపాయలను సాయంగా అందజేసి, ఆ రాకాసి వ్యాధి కోరల నుంచి ప్రజలను కాపాడేందుకు అవసరమైన మందులు, ప్రాణవాయువు(ఆక్సిజన్), శానిటైజర్లు పెద్దమొత్తంలో అందించి వేలాదిమందిని కాపాడి ప్రాణదాతలయ్యారు. అంతేకాదు, ప్రాణాంతకమైన గుండె వ్యాధులతో బాధపడుతూ, అ గుండెలెప్పుడు ఆగిపోతాయోనని భయంతో తల్లడిల్లుతున్న చిన్నారులకు గుండె ఆపరేషన్‌ల కోసం ఏర్పాటుచేసిన చిన్నారి హార్ట్‌ఫౌండేషన్‌కు వారు తమవంతు విరాళం అందజేశారు. జిల్లావ్యాప్తంగా వైద్యసేవల కోసం కోట్లాదిరూపాయలు వెచ్చిస్తూనే ఉన్నారు. అసహాయులకు, అభాగ్యులకు, దివ్యాంగులకు, దీనజనులెందరి జీవితాలకో వెలుగులు అందిస్తూనే ఉన్నారు. భవిష్యత్తులో కూడా తమ సేవలను మరింత విస్తరించి జిల్లా ప్రజలకు ఎల్లవేళలా అండగా నిలవాలనే సదాశయంతో వారిద్దరూ రానున్న ఎన్నికల్లో నిలబడి, మీకు సేవచేసే భాగ్యం కల్పించండంటూ ప్రజల ఆదరణ-ఆశీస్సుల కోసం ప్రజల చెంతకు వస్తున్నారు.




# ఆపదలో ఆదుకునే.. ఆపద్బాంధవులు

## • 'విపిఆర్ వైద్యం' ద్వారా కోట్లాది రూపాయలతో ఉచిత వైద్యసేవలు







పేదలకు ఆత్మబంధువులుగా, దీనజనులకు ప్రాణ మిత్రులుగా ఉంటూ, ప్రజల వైద్యసేవల కోసం విపిఆర్ దంపతులు అందిస్తున్న సేవలు అపారం..అద్భుతం!. పేదవారికి కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు నెల్లూరు రూరల్ మండలంలోని కనుపర్తిపాడు వద్ద 'విపిఆర్ వైద్యం' పేరుతో ఆసుపత్రి నిర్మించి, ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటుచేయడమే కాక, ఇరవైనాలుగు గంటలూ పేదలకు అందుబాటులో ఉండేలా డాక్టర్‌తో సహా ఉచిత అంబులెన్స్‌ను కూడా సిద్ధం చేశారు. 2018లో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుండెజబ్బుల నివారణకు సంబంధించి మెగా ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేసి వందలాదిమంది పేదరోగులకు తమ సేవలందించారు. చెన్నై తదితర ప్రాంతాలనుంచి గుండెవ్యాధుల నిపుణులను రప్పించి, గుండెజబ్బులున్న దాదాపు 250 మందికి ఉచిత వైద్యపరీక్షలు, మందులు అందజేశారు. కల్లూరుపల్లి గ్రామానికి చెందిన ఓ చిన్నారికి గుండెకు రంధ్రం పడినట్లు ఆ శిబిరంలోనే వైద్యులు గుర్తించగా, ఆ పాపకు చెన్నై ఆపోలో ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించి, ఆ ఖర్చునంతా వేమిరెడ్డి దంపతులే భరాయించడం విశేషం. నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రిలో గుండెవ్యాధుల విభాగంలో వ్యాధిగ్రస్తులకు అవసరమైన స్కానర్, కలర్ డాప్లర్‌ల ఏర్పాటుకు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆర్థిక సాయం చేశారు. వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఎల్వీప్రసాద్ నేత్ర వైద్య విభాగంలో ఆపరేషన్ థియేటర్ నిర్మాణానికి కూడా ఆయన తమవంతు విరాళం అందించారు.

### విపిఆర్ పుట్టినరోజు.. దివ్యాంగులకు పండుగ రోజు

పుట్టిన రోజంటే కేకులు కట్ చేసుకుని పంచడం, పార్టీలు చేసుకోవడం కాదు.. మన పుట్టుక సమాజంలోని అసహాయులకు పండుగ కావాలని కోరుకునే మానవీయమూర్తి విపిఆర్, తన పుట్టినరోజైన ఏప్రిల్ 19న సేవాదినంగా నిర్వహిస్తుండడం విశేషం. 2018లో తన పుట్టినరోజునాడు కనుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్‌సెంటర్‌లో భారీఎత్తున జైపూర్ ఫుట్‌లు (కృత్రిమ కాళ్ళు) అమర్చి తన పుట్టినరోజును దివ్యాంగులకు పండుగ రోజుగా మార్చారు. ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో దివ్యాంగులు తరలివచ్చారు. వేమిరెడ్డి దంపతులు నాలుగురోజుల పాటు ఆ కార్యక్రమాన్ని నిర్వహించి, నడవలేక బాధలు పడుతున్న నిరుపేద దివ్యాంగుల జీవితాలకు అండగా నిలిచారు. ఆ నాలుగురోజుల్లోనే జిల్లావ్యాప్తంగా సుమారు 4వందల మందికి కృత్రిమ కాళ్ళను అమర్చి, ఆ దివ్యాంగులకు కొత్త జీవితాలను ప్రసాదించారు.

2018లో అల్లూరు మండలం అల్లూరుపేటకు చెందిన పెంచలస్వాతి, కడప జిల్లా మంటపంపల్లెకి చెందిన మల్లికార్జున్‌లు అనారోగ్యంతో బాధపడుతుంటే, వారి ఆరోగ్యపరిస్థితి చూసి చలించిన విపిఆర్ వెంటనే ప్రధాని నరేంద్రమోడీకి లేఖ రాయడం, ప్రధాని మోడీ వెనువెంటనే స్పందించి ఆ ఇద్దరు బాధితులకు చెరొక 3 లక్షల రూపాయలను మంజూరుచేయడం విశేషం. అదేవిధంగా, కడపజిల్లా జోగిరెడ్డిపల్లికి చెందిన లోకేశ్వరరెడ్డి, ప్రకాశం జిల్లా కందుకూరు మండలం వేంపాడు గ్రామనివాసి కోటయ్యకు, నెల్లూరు నగరానికి చెందిన అబ్దుల్‌ఖాదర్‌కు, 2020లో క్యాన్సర్‌తో బాధపడుతుండిన తమిళనాడులోని తిరువత్తూరుకు చెందిన శ్రీమతి రేవతి జయకుమార్‌కు ప్రధాని సహాయనిధి నుంచి ఒక్కొక్కరికి రూ. 3లక్షల వంతున సాయం అందడానికి విపిఆర్ చేసిన కృషి అభినందనీయం!

నెల్లూరుజిల్లా నాయుడుపేట మండలం పుదూరు గ్రామానికి చెందిన నాయుడుప్రసాద్ కుమార్తె గుండె ఆపరేషన్‌కు రూ. 3లక్షల సాయాన్ని అందించినందుకు అప్పటి జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు వేమిరెడ్డి దంపతుల దాతృత్వాన్ని అభినందించారు. అంతేకాదు, 2017లో నెల్లూరు, రామ్‌నగర్‌లోని దేవీప్రసాద్ అనే బాలుడు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుంటే, చికిత్స కోసం పెద్దమొత్తంలో తమ సాయం అందించారు.

దోమల మందు చల్లేందుకు నెల్లూరు నగరపాలక సంస్థకు ఓ ఫాగింగ్ యంత్రాన్ని, దానిని మోసుకెళ్లేందుకు ఒక ఆటోను కూడా వారు సమకూర్చారు. నెల్లూరు పెద్దాసుపత్రికి ఒక అంబులెన్స్ వాహనాన్ని కూడా విపిఆర్ తన దాతృత్వంతో ఏర్పాటుచేశారు. ఇలా ఎన్నో విధాలుగా సేవలందిస్తూ విపిఆర్ దంపతులు తమ మానవత్వాన్ని చాటుకుంటూనే ఉన్నారు.






### కరోనా కష్టకాలంలో
## అండగా నిలిచిన ప్రాణదాతలు

జిల్లాను కరోనా వ్యాధి బెంబేలెత్తిస్తున్నప్పుడు ప్రజలకు అండగా నిలిచి ఆదుకున్న దేవుడు..విపిఆర్. కోట్లాది రూపాయలు వెచ్చించి కరోనాతో కొట్టుమిట్టాడుతున్న వారి ఊపిరి ఆడేందుకు కొరత లేకుండా ప్రాణవాయువు (ఆక్సిజన్ సిలిండర్లు) తెచ్చి ప్రాణం పోశారు. విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లను, శానిటైజర్లను తెచ్చి కుప్పలు పోశారు. కరోనా బారినపడకుండా అవవసరమసైన మాస్కులు, గ్లౌజ్‌లు, శానిటైజర్లు, థర్మల్ స్కానర్లు ఏది కావాలంటే వాటినంతా కొల్లలుగా తెచ్చిపెట్టి జిల్లా ప్రజలను ఆదుకున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే, కరోనా బాధితుల కోసం ఆయన చేయని సాయం లేదు. 2020 మార్చిలో రాజ్యసభ సభ్యునిగా ఉన్నప్పుడు కరోనా నివారణ కోసం సీఎం సహాయనిధికి తన ఎంపీ నిధుల నుంచి కోటీ 65 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. అదేవిధంగా జిల్లాలో దళితులు, బడుగు బలహీనవర్గాల వారు కరోనా వైరస్ బారినపడకుండా లక్షా 50వేల శానిటైజర్లను పంపిణీ చేశారు. జిల్లాలోని మారుమూల గ్రామాలకు కూడా వాటిని తీసుకువెళ్లి అందించేందుక వాహనాలను సమకూర్చారు. తమ సొంతనిధులు లక్షలాది రూపాయలు వెచ్చించి కరోనాలో బాధితులకు అన్నగా.. అండగా తామున్నామంటూ వేమిరెడ్డి దంపతులు నిరూపించుకున్నారు.



కరోనాలో ఎటూ వెళ్ళలేక, జీవనం కరువైనప్పుడు దిక్కుతోచని స్థితిలో పస్తులుంటున్న వందలాదిమంది పేద బ్రాహ్మణ కుటుంబాల వారికి విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో మూడురోజుల పాటు ఏకధాటిగా వారికి బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు అందజేశారు. దేవుని సేవలో ఉంటూ ప్రజలను దీవించే ఆ కుటుంబాలకు అన్నానికి లోటు లేకుండా చేయూతనందించి వారిని ఆదుకున్న ఆపద్బాంధవులు వేమిరెడ్డి దంపతులే!..









## మొదలైన నామినేషన్లు

సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల పర్వం మొదలైంది. ఈ నెల 18వ తేదీ గురువారం ప్రధాన పార్టీలకు సంబంధించి పలువురు అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. కోవూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తన నామినేషన్ దాఖలు చేయగా, అదే కోవూరు నియోజకవర్గం నుండి వైకాపా అభ్యర్థిగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. సూళ్ళూరుపేట నియోజకవర్గం నుండి వైకాపా అభ్యర్థిగా కిలివేటి సంజీవయ్య, నెల్లూరు రూరల్ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కావలి నియోజకవర్గం నుండి వైకాపా అభ్యర్థిగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలు తమ నామినేషన్‌లు దాఖలు చేశారు.

# సోమిరెడ్డికి అండగా శేషన్న

- కాంగ్రెస్ నుంచి టీడీపీకి మద్దతుగా సీవీ
- సర్వేపల్లి రాజకీయాల్లో సంచలనం



జిల్లాలో కరడుగట్టిన కాంగ్రెస్‌వాది, తన జీవితాన్నే కాంగ్రెస్ పార్టీకి అంకితం చేసిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సీవీ శేషారెడ్డి తెలుగుదేశం నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గూటికి చేరిపోవడం జిల్లాలో సంచలనం కలిగించింది. సర్వేపల్లిలో జరుగుతున్న అరాచక పాలన నుంచి ప్రజలకు విముక్తి కల్పించేందుకే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు సీవీ శేషారెడ్డి ప్రకటించారు. ఈనెల 18న సోమిరెడ్డి సమక్షంలో ఆయన నెల్లూరులో విలేకర్లతో మాట్లాడుతూ, సర్వేపల్లి నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి తన సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నానన్నారు. 65 ఏళ్ల రాజకీయ జీవితంలో తానెప్పుడూ ఇలాంటి వికృత పాలనను చూడలేదన్నారు. తాను పదేళ్లు ఎమ్మెల్యేగా పనిచేసినా, మరో పదేళ్లు సోమిరెడ్డి ఎమ్మెల్యేగా కొనసాగినా సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశామని, జిల్లాలోనే ఆదర్శ నియోజకవర్గంగా సర్వేపల్లిని నిలబెట్టాలని నిరంతరం శ్రమించామని ఆయన చెప్పారు. తుఫాన్లను సైతం లెక్కచేయకుండా ప్రజల కోసం కష్టపడ్డామని, బకింగ్‌హాం కెనాల్ ఆవల ఉన్న మత్స్యకారులకు మెరక ప్రాంతంలో నివేశన స్థలాలు కేటాయించడంతో పాటు ఇళ్లు కట్టించామని, రోడ్ల నిర్మాణంలోనూ ముందు నిలిచి, ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పనిచేశామని తెలిపారు. ఏ ఊరికి వెళ్లినా కాంగ్రెస్ హయాంలో తాను, టీడీపీ హయాంలో సోమిరెడ్డి చేసిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయన్నారు. అయితే, ప్రశాంతతకు మారుపేరైన సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రస్తుతం నీతి, నిజాయితీ లేని అరాచక పాలన సాగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుక, గ్రావెల్, వైట్ క్వార్జ్ తదితర ప్రకృతి సంపద దోపిడీకి గురవుతున్న నియోజకవర్గంగా సర్వేపల్లికి పేరు రావడం చాలా బాధగా ఉందన్నారు. ఈ అప్రజాస్వామిక పరిస్థితుల నుంచి సర్వేపల్లి ప్రజలకు విముక్తి కల్పించేందుకు, కాంగ్రెస్‌తో ఉన్న 65 ఏళ్ళ అనుబంధాన్ని వదులుకుని సోమిరెడ్డికి అండగా నిలుస్తున్నానన్నారు. ఈ సమావేశంలో సీవీతో పాటు, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కనగట్ల రఘురాం ముదిరాజ్, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య పాల్గొన్నారు.

## ఓటర్ల లెక్క తేలింది...



### నెల్లూరు జిల్లాలో మొత్తం ఓటర్లు 19 లక్షల 36 వేల 817 మంది

రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఓటేయడానికి అర్హత ఉన్న నెల్లూరుజిల్లా జనాభా లెక్క అధికారికంగా ప్రకటించారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలలో పురుషులు, స్త్రీలు, థర్డ్ జెండర్‌కి చెందిన వారూ మొత్తం కలిసి 19,36,817 మంది ఓటర్లు ఉన్నట్లుగా తేల్చారు.

**నెల్లూరు నగరంలో**
పురుషులు : 1,16,230
స్త్రీలు: 1,22,168
థర్డ్ జెండర్ : 67

**నెల్లూరు రూరర్‌లో**
పురుషులు : 1,35,677
స్త్రీలు: 1,43,192
థర్డ్ జెండర్ : 20

**కోవూరులో**
పురుషులు : 1,28,614
స్త్రీలు: 1,37,911
థర్డ్ జెండర్ : 25

**సర్వేపల్లిలో**
పురుషులు : 1,12,536
స్త్రీలు: 1,18,896
థర్డ్ జెండర్ : 26

**ఆత్మకూరులో**
పురుషులు : 1,05,482
స్త్రీలు: 1,09,164
థర్డ్ జెండర్ : 8

**కావలిలో**
పురుషులు : 1,16,745
స్త్రీలు: 1,21,036
థర్డ్ జెండర్ : 28

**ఉదయగిరిలో**
పురుషులు : 1,19,458
స్త్రీలు: 1,21,190
థర్డ్ జెండర్ : 10

**కందుకూరులో**
పురుషులు : 1,12,921
స్త్రీలు: 1,15,387
థర్డ్ జెండర్ : 26

# జీతాలు ఇప్పించండి సారూ!

- డిఆర్‌ఓకు మునిసిపల్ కార్మికుల వినతి

మార్చి నెల జీతాలు ఇంకా తమకు ఇవ్వలేదని, హెల్త్ అలవెన్సులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని మునిసిపల్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు జీతాలిప్పించాలని కోరుతూ మునిసిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె. పెంచలనరసయ్య ఆధ్వర్యంలో ఇటీవల డిఆర్‌ఓ లవన్నకు వినతిపత్రం సమర్పించారు. జిల్లాలోని కావలి, ఆత్మకూరు మునిసిపాలిటీల్లో కూడా గత రెండు నెలలుగా జీతాలివ్వలేదని, దీంతో తమ కుటుంబాలు ఆర్థికంగా ఇక్కట్లు పడుతున్నాయని వారు డిఆర్‌ఓకు తెలిపారు. సంక్రాంతి కానుకగా ఇస్తామన్న వెయ్యి రూపాయలు కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. అసోసియేషన్ జిల్లా నాయకురాలు కామాక్షమ్మ పాల్గొన్నారు.

# సముద్రంలో చేపలవేట నిషేధం



సముద్ర జలాల్లో చేపల వేటను నిషేధిస్తున్నామని, ఈనెల 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజుల పాటు వేటను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చిందని జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. చేపలు, రొయ్యల జాతులకిది సంతానోత్పత్తి సమయం కనుక, వాటిని సంరక్షించాలనే ధ్యేయంతో వేట నిషేధించినట్లు పేర్కొన్నారు. ఈ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. చేపల వేట జరగకుండా మత్స్యశాఖ, కోస్ట్‌గార్డు, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, ఎప్పటికప్పుడు నిఘాపెట్టి గస్తీ కాస్తుంటారని ఆయన పేర్కొన్నారు.




లాయర్
ఏప్రిల్ 19, 2024

# డొల్లగా మారిపోతున్న వీఐపీల భద్రత

ఎంతో పటిష్టంగా ఉండాల్సిన మన భద్రతా వ్యవస్థ డొల్లగా మారిపోతోంది. సామాన్యులకే కాదు, వీఐపీలకు కూడా భద్రత అన్నది ఒక కల్లగా తయారవుతోంది. సాధారణ రోజుల్లోనే కాదు, ఎన్నికల సమయాల్లో కూడా భద్రతా వ్యవస్థ పనితీరు అస్తవ్యస్తంగానే ఉందనడానికి మొన్నటికి మొన్న ముఖ్యమంత్రి జగన్‌పైనే రాయి దాడి ఘటన ఒక నిదర్శనం. కొద్ది రోజుల క్రితం చిలకలూరిపేటలో జరిగిన ప్రధాని నరేంద్రమోడీ సభలోనూ భద్రతా వైఫల్యం కొట్టవచ్చినట్లు కనిపించింది. ప్రజాప్రతినిధులు, ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్నవారి పరిస్థితే అలా ఉంటే ఇక మామూలు జనానికేం భద్రత ఉంటుందన్నది ఎక్కడ బట్టినా చర్చగా ఉంది. ఏదో ఒక అవాంఛనీయ ఘటన జరిగినప్పుడు మాత్రం విచారణలనీ, తనిఖీలనీ పరుగులుపెట్టడం, కొద్ది రోజులు గడిచాక అవన్నీ మూలనపడడం సర్వసాధారణమైపోయింది. వీఐపీల పర్యటనలో ఉన్నతాధికారులు తీసుకోవాల్సినంత జాగ్రత్తలు తీసుకోకపోవడం ఇందుకు ప్రధాన కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. అందులోనూ, ఎన్నికలు చాలా దగ్గరకి వచ్చేసిన ఈ తరుణంలో ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న పరిణామలు ప్రజలకు ఆందోళన కలిగిస్తున్నాయి. నాయకులపై దాడులు, హింసాత్మక సంఘటనలు పెరుగుతున్నా, చివరికి ముఖ్యమంత్రి-ప్రధానమంత్రి వంటి వీవీఐపీల పర్యటనల్లోనూ భద్రతా వ్యవస్థ లోపాలు సర్వత్రా ఆరోపణలకు గురవుతున్నాయి. ఇంత జరుగుతున్నా ఎంతో కట్టుదిట్టమైనదనుకుంటున్న నిఘా వ్యవస్థ, మెరికల్లాంటి పోలీసు బృందాలు ఏం చేస్తున్నాయనే ప్రశ్నలే సామాన్యుల నుంచి కూడా. ముఖ్యమంత్రి జగన్ బస్సుయాత్రలో ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరం.. దారుణం కూడా. ఇలాంటి సంఘటనలు కేవలం పార్టీలపైనే కాదు, ప్రజలపై కూడా గాఢమైన ప్రభావం చూపుతుందనేది అందరికీ తెలిసిన విషయమే. విజయవాడ సభలో సీఎం జగన్‌పై దుండగులెవరో రాయి విసరడం, అది ఆయన ఎడమకంటి పైభాగంలో తగలడం, అదృష్టవశాత్తూ ఆ సమయంలో ఆయన ప్రజలకు అభివాదం చేస్తూ పక్కకు తిరగడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాల్సిన భద్రతా సిబ్బంది పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీఎం పర్యటన ప్రాంతాల్లో కరెంటు లేకపోవడం ఏమిటన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా ఉంది. ఒకవేళ కరెంటు లేదనుకున్నా, ఇక ప్రత్యామ్నాయ ఏర్పాట్లేమీ లేవా? అన్నది సామాన్యుల ధర్మసందేహం. ఆ సమయంలో కరెంటు లేకపోవడం, రాత్రివేళ కావడం..అలాంటి పరిస్థితుల్లో ఉన్నతాధికారులు ముందుజాగ్రత్తగా, భద్రతాపరంగా ఎలాంటి చర్యలు తీసుకున్నారన్నది ప్రశ్నార్ధకంగా ఉంది. కరెంటు లేనప్పుడు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేయలేదు. కరెంటు పోవడం వెనుక అసలు కారణాలేమిటన్నది కూడా నిగ్గు తేల్చాల్సి ఉంది. ఇలాంటి ఘటనలకు పాల్పడి పైశాచికానందం పొందే అరాచక శక్తులు ఎప్పుడు అదను దొరుకుతుందా అని కాచుకుని ఉంటాయన్నది భద్రతా వ్యవస్థకు తెలియనిది కాదు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా, జరగరాని ఘోరాలు జరిగిపోయిన ఘటనలు గతంలో ఎన్నో ఉన్నాయి. భద్రతా వ్యవస్థ ఇకనైనా మేల్కోవాలి. దుష్టశక్తుల భరతం పట్టడానికి అన్ని చర్యలు పటిష్టంగా తీసుకోవాలి. సీఎంపై జరిగిన రాయిదాడిపై ప్రత్యేకించి కేంద్ర ఎన్నికల సంఘం కూడా చాలా సీరియస్‌గా ఉంది. ఘటన ఎలా జరిగిందో సంబంధిత అధికారులను ఆరా తీసినట్లు కూడా సమాచారం. ప్రధాని సభలో భద్రతా వైఫల్యాల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవలే సంబంధిత పోలీసు ఉన్నతాధికారులపై బదిలీ వేటు కూడా వేసింది. అయినా చలనం రావడం లేదంటే ఏమనుకోవాలి?.. కేంద్ర ఎన్నికల సంఘం కొరడా పట్టుకుంటే తప్ప ఈ పరిస్థితులు చక్కబడేలా కనిపించడం లేదు. అందులోనూ ఎన్నికల ప్రచారాలప్పుడు నాయకుల భద్రత ఇంత లోపభూయిష్టంగా ఉండడం, ఎన్నికలు దగ్గరపడేకొద్దీ పలుచోట్ల హింసాత్మక ఘటనలు కూడా జరుగుతుండడం విచారకరం. చివరికి సీఎం, పీఎం వంటి ముఖ్యనేతల పర్యటనల్లో కూడా భద్రత లేకపోవడం ఎంత ఘోరమోనంటూ దేశమంతా గగ్గోలుగా ఉంది. ఇకనైనా ఉన్నతాధికారులు సీఎంపై రాయి దాడి ఘటనలో విచారణ వేగవంతం చేసి దుష్టులను పట్టుకుని శిక్షించేలా గట్టి చర్యలు తీసుకోవాలి. ప్రజల రక్షణకు, నేతల భద్రతకు కంటికి రెప్పలా ఉండాల్సిన భద్రత-నిఘా వ్యవస్థలు బలోపేతంగా ఉండేలా చూసుకోవాలి. వీఐపీలు, నేతలు, పార్టీల అధినేతలు, ప్రజాప్రతినిధుల రక్షణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కట్టుదిట్టమైన ప్రణాళికతో భద్రతా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలి.




# అన్నపై చెల్లెళ్ళ యుద్ధం!

"ఆడబిడ్డ కంటతడి పెడితే ఇంటికి అరిష్టం". "ఆడపిల్ల మనసు కష్టపెట్టుకుంటే కుటుంబానికి మంచిది కాదు". ఇవి అనాదిగా మన పూర్వీకులు మనకి నూరి పోస్తున్న మాటలు. ప్రతి కుటుంబంలో ఇప్పటికీ మన పెద్దలు మనకి బోధించే నీతి సూత్రాలు. తమ తోబుట్టువులైన చెల్లెళ్లని, అక్కలని తమ అమ్మలతో సమానంగా చూసుకోవాలన్నది వారి ఆలోచన కావొచ్చు. ఆడపిల్లలని మగవారు చిన్నచూపు చూస్తే అది ఆ కుటుంబానికే అరిష్టమని పాత తరాల వారి ఆలోచన, అభిప్రాయం. అదే విధంగా తమ తోబుట్టువైన అన్నలు, తమ్ముళ్లు బాగుండాలని, నిండు నూరేళ్లు ఆయురోగ్యాలతో జీవించి తమకి రక్షణగా ఉండాలని అక్కచెల్లెళ్ళు కూడా కోరుకోవాలి. తరతరాలుగా ఇది సంప్రదాయంగా వస్తోంది.

## సంప్రదాయానికి భిన్నంగా వై.ఎస్. ఇంటి ఆడపడుచులు!

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి కుటుంబంలో పై ఆనవాయితీకి భిన్నంగా అన్నాచెల్లెళ్ల బంధం కొనసాగుతోంది. ఆత్మీయత అనురాగానికి బదులుగా విద్వేషం, విమర్శల పర్వంగా ప్రజ్వరిల్లుతోంది. పగా ప్రతీకారాలతో రగిలిపోతోంది. పరస్పర దూషణలతో వై.ఎస్ ప్రతిష్టని మసకబారుస్తోంది.

రాజశేఖరరెడ్డి తనయ వై.ఎస్.షర్మిల, వైఎస్సార్ తమ్ముడు వై.ఎస్.వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీత కలిసి సాక్షాత్తూ తమ అన్న, ఆంధ్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై ధ్వజమెత్తుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ జగన్‌మోహన్‌రెడ్డిని జైల్లో పెట్టినప్పుడు తన అన్నకి మద్దతుగా మూడువేల కిలోమీటర్లకుపైగా పాదయాత్ర చేసింది షర్మిల. తన అన్నని జైలు పాలు చేసిన అదే కాంగ్రెస్‌పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలి హోదాలో ఇప్పుడు ఆమె తన అన్నని ఓడించమంటుంది. "బాయ్.. బాయ్ బాబూ" అంటూ తన జగనన్న కోసం జనం మధ్యలో తిరిగిన వై.ఎస్. కుటుంబ ఆడపడుచే ఇప్పుడు "బాయ్... బాయ్ జగన్" అంటూ స్వరం మార్చి తన అన్న జగన్‌కి వ్యతిరేకంగా ప్రచారాన్ని హోరెత్తిస్తోంది.

## ఒకరిది ఆరాటం... ఇంకొకరిది పోరాటం...!

జగన్‌మోహన్‌రెడ్డి 2019లో అధికారంలోకి వచ్చేవరకూ అన్నాచెల్లెళ్లిద్దరూ బాగానే ఉన్నారు. ఒకరి కోసం ఒకరు అన్నట్లుగా వారి అనుబంధం కొనసాగింది. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆ కుటుంబంలో ఏం జరిగిందో ఎవరికీ తెలియదు. అది పూర్తిగా వారి వ్యక్తిగతం. చాలా కుటుంబాలలో లాగా ఇది కూడా ఇంటింటి రామాయణమే కదా... అనుకోవడానికి వారిది సాధారణ కుటుంబం కాదు. అది వై.ఎస్ కుటుంబం. ప్రజలతో సంబంధమున్న కుటుంబం. ప్రజలు అభిమానించి ఆరాధించే కుటుంబం. అలాంటి కుటుంబంలో ఏ చిన్న సంఘటన జరిగినా ప్రజలు పట్టించుకుంటారు, చర్చించుకుంటారు. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలలో అదే జరుగుతోంది. అన్నాచెల్లెళ్ల రొచ్చే రచ్చబండ చర్చగా మారింది.

నాడు వై.ఎస్.కి నేడు జగన్‌కి బద్ధశత్రువుగా జనం భావించే ఏబీఎన్ ఛానెల్ మెట్లు తొక్కిన రోజే షర్మిల తన తండ్రి రాజశేఖరరెడ్డి సిద్ధాంతాలకు నీళ్ళొదిలేసినట్లు, తన అన్న జగన్‌మోహన్‌రెడ్డిని వ్యతిరేకించబోతున్నట్లు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. వై.ఎస్. వారసుడిగా ఆంధ్రాలో జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించినట్లుగా, తెలంగాణలో తనను కూడా ప్రజలు ఆదరిస్తారని భావించి అక్కడ పార్టీ పెట్టి భంగపడ్డారు. ఇప్పడు కాంగ్రెస్‌పార్టీలో చేరి తాను రాజశేఖర బిడ్డనని, ఆంధ్రుల ఆడపడుచునని చెప్పుకుంటూ ప్రజాక్షేత్రంలో తిరుగుతున్నారు. ఏకంగా కడప గడప నుండే పార్లమెంటు అభ్యర్థిగా బరిలో దిగి, నన్ను ఆదరించండి అంటూ కొంగు చాచి అభ్యర్థిస్తున్నారు. ప్రతి సభలోనూ జగన్‌మోహన్‌రెడ్డిని గడచిన ఐదేళ్లలో ఆయన పాలనని దుయ్యబడుతూ విమర్శలు గుప్పిస్తున్నారు. తనకీ తన అన్నకీ అస్సలు పొసగడం లేదన్న విషయాన్ని ఈ చర్యలన్నిటి ద్వారా షర్మిల స్పష్టం చేశారు. రాజశేఖరరెడ్డి కూతురుగా, జగన్ చెల్లెలుగా తాను కూడా ఏదో ఒక రాజకీయ పదవిని చేపట్టాలన్న ఆమె ఆరాటాన్ని షర్మిల చెప్పకనే చెపుతున్నారు.

## షర్మిలకు తోడుగా సునీత!

వై.ఎస్.రాజశేఖరరెడ్డి తమ్ముడు వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీత కూడా షర్మిలకు తోడయ్యారు. తన తండ్రిని దారుణంగా చంపినవారికి జగన్ కాపు కాస్తున్నాడంటూ ఆమె ధ్వజమెత్తుతున్నారు. సాక్ష్యాధారాలతో సహా నిందితుల వివరాలను బట్టబయలు చేస్తున్నారు. నిజానికి 2019 ఎన్నికల తరుణంలోనే వివేకా హత్య జరిగింది. అప్పుడు షర్మిల జగన్‌వైపే ఉన్నారు. ఆ తరువాత కుటుంబంలో జరిగిన అంతర్గత పరిణామాల వల్ల షర్మిల బయటపడి ఇప్పుడు సునీతకి వత్తాసు పలుకుతున్నారు. తన తండ్రిని దారుణంగా చంపి గుండెపోటుగా చిత్రీకరించిన వారికి శిక్ష పడేలా చేయాలన్నదే సునీత లక్ష్యం. అందుకోసం ఆమె పలుమార్లు సుప్రీం కోర్టుని ఆశ్రయించారు. సిబిఐ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. సునీతలోని కోపాన్ని, కసిని గమనించిన కొన్ని పార్టీలు ఆ కుటుంబాన్ని కూడా ప్రత్యక్ష రాజకీయాలలోకి లాగాలని చూశారు. కానీ, అందుకు ఆ కుటుంబం ఆసక్తి చూపలేదు. తమ కుటుంబ పెద్దదిక్కుని అతి దారుణంగా చంపినవారికి కఠినంగా శిక్ష పడాలన్నదే తమ ధ్యేయం అని స్పష్టం చేశారు.

పదవి కోసం ఆరాటంతో ఒకరు, న్యాయం కోసం పోరాటంతో ఒకరూ... ఇద్దరు చెల్లెళ్ళు జగన్‌పై యుద్ధం ప్రకటించారు. అంతిమ విజయం ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే!

- రాజశ్రీ

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

# వీపీఆర్‌తో విజయసాయికి పోలికా?

తాజాగా నెల్లూరుజిల్లాలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు చూస్తుంటే రాజకీయాలు ఇంత దగజారాయా అనిపిస్తోంది. ముఖ్యంగా నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న విజయసాయిరెడ్డిని వేమిరెడ్డి ప్రభాకరరెడ్డితో పోల్చి వైసీపీ నాయకులు మాట్లాడడం విడ్డురంగా వుంది. నాకు తెలిసి ప్రభాకరయ్య గత ఇరవై అయిదేళ్ల నుండి సేవారంగంలో ఉన్నాడు. అనాథలని ఆదుకుంటున్నాడు. ఎన్నో వృద్ధాశ్రమాలకి అండగా నిలిచాడు. పేద పిల్లల కోసం కార్పొరేట్ స్కూల్ కట్టాడు. ఆసుపత్రిని కూడా ఏర్పాటు చేసి ఉచిత వైద్యం అందిస్తున్నాడు. ఆధ్యాత్మికంగా ప్రభాకరరెడ్డి చేసే కార్యక్రమాలకి కొదవే లేదు. ఎక్కడ ఎవరికి ఏ కష్టం వచ్చిందన్నా స్పందిస్తూనే ఉన్నాడు. పాత తరంలో రేబాల, దొడ్ల కుటుంబాల వారిది దానగుణంలో ఆరితేరిన చేయి. వారి తరువాతి తరంలో మాగుంట సుబ్బరామిరెడ్డి అంతే స్థాయిలో పేరు తెచ్చుకున్నారు. ప్రస్తుత కాలంలో ప్రభాకరరెడ్డి తన పేరు చిరస్థాయిగా నిలిచేలా ఎన్నో పనులు చేయించాడు, చేయిస్తున్నాడు కూడా. అలాంటి ప్రభాకరరెడ్డితో విజయసాయిరెడ్డిని పోల్చి రాజకీయ నాయకులు మాట్లాడడం బాగాలేదు. సాయిరెడ్డి నెల్లూరువాడే కావచ్చు కానీ, ఆయన నెల్లూరుకు ఒరగబెట్టిందేమీ లేదు. కనీసం ఈ ఎనిమిదేళ్ల కాలంలో రాజ్యసభ సభ్యుడిగా కూడా చెప్పుకోదగ్గ పని ఒక్కటి కూడా సాయిరెడ్డి నెల్లూరుకి చేయలేదు. దాన గుణంలోను, దైవ సేవలోను, సామాజిక స్పృహలోను ప్రభాకరరెడ్డితో ఎక్కడా సరి తూగలేని వ్యక్తి సాయిరెడ్డి. అలాంటి వ్యక్తిని ప్రభాకరరెడ్డితో పోల్చడం సరికాదు!

కే.సుదర్శన్‌రెడ్డి, విశాఖపట్టణం.

# మద్యం తాగి వెళ్తే ఓటేయనీయకూడదు!

సినీ నటులు ఎల్.బి.శ్రీరామ్ స్వీయ దర్శకత్వంలో తానే నిర్మించిన మూడున్నర నిముషాల నిడివివున్న 'మత్తు వదలరా' అన్న లఘుచిత్రం ప్రతిఒక్కరూ చూసి తీరాల్సిందే. ఇటీవల సామాజిక మాధ్యమాలలో ఈ చిత్రం చక్కర్లు కొడుతోంది. ప్రభుత్వ ఉద్యోగి, వాహన డ్రైవర్, ఆపరేషన్ చేసే డాక్టర్ మద్యం సేవించి తమ విధులు నిర్వహిస్తే వారిని ఉద్యోగాలనుండి తొలగిస్తున్నాం. అలాంటప్పుడు మన భవిష్యత్తును నిర్ణయించే నాయకులను ఎన్నుకునేటప్పుడు ఫుల్లుగా మందు కొట్టి ఓటు వేయడం ఎంతవరకు సమంజసం అన్నది ఈ "మత్తు వదలరా" సారాంశం. పోలింగు బూతుల దగ్గర కూడా బ్రీత్ ఎనలైజర్ యంత్రం పెట్టాలని, మందు కొట్టిన వాడిని ఓటేయకుండా అడ్డుకునేలా నియంత్రించాలని ఇటీవల ఒక సామాజిక కార్యకర్త న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించారు. అది అసాధ్యం అంటూ కోర్టులు ఆ అభ్యర్థనని త్రోసిపుచ్చాయి. ఫుల్లుగా తాగేసి ఆ మత్తులో విచక్షణ లేకుండా వేసే ఓటును అడ్డుకునే ప్రయత్నం మంచిదే. ఈ విషయంపై న్యాయస్థానాలు పునరాలోచించి చుక్కేసుకుని పోలింగు బూత్‌కి వచ్చేవాళ్ల వేలుకి చుక్క వేయకుండా వుండేలా చర్యలు చేపట్టాలి. మందు తాగి ఓటింగుకి వచ్చేవాళ్ళని ఓటేయనీయకుండా అడ్డుకోవాలి!

లక్ష్మీభరద్వాజ్, హైదరాబాదు.


పుట్టినరోజు
శుభాకాంక్షలు
నిరంతర భక్తితత్వపరాయణులు, నిస్వార్థ సమాజసేవకులు
మంచితనం, మానవత్వం మూర్తీభవించిన
మా కుటుంబ శ్రేయోభిలాషులు
'సేవాభూషణ్'
శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గారికి
పుట్టినరోజు (ఏప్రిల్ 19) శుభాకాంక్షలు.
కాటంరెడ్డి రవీంద్రరెడ్డి - కాటంరెడ్డి ప్రసూన
డాక్టర్ కాటంరెడ్డి కౌషిక్‌రెడ్డి
డాక్టర్ కాటంరెడ్డి ప్రజిత్‌రెడ్డి
నెల్లూరు



# శ్రీధరకృష్ణారెడ్డి సేవలు మరువలేనివి

**- విపిఆర్**

నెల్లూరు సిటీ మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి సేవలు మరచిపోలేనివని నెల్లూరు పార్లమెంటు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఇటీవల నెల్లూరులోని కళ్యాణ మండపంలో ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి అభిమానులు నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, గతంలో నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా విశేష సేవలు అందించిన శ్రీధరకృష్ణారెడ్డి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. శ్రీధరకృష్ణారెడ్డి ఎన్నో మంచిపనులు చేసి రాష్ట్రవ్యాప్తంగా నగరానికి ఒక గుర్తింపుని తీసుకొచ్చారని ఆయన కొనియాడారు. ఆయన ఆశయాల సాధనలో నడుస్తూ నెల్లూరు నగరాభివృద్ధికి, జిల్లా అభ్యున్నతికి పాటుపడతామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీధరకృష్ణారెడ్డి కుమారులు చైతన్యరెడ్డి, శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## వేడుకగా శ్రీరామనవమి



శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఈ నెల 17న నెల్లూరులోని రామాలయాలలో వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీ సీతారాముల వారికి పూజలు, కళ్యాణోత్సవాలు కన్నుల పండువగా నిర్వహించారు. నగరంలో శబరి శ్రీరామక్షేత్రం ఎదురుగావున్న శ్రీరామకోటి స్థూప ప్రాంగణంలో సీతారాముల కళ్యాణం నయనానందకరంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులందరికీ నిర్వాహకులు అన్నప్రసాదాలు అందజేశారు.

## శ్రీ త్యాగరాజ మందిరంలో...





శ్రీరామనవమి పండుగ సందర్భంగా నెల్లూరు, వేదాయపాళెంలోని శ్రీ త్యాగరాజ మందిరంలో పెద్దఎత్తున వేడుకలు జరిగాయి. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీ సీతారాముల కళ్యాణాన్ని కళ్లారా తిలకించారు. మందిరం ధర్మకర్తలు, నిర్వాహక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నవమి వేడుకలు నయనానందకరంగా జరిగాయి.

# నెల్లూరు అభివృద్ధికి ఎంతగానో కృషిచేశా

**- నెల్లూరు నగర టీడీపీ అభ్యర్థి డా. నారాయణ**



గతంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో నెల్లూరును ఎంతో అభివృద్ధి చేశానని, నెల్లూరు ప్రజల కోసం టిడ్కో ఇళ్లు కట్టించానని, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి పథకం, పార్కులు, నెక్లెస్‌రోడ్డు, రోడ్లు, అన్నక్యాంటీన్లు, ఏసీ బస్‌షెల్టర్లు..ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో అభివృద్ధి సంక్షేమ పనులు చేశానని మాజీమంత్రి, నెల్లూరు నగర టీడీపీ అభ్యర్థి డా. నారాయణ చెప్పారు. ఈనెల 17న నెల్లూరులోని 48వ డివిజన్‌లో ఏర్పాటుచేసిన విశ్వబ్రాహ్మణుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరాభివృద్ధి చేసేందుకు వివిధ రకాల పనులు చేపట్టి అమలు చేస్తున్న తరుణంలో ఎన్నికలొచ్చి వైకాపా అధికారంలోకి రావడంతో, ఆ అభివృద్ధిని కొనసాగించకుండా తాము చేపట్టిన పథకాలన్నింటినీ ఆపివేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని ఆయన పేర్కొన్నారు.

### విశ్వబ్రాహ్మణులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తాం

రానున్న ఎన్నికల్లో తాము గెలిచి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విశ్వబ్రాహ్మణులకు నామినేటెడ్ పదవులతో పాటు తగిన ప్రాధాన్యత ఇస్తామని నారాయణ హామీ ఇచ్చారు. ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ పాల్గొన్నారు.

## ఇంటర్‌లో డా.కిషోర్స్ రత్నం

# విద్యార్థుల విజయకేతనం



ఇటీవల విడుదలైన ఇంటర్ మొదటిసంవత్సరం ఫలితాల్లో నెల్లూరులోని డా.కిషోర్స్ రత్నం జూనియర్ కాలేజీ విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలు నిరూపించుకుని ఉత్తమ ఫలితాలు సాధించారు. బైపీసీలో సి.జాహ్నవి 440 మార్కులకు 436 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో అగ్రగామిగా నిలిచిందని రత్నం విద్యాసంస్థల డైరెక్టర్లు డా.కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా, బైపీసీలో మరో విద్యార్థిని కె.సుశ్రీత 433 మార్కులు సాధించి ఉత్తమంగా రాణించిందన్నారు. ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను జి.మునిసాయి రేవంత్ 463, కె.నీహారిక 460, టి.సాయి తేజశ్రీ 461 మార్కులు సాధించారని వారు పేర్కొన్నారు. బైపీసీలో 415 మార్కులకు పైగా సాధించిన వారు 9 మంది తమ విద్యాసంస్థల విద్యార్థులు కావడం పట్ల వారు ఆనందిస్తూ, ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు. ఈ విజయానికి కారణం..రత్నం విద్యాసంస్థల వ్యవస్థాపకులైన స్వర్గీయ కె.వి రత్నం ఆశీస్సులే అని వారు పేర్కొన్నారు. ఉత్తమ విద్యాబోధన చేస్తూ, ఉత్తమ ఫలితాలు వచ్చేందుకు కృషి చేస్తున్న అధ్యాపక బృందాన్ని వారు ఈ సందర్భంగా అభినందించారు. ఈ అభినందన కార్యక్రమంలో రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామమూర్తినాయుడు, ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్, అకడమిక్ అడ్వయిజర్ నరసయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు వస్తేనే..

# అన్ని వర్గాలకు న్యాయం



చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) చెప్పారు. ఇటీవల నెల్లూరులోని ఆయన నివాసంలో రాష్ట్ర పెన్షనర్ల సంఘం నాయకులు విపిఆర్‌ను, ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డిని కలిసి రాష్ట్రంలో పెన్షనర్లు పడుతున్న ఇబ్బందులు ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా విపిఆర్ మాట్లాడుతూ, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని సమస్యలు తీరుస్తామన్నారు. తొలుత 'చంద్రబాబు గెలుపు–పెన్షనర్ల పిలుపు' కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ఐ.లక్ష్మీనారాయణ, ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ నాయకులు పూర్ణచంద్రరావు, పి. గురవయ్య, మెడికల్ అండ్ హెల్త్ ఎన్జీవో అసోసియేషన్ నాయకులు విజయ్‌చౌదరి, ఆలిండియా సెక్రటరీ పెన్షన్ అసోసియేషన్ నాయకుడు పి. నాగరాజు, శ్రీనివాసరావు, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్‌లో సత్తాచాటిన..

# 'విశ్వసాయి' విద్యార్థులు




ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో నెల్లూరులోని విశ్వసాయి కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి తమ సత్తా చాటుకున్నారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో జి.చరిత, సిహెచ్ సాయిసురేష్, ఎన్.విజయరాముడు, జి.లిఖితలు 476 మార్కులకు 465 మార్కులు సాధించడం విశేషం. అదేవిధంగా బైపీసీలో ఓ.శ్రావ్యారెడ్డి 440మార్కులకు 435 మార్కులు, షేక్ రిజ్వాన్, ఎం.లాలసలు 434 మార్కుల వంతున సాధించగా, ఎంఇసిలో షన్ముక్ లోకేజిత్ 500 మార్కులకు 477 మార్కులతో ఉత్తమశ్రేణిలో నిలిచారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో ఇ.వెంకటలక్ష్మి 1000 మార్కులకు 985, జి.మధుసూదన్ 985, ఎం.వేదాంతకుమార్ 984, బి.లోకేష్ 983 మార్కులు సాధించగా, బైపీసీలో 1000 మార్కులకు వి.భాషిత 990, డి.అక్షిత 987, ఎం.అశ్వంత్‌కుమార్ 986, వై.గురుచంద్రిక 986 మార్కులు, ఎంఇసిలో 1000 మార్కులకు ఎం.డి గుఫ్రాన్ 979 వంతున మార్కులు సాధించి కళాశాల పేరు నిలబెట్టారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల ఛైర్మెన్ డా.ఎన్ సత్యనారాయణ, వైస్ ఛైర్మెన్ జి.కృష్ణమోహన్, ఛైర్‌పర్సన్ రుక్మిణిలతో పాటు అధ్యాపకులు అభినందించారు.






# ఎన్నెస్కే సాహితీ సేవలు స్ఫూర్తిదాయకం




మహనీయుల జీవితాలు ఆదర్శనీయమని, అందరూ వారిని స్ఫూర్తిగా తీసుకుని సమాజాభివృద్ధికి పాటుపడాలని విశ్రాంత తెలుగు పండితులు విద్వాన్ ఆలూరి శిరోమణి శర్మ పేర్కొన్నారు. నెల్లూరు వర్ధమాన సమాజం ఆధ్వర్యంలో ఈనెల 16న జరిగిన 'నెలనూతల శ్రీ కృష్ణమూర్తి (ఎన్నెస్కే) 19వ స్మారకోపన్యాస కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎన్నెస్కే జీవితం ఆదర్శప్రాయమని, తెలుగు, ఇంగ్లీష్ సాహిత్యాలకి, చరిత్ర పరిశోధనకు ఆయన సేవలు అపురూపమని అన్నారు. వర్ధమాన సమాజ కార్యదర్శి మజ్జిగ ప్రభాకరరెడ్డి అధ్యక్షత వహించగా, సాహితీవేత్త డా.కాళిదాసు పురుషోత్తం, వీఆర్‌సి విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, దుర్భా మురళీకృష్ణ, సీవీఎల్ నరసింహం, చక్రాల ఆనందకుమార్, కె.రవీంద్ర, డాక్టర్ జీ.వీ. రమణమూర్తి, ఎం.వి. కృష్ణకుమార్, డాక్టర్ అమరా వెంకటేశ్వరరావు, పీ.ఎస్. మహదేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యావంతుడు.. సేవాతత్పరుడు.. యువ నాయకుడు..

# ఉదయగిరి ముద్దుబిడ్డ కాకర్ల



అమెరికాలో ఉద్యోగం ఉన్నా పుట్టిన గడ్డకు సేవలందించాలనే తపనతో స్వస్థలానికి తిరిగొచ్చేసిన సమాజసేవాభిలాషి. పేదలకు, అసహాయులకు తనవంతు చేయూతనందించాలనే సదాశయం కలిగిన మానవతా వాది. అందులోనూ సహృదయుడు.. స్నేహశీలి.. సౌజన్యమూర్తి. ఆయనెవరో కాదు.. ఉదయగిరి ఆణిముత్యం.. మెట్టప్రాంత ముద్దుబిడ్డ.. కాకర్ల సురేష్!.. ధనసంపాదన కోసమో, కీర్తికోసమో కాక, తాను జన్మించిన ఉదయగిరి నియోజకవర్గ ప్రజలకు తనవంతు సేవచేసి జీవితాన్ని సార్ధకత చేసుకోవాలనుకున్నదే ఆయన ఆశయం. ఇప్పటికే నియోజకవర్గంలో ఎనలేని సేవలందిస్తున్న కాకర్ల, తన సేవలను ప్రజలకు మరింతగా చేరువచేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చారు. ఉదయగిరి అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ నుంచి పోటీచేస్తున్నారు. తనను గెలిపిస్తే ఉదయగిరిని అభివృద్ధిలో అగ్రగామిని చేసేందుకు కృషిచేస్తానని ఇంటింటికీ తిరిగి ప్రజలకు విన్నవిస్తున్నారు.

### చిన్నతనం నుంచీ సేవాభావం

ఆయన పుట్టింది ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలం యర్రంరెడ్డిపల్లి అనే గ్రామంలో. కాకర్ల వెంకట సుబ్బానాయుడు-ప్రమీలమ్మ (సిద్ధనకొండూరు గ్రామం) దంపతులకు కాకర్ల సురేష్ ప్రథమ సంతానంగా జన్మించారు. తండ్రి వెంకటసుబ్బనాయుడు విలేజ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా ఉదయగిరి నియోజకవర్గంలో పనిచేయడమే కాక, నెల్లూరు జిల్లా వ్యాప్తంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి, విడిఓగానే ఉద్యోగ విరమణ చేశారు. తమ తండ్రి వృత్తిరీత్యా నెల్లూరు జిల్లాలోని పలు ప్రాంతాలలో ఉద్యోగం చేయడంతో బుచ్చిరెడ్డిపాలెంలోని హైస్కూల్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేశారు కాకర్ల. ఆ తర్వాత విజయవాడలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో ఇంజనీరింగ్ (బీటెక్)లో ఉత్తీర్ణత సాధించి, ఎంతో కష్టపడి అవకాశాలను అందిపుచ్చుకొని హైదరాబాదులో ఉద్యోగంలో చేరారు. అనంతరం కొంతకాలానికే అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చింది. నార్తకరోలినా రాష్ట్రంలో తెలుగు సంఘం(టాటా) అధ్యక్షుడిగా ఆయన నిరుపమానమైన సేవలందించారు. అనతి కాలంలోనే అమెరికాలో తెలుగువారి కోసం ఏర్పాటు చేసిన 'తానా'లో టీం స్క్వేర్ డిపార్ట్ మెంట్‌కు ఛైర్మెన్‌గా సేవలందించి వెయ్యికి పైగా తెలుగు కుటుంబాలకు సాయం అందించారు. పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలలో పాలుపంచుకొని అమెరికాలోని తెలుగు ప్రజల మన్ననలను చూరగొన్నారు. ఆర్థికంగా స్థిరపడిన తర్వాత కుటుంబ సహకారంతో తన తమ్ముడు సునీల్‌తో కలసి సేవా దృక్పథంతో, మాతృభూమికి సేవచేయాలనే తపనతో అమెరికా నుంచి తిరిగివచ్చారు.







### కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా.. ప్రజలకు విశేష సేవలు



ఉదయగిరి నియోజకవర్గంలోని వింజమూరులో బొమ్మరాజుచెరువు ఎదురుగా 'కాకర్ల చారిటబుల్ ట్రస్ట్' కార్యాలయాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు తనవంతు సేవలకు శ్రీకారం చుట్టారు కాకర్ల సురేష్. ఉదయగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలకు అన్నివిధాల తనవంతు సాయం అందిస్తున్నారు. వింజమూరు మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో 'అన్నా క్యాంటీన్'ను నెలకొల్పి నిరుపేద ప్రజలకు ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తూ ఆయన ప్రజల మన్ననలను పొందుతున్నారు. తెలుగుదేశం పార్టీ పట్ల అభిమానంతో, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ని ఆదర్శంగా తీసుకుని 'ఎన్టీఆర్ సంజీవని ఆరోగ్య రథం'ను ఏర్పాటుచేసి ఉదయగిరి నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఉచిత వైద్య పరీక్షలు, నేత్రపరీక్షలు చేయిస్తూ, ఆ పేదలకు అవసరమైన మందులను కూడా తమ ట్రస్టు ద్వారా ఉచితంగా అందజేస్తున్నారు. నిరుపేద ప్రజలకు అవసరమైన ఉచిత పని ముట్లను (పవర్ స్ప్రేయర్ వగైరాలు) పంపిణీ చేయడమే కాక, వీధి వ్యాపారస్తుల కోసం ఉచితంగా తోపుడు బండ్లను అందించి వారిని ఆదుకుంటున్నారు. ఆడబిడ్డలకు అండగా ఉంటూ, వారి పెళ్లిళ్ళకు 'పెళ్లికానుక'లు అందజేసి ఆశీర్వదిస్తున్నారు. వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు 'చలివేంద్రాలు ఏర్పాటుచేసి, మంచినీళ్ళతో పాటు, చల్లని మజ్జిగను కూడా పంపిణీ చేస్తున్నారు.

### కష్టాల్లో ఆదుకునే మనస్తత్వం

ఉదయగిరి నియోజకవర్గంలో ఎవరికి ఎప్పుడు ఏ సమస్యవచ్చినా పరిష్కారం కోసం ఆయన సలహాలివ్వడమే కాక, వారికి తనవంతు సాయం కూడా అందిస్తూ ప్రజలకు ఆత్మీయునిగా.. పేదలకు ఆత్మ బంధువుగా పేరొందారు. ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే, నిస్సహాయ స్థితిలో ఉన్న ఆ పేద ప్రజలకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. అనారోగ్య సమస్యలతో ఉన్న పేద ప్రజలకు చేయూత అందించి వారి అభ్యున్నతి కోసం పాటు పడుతూనే ఉన్నారు. మూగజీవులపట్ల కరుణతో మేకలు, గేదెలకు తాగేందుకు తాగునీటికి కొరతలేకుండా ఏర్పాట్లు చేశారు. యువతను, విద్యార్థులను క్రీడారంగంలో ప్రోత్సహిస్తూ 'వివిధ రకాల టోర్నమెంట్‌లను కూడా నిర్వహిస్తున్నారు. ఇలా పేదలకు, అన్నివర్గాల వారికి తనవంతు సహాయ సహకారాలందిస్తూ ప్రజాసేవలో తరిస్తున్నారు.



### మహిళల ఉపాధికి ఉచిత టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులు

ఉదయగిరి నియోజకవర్గంలోని మహిళల ఉపాధికి, వారి అభ్యున్నతికి 'ఉచిత టైలరింగ్ కోర్సుల శిక్షణ', 'ఉచిత కంప్యూటర్ కోర్స్ శిక్షణ', 'ఉచిత బ్యూటీషియన్ కోర్సుల శిక్షణ'లను ఆయన ఎంతోకాలంగా అందజేస్తూ.. మహిళా సాధికారతకు అండగా నిలుస్తున్నారు. నిరుపేద యువతకు వృత్తి విద్యా కోర్సుగా 'కారు డ్రైవింగ్'ను కూడా నేర్పించి, స్వయంశక్తితో వారు అభివృద్ధి చెందే విధంగా తీర్చిదిద్దుతున్నారు. కంటి సమస్యలు ఉన్నవారికి 'ఉచితంగా కంటి పరీక్షలు, అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేయిస్తూ వారి జీవితాలకు బాసటగా ఉంటున్నారు. ఇలా ఎంతోకాలంగా సమాజానికి తనవంతు సేవలందిస్తున్న కాకర్ల సురేష్, తన సేవలను ఉదయగిరి నియోజకవర్గ ప్రజలకు మరింతగా విస్తరించాలనే సేవాభావంతో రాజకీయ రంగంలోకి వచ్చి, ప్రజల ఆశీస్సులను కోరుకుంటున్నారు.

# ఆదాలకు గ్రామగ్రామానా బ్రహ్మరథం

- దారిపొడవునా పూలవర్షం కురిపిస్తున్న అభిమానులు
- వైకాపాలోకి వచ్చేసిన ఉప్పుటూరు బిజెపి నాయకులు



నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో గ్రామ గ్రామానా వైకాపా నాయకుడు, అభివృద్ధి ప్రదాత, రూరల్ వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని పార్టీ కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు పెద్దఎత్తున స్వాగతించి బ్రహ్మరథం పడుతున్నారు. దారి పొడవునా పూలవర్షం కురిపించి తమ అభిమానం చాటుకుంటున్నారు. ఇటీవల ఆ నియోజకవర్గంలోని ఉప్పుటూరు గ్రామంలో జరిగిన ఆదాల పర్యటన ఆద్యంతం అద్వితీయంగా సాగింది. పెద్దసంఖ్యలో ప్రజలు ఆయన్ను స్వాగతించి తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విజయసాయిరెడ్డిని మంచి మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన చేస్తూ, ప్రజలకు ఎన్నోరకాల సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారని, ఈ ఎన్నికల్లో వైకాపాకు ఘనవిజయం సాధించిపెట్టాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆదాల సమక్షంలో నెల్లూరు రూరల్ మండలం బీజేపీ మాజీ అధ్యక్షులు బెల్లం కొండ చంద్ర ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో బిజెపి నాయకులు వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీలో చేరడం విశేషం. నెల్లూరు రూరల్ అభివృద్ధిని ఆకాంక్షించి, బీజేపీకి రాజీనామా చేసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరిని ఆదాల అభినందించి, వారికి వైకాపా కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. భవిష్యత్తులో వారందరికీ అన్ని విధాల సహాయ సహకారాలందించి తాను అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప్పుటూరు గ్రామ వైకాపా నాయకులు అంబటి వెంకట నారపరెడ్డి, ఒంటేరు దయాకర్, గోపి, శీనయ్య, ములుముడి మధు రెడ్డి, శివ, ఏడుకొండలు తదితరులతోపాటు డీసీసీబీ మాజీ అధ్యక్షులు విజయకుమార్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, ఎంపీపీ విజయ్ కుమార్, రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షులు మల్లెం సుధీర్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రామయ్య సేవలో ఆదాల



శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 17న నెల్లూరు 20వ డివిజన్ వనంతోపు పెద్దబావి సెంటర్‌లో కొలువైవున్న రామాలయంలో వైభవంగా జరిగిన ఉత్సవాల్లో నెల్లూరు రూరల్ వైకాపా అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం నిర్వాహకులు, ధర్మకర్తల మండలి సభ్యులు ఆయన్ను సాదరంగా ఆహ్వానించారు. స్వామివారిని సేవించుకున్న అనంతరం ఆయన అర్చకుల ఆశీస్సులందుకున్నారు. ఈ సందర్భంగా రామాలయంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆదాల ప్రారంభించారు. ధర్మకర్తల మండలి సభ్యులు పద్మావతి, డివిజన్ కన్వీనర్ పోతురాజు రమాదేవి, మురళి, శేఖర్ తదితరుల ఆధ్వర్యంలో, 20వ డివిజన్ ఇన్‌ఛార్జ్.. వైకాపా రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి రావు శ్రీనివాసరావు(ఆర్ఎస్ఆర్) పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

## మా నాన్నను గెలిపించండి

### - ఆదాల కుమార్తె హిమబిందు అభ్యర్థన



నెల్లూరు రూరల్ నియోజకవర్గం అభివృద్ధికి, గ్రామీణ ప్రజల అభ్యున్నతికి నిరంతరం కృషిచేసే తమ నాన్న ఆదాల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించండంటూ ఆదాల కుమార్తె హిమబిందు రూరల్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. రూరల్ నియోజకవర్గ వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి.. తమ తండ్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా ఆమె ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రజలు, మహిళలు ఆమెకు సాదర స్వాగతం పలుకుతున్నారు. నెల్లూరు రూరల్‌ను అభివృద్ధిలో నెంబర్-1గా నిలబెట్టాలన్నదే తమ నాన్న ధ్యేయమని, ప్రజలు అందుకు సహకరించి ఈ ఎన్నికల్లో ఆయన్ను గెలిపించి రూరల్ అభివృద్ధికి తోడ్పాటునందించాలని ఎంతో వినమ్రంగా ఆమె చేస్తున్న విజ్ఞాపనలు ప్రజలను బాగా ఆకట్టుకుంటున్నాయి. ఈనెల 15న నెల్లూరు 29వ డివిజన్లో కార్పొరేటర్ షేక్ సత్తార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటా ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆమె పాల్గొని, రూరల్ నియోజకవర్గం కోసం కోట్లాది రూపాయల వ్యయంతో తమ నాన్న చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రజల అభిమానమే..మమ్మల్ని గెలిపిస్తుంది

### మర్రిపాడు సభలో విపిఆర్, 'ఆనం'ల ధీమా

ప్రజల బలమే రానున్న ఎన్నికల్లో తమను గెలిపిస్తుందని నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డిలు ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల వారు ఆత్మకూరు నియోజకవర్గంలోని మర్రిపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున ప్రజలు, అభిమానులు ఆ కార్యక్రమానికి తరలివచ్చి, నాయకులిద్దరిపై పూలవర్షం కురిపించి ఘనంగా స్వాగతించారు. విపిఆర్-ఆనంలకు తమ మద్దతు ప్రకటిస్తూ హర్షధ్వానాలు చేశారు. భారీ ర్యాలీ మధ్య 'ప్రజాగళం' సభా వేదిక వద్దకు చేరుకున్న విపిఆర్, ఆనం రామనారాయణరెడ్డిలకు ప్రజలు, నాయకులు, కార్యకర్తలు జేజేలు పలికారు. దీంతో మర్రిపాడు జాతీయ రహదారి ప్రాంతమంతా దాదాపు రెండు కిలోమీటర్ల దూరం జనసందోహంతో క్రిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆత్మకూరు నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే తప్పకుండా టీడీపీ-బీజేపీ-జనసేన ఉమ్మడి పార్టీ విజయం సాధించాలని, చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని అంటూ, ప్రజలు ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న తమను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## చంద్రబాబు సీఎం అయితే.. 'సూపర్ సిక్స్' పథకాలు

ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని వారు ఈ సందర్భంగా ప్రజలకు స్పష్టం చేశారు. చంద్రబాబు సీఎం అయితే ప్రజలకు 'సూపర్ సిక్స్' పథకాలు లభిస్తాయన్నారు. జిల్లావ్యాప్తంగా రైతులు పంటలకు పెట్టుబడులు పెట్టలేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారికి సంవత్సరానికి 20 వేల రూపాయల వంతున ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. 'అమ్మకు వందనం' పేరుతో ఆయా కుటుంబాల్లో ఎంతమంది చదువుకునే వాళ్లుంటే, వారందరికీ ఒక్కొక్కరికి 15 వేల రూపాయల వంతున ఆర్థిక చేయూతగా అందిస్తారన్నారు. 'దీపం' పథకం కింద మహిళలకు సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తారని, అంతే కాకుండా మహిళలు రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లాలన్నా ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో వెళ్ళే విధంగా పథకాన్ని అమలుచేస్తారని చెప్పారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు నెలకు 15 వందల వంతున వారి అకౌంట్‌లో వేస్తారని, వృద్ధులకు, వితంతువులకు రూ. 4వేల పింఛను అందిస్తారని. అదికూడా ఏప్రిల్, మే, జూన్ నెలకు సంబంధించి 3 వేలు, జులై నెల పింఛను 4వేలు కలిపి మొత్తం 7 వేల రూపాయలు అందిస్తారని వివరించారు. నాయకులు మేకపాటి చంద్రశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, గిరినాయుడు, జనసేన శ్రీధర్, బీజేపీ నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

## యువతకు ఉద్యోగ కల్పనకే ప్రాధాన్యత



జిల్లా యువతకు ఉద్యోగాలు కల్పించడమే తన తొలి ప్రాధాన్యమని నెల్లూరు పార్లమెంట్ ఎన్‌డీఏ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు చాలా అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని మంచి కంపెనీలు ఇక్కడ పరిశ్రమలు ప్రారంభించేలా కృషి చేస్తామని అన్నారు. నెల్లూరు రూరల్ పరిధిలోని రామలింగాపురం, ముత్యాల పాలెంలో రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డితో కలసి ఈనెల 16న నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో విపిఆర్ మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో తాము గెలిస్తే జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తామన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ఈ ప్రాంతంలో అనేక అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ఎన్నికల్లో వైకాపా తరఫున పోటీ చేసేవాళ్లు ప్రజలకు అందుబాటులో ఉండరని, ఎన్నికలు అయిపోయిన తర్వాత మీకు కనిపించరంటూ, ఇక్కడే ఉండి ప్రజలకు సేవ చేసే తమను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# యువత వికాసానికి.. విపిఆర్ వికాస్

➤ పల్లెపల్లెనా క్రీడా కిట్‌లు పంపిణీ ➤ క్రీడారంగానికి ఉదారంగా విరాళాలు

*వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సేవలతో గుబాళించని రంగమే లేదంటే అతిశయోక్తి కాదు. కళలు, సాహిత్యం, సంగీతం, క్రీడలు, విద్య-వైద్యం, సామాజిక ఆధ్యాత్మిక సేవారంగాలు.. ఇలా ఏ రంగంలోనైనా సరే విపిఆర్ సేవాముద్ర ఉండాల్సిందే. అంతగా ఆయన వాటిలో లీనమైపోయారు. నిద్రలేచింది మొదలు మళ్లీ నిద్రపోయేవరకు పదిమందికి ఉపయోగపడే మంచి ఆలోచనలు, మంచి కార్యక్రమాలు చేపట్టడం ఆయన సుగుణం. అదే నెల్లూరు జిల్లాకు ఆ దేవుడు విపిఆర్ రూపంలో మనకిచ్చిన వరం!*

## జిల్లా క్రీడారంగానికి ఎనలేని సేవలు :

గ్రామీణ యువతకు మానసిక వికాసం కలిగించి, గ్రామాభివృద్ధిలో వారిని భాగస్వాములను చేయాలనే సత్సంకల్పంతో వేమిరెడ్డి దంపతులు 'విపిఆర్ వికాస్' అనే కార్యక్రమాన్ని ప్రారంభించి ఎంతోమంది యువతకు క్రీడల్లో ప్రోత్సాహం అందిస్తున్నారు. గ్రామాల్లో విపిఆర్ అమృతధార కార్యక్రమాల్లో కూడా ఆయా గ్రామాల యువతకు విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ కిట్‌లు, వాలీబాల్ కిట్‌లు అందజేస్తూనే ఉన్నారు. వారిలో ఎవరైనా క్రీడల్లో మంచి విజయాలు సాధిస్తే విపిఆర్ ఎంతో మురిసిపోతున్నారు. వెంకటాచలం కనుపూరు గ్రామంలో ఎం.కృష్ణవంశీ అనే పేద క్రీడాకారుడు తానందించిన ప్రోత్సాహంతో క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తూ, 2017లో శ్రీలంకలో జరిగిన అండర్-22 అంతర్జాతీయ ఆసియా క్రికెట్ కప్ పోటీల్లో భారతజట్టు విజయంలో కీలకపాత్ర పోషించడంతో విపిఆర్ ఆనందానికి అంతే లేదు. ఆ క్రీడాకారుడిని ఆయనెంతగానో అభినందించారు.



## సహజంగానే క్రీడాకారుడు

విపిఆర్ సహజంగానే క్రీడాకారుడు. మదనపల్లిలోని రిషీవ్యాలీ స్కూల్‌లో చదువుకునే రోజుల్లోనే ఆయన అండర్-18 విభాగంలో రాష్ట్ర క్రికెట్ జట్టుకు కూడా ఎంపికయ్యారు. పేస్‌బౌలర్‌గా, ఆల్‌రౌండర్‌గా విపిఆర్ విద్యార్థిదశ నుంచే క్రికెట్‌లో బాగా రాణించారు. రాజ్యసభ సభ్యునిగా ఉన్నప్పుడు 2018లో ఓసారి సరదాగా క్రికెట్టు ఆడుతూ అందరినీ ఆశ్చర్యపరిచారు. తిరుపతి దగ్గరున్న తుమ్మగుంటలో రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సందర్భంగా కాసేపు క్రికెట్ ఆడారు. అదేవిధంగా టెన్నిస్ మీద తనకున్న అభిమానంతో నెల్లూరు క్లబ్, మెక్లిన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలకు భారీమొత్తంలో విరాళాన్ని అందించారు. 2020లో నెల్లూరులో రీడింగ్‌రూం అండ్ మెక్లిన్స్ లైబ్రరీలో ఇండోర్ షటిల్ ఉడన్ కోర్టును విపిఆర్ ప్రారంభించారు. అప్పుడు ఆయన సరదాగా షటిల్ ఆడారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్మించిన ఇండోర్ స్టేడియంకు ఆయన పెద్దమొత్తంలో సాయం అందించారు. నెల్లూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో బాస్కెట్‌బాల్ నిర్మాణానికి కూడా విపిఆర్ లక్షలాది రూపాయలు సాయం చేశారు.








ఏప్రిల్ 19.. విపిఆర్ పుట్టినరోజు సందర్భంగా..




జననం
12.04.1950

నిర్యాణం
21.04.2023

# స్మృత్యంజలి

మానవీయ విలువలున్న మహామనీషి
చిరునవ్వుతో పలకరించే స్నేహాభిలాషి
నిష్కల్మష సేవాభిలాషి, మా కుటుంబ శ్రేయోభిలాషి

**మారంరెడ్డి గోపాల్‌రెడ్డి గారు**

దివంగతులై తేదీ. 21.04.24 నాటికి ఏడాది గడవనున్న సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని సంస్మరించుకుంటూ...

భార్య : **మారంరెడ్డి ప్రసూన**

అల్లుళ్ళు - కుమార్తెలు
**ఆనం మహేష్‌కుమార్‌రెడ్డి - రాజి**
**ఆల్తూరు మహేష్‌కుమార్‌రెడ్డి - రాధిక**

మనుమరాలు, మనుమలు
**సంజితారెడ్డి, నితీష్‌రెడ్డి**
**అనీష్‌రెడ్డి, శశాంక్‌రెడ్డి**

మరియు **కుటుంబసభ్యులు**

# ఎంపీ నిధులతో జిల్లా ప్రగతికి బాటలు

## • కోట్లాది రూపాయలను జిల్లా అభివృద్ధికి కేటాయించిన విపిఆర్

***జిల్లాలో ఏ ప్రాంతంలోనైనా రోడ్లు, మంచినీటి వసతులు, లేదా ఇతరత్రా మౌలిక సదుపాయాలు కావాలంటే ఎంపీలుగా ఉన్నవారు తమకు కేంద్రం కేటాయించిన ఎంపీ ల్యాడ్స్ నిధులను ఆయా ప్రాంతాలకు కేటాయిస్తుంటారు. వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి రాజ్యసభ సభ్యునిగా ఉన్నప్పుడు జిల్లా అభివృద్ధికే కాక, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అభివృద్ధి పనులకు కూడా ఆ నిధులతో సాయం అందించారు. అడిగినవారికి లేదనకుండా, కాదనకుండా ప్రగతికి దారులు వేశారు. కేంద్రం ఇచ్చిన నిధులను సద్వినియోగం చేసి, వాటికి సార్థకత చేకూర్చారు. ఆ వివరాలివీ!..***



కేంద్రప్రభుత్వం ప్రతి ఎంపీకీ ఆయా ప్రాంతాల్లో స్థానికంగా అభివృద్ధి పనుల కోసం కేటాయించే ఒక బృహత్తర పథకం..పేరే 'ఎంపీ ల్యాడ్స్' అనేది. ఈ పథకం కింద ప్రతి ఎంపీకి ఏడాదికి 5 కోట్ల వంతున నిధులు కేటాయిస్తారు. 'మెంబర్ ఆఫ్ పార్లమెంట్ లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ స్కీమ్–ఎంపీ ల్యాడ్స్' పేరుతో ఇచ్చే ఆ నిధులను ఎంపీలు వారి పరిధిలో ఎక్కడైనా వినియోగించుకునే అవకాశం ఉంటుంది. రాజ్యసభ సభ్యునిగా ఉండగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి ఈ పథకం కింద మంజూరుచేసిన నిధులను ఉమ్మడి నెల్లూరు జిల్లా అభివృద్ధికి కేటాయించి జిల్లాకు ఎన్నో బృహత్తరమైన అభివృద్ధి పనులు చేపట్టారు. ఆ కార్యక్రమం కింద ఆయన చేసిన పనుల జాబితా చాలా పెద్దది కూడా.

2018 నుంచి 2024 మార్చివరకు ఎంపీ ల్యాడ్స్ కింద ఆయనకు కేటాయించిన 24 కోట్లా 5 లక్షలా 57 వేలా 534 రూపాయలను జిల్లాలోని అనేక ప్రాంతాలకు ఆయన వినియోగించారు. అందులో నియోజకవర్గాల వారీగా చూస్తే.. కావలికి 99 లక్షలా 50 వేలు, ఉదయగిరికి కోటీ 21 లక్షలా 35 వేలు, ఆత్మకూరుకు కోటీ 26 లక్షలా 5 వేలు, కోవూరుకు 5కోట్లా 46లక్షలా 50 వేలు, వెంకటగిరికి 72 లక్షలా 33వేలు, కందుకూరుకు 98లక్షలా 37వేలు, గూడూరుకు 4 లక్షలా 70 వేలు, సర్వేపల్లికి కోటీ 82 లక్షలా 60 వేలా 385 రూపాయలు, సూళ్ళూరుపేటకు 14 లక్షలా 60 వేలు, నెల్లూరు రూరల్‌కు 2 కోట్లా 9 లక్షలా 50వేల రూపాయల వంతున ఇచ్చారు.

### ఇతర జిల్లాలకూ చేయూత

ఒక్క నెల్లూరు జిల్లాకే కాకుండా రాష్ట్రంలోని అనకాపల్లి, అనంతపురం, అన్నమయ్య జిల్లా, బాపట్ల జిల్లా, చిత్తూరు, ఏలూరు, గుంటూరు, కృష్ణా, కర్నూలు, నంద్యాల, ఎన్టీఆర్ జిల్లా, పల్నాడు, తిరుపతి, విశాఖ, కడప జిల్లాలకు కూడా ఎంపీ ల్యాడ్స్ కింద వచ్చిన నిధులను కేటాయించి ఆ ప్రాంతాల ప్రగతికి కూడా విపిఆర్ తనవంతు చేయూతనందించారు. మొత్తంగా 8 కోట్లా 81 లక్షల రూపాయల దాకా వినియోగించి, ఆయా ప్రాంతాల అభివృద్ధికి కేటాయించడం విశేషం.

ఒక్క ఉమ్మడి నెల్లూరుజిల్లాలోనే అత్యధికంగా 16.68 కోట్ల రూపాయలను 261 అభివృద్ధి పనులకు ఖర్చు చేయడం జరిగింది. గ్రామాల్లో రోడ్ల కోసం అధికశాతం నిధిని వెచ్చించారు. పలు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సీసీ రోడ్లు వేయించారు. కోవూరు, కావలి, సర్వేపల్లి, ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లోని పలు గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు లేక అవస్తలు పడుతుండడాన్ని గమనించి విపిఆర్ ఆయా ప్రాంతాలకు ఎంపీ ల్యాడ్స్ నిధులను కేటాయించి వాటి అభివృద్ధికి దారులు వేశారు. ఇలా తనకు వచ్చిన ప్రతి అవకాశాన్ని కూడా జిల్లా ప్రజల కోసం, ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించి ఆయన రాజ్యసభ పదవికే వన్నె తెచ్చారు.



### ప్రజల కోసమే రాజకీయాల్లోకి వచ్చా... - వేమిరెడ్డి

ప్రజలకు సేవచేయడానికే తాను రాజకీయాల్లోకి వచ్చానని, లోక్‌సభ ఎంపీ అయితే జిల్లాకు కావాల్సిన అభివృద్ధి పనులకు ఇబ్బంది లేకుండా ఉంటుందని విపిఆర్ అనేక సందర్భాల్లో చెప్పేవారు. ఒక పర్యాయం రాజ్యసభ సభ్యునిగా పనిచేసిన తాను, రెండోసారి ప్రజల ఆశీస్సులతో గెలిస్తే జిల్లాను మరింతగా అభివృద్ధి చేసుకోవచ్చని ఆయన అన్నారు. తాను ఏ స్థానంలో ఉన్నా, ఏ పదవిలో ఉన్నా ప్రజలకు సేవ చేయడాన్ని మాత్రం ఎట్టిపరిస్థితుల్లోనూ విస్మరించేది లేదని, తాను మాట ఇస్తే తప్పేది ఉండదన్నారు. తాను చేస్తున్న ప్రజాసేవ కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, ప్రజల దీవెనలతో తమ సేవలను మరింతగా విస్తరిస్తామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న తనను ఆశీర్వదించి, జిల్లా పురోగతికి దోహదపడాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఏప్రిల్ 19.. విపిఆర్ పుట్టినరోజు సందర్భంగా..

# సేవకురాలిగా మీ ముందుకు వచ్చా.. ఆశీర్వదించండి!

## - ప్రజలను అభ్యర్థించిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి





తాను పాలకురాలిగా రాలేదని, కేవలం సేవకురాలిగా మాత్రమే ప్రజల ముందుకు వచ్చానని, కోవూరు నియోజకవర్గ ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపించాలని కోవూరు శాసనసభ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు.

ఇటీవల ఆమె ఎన్నికల ప్రచారంలో భాగంగా బుచ్చిరెడ్డిపాళెం, కాగులపాడు, రేబాల గ్రామాల్లో పర్యటించి ఇంటింటికీ వెళ్ళి ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. ప్రజలకు సేవ చేసేందుకే తాము రాజకీయాల్లోకి వచ్చామన్నారు. ఏళ్ళ తరబడిగా ఇక్కడ పాలన చేస్తున్నవారు నియోజకవర్గ అభివృద్ధికి ఎందుకు కృషిచేయలేదని ప్రశ్నించారు. టీడీపీ అధినేత తమకు టిక్కెట్ ఇస్తే ఓర్చుకోలేని వాళ్ళు తమపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా, నియోజకవర్గం బాగుపడాలన్నా సీఎంగా చంద్రబాబునాయుడు అధికారంలోకి రావాలన్నారు. చంద్రబాబునాయుడు సీఎం అయితే వలంటీర్లకు నెలకు రూ.10 వేలు జీతం ఇస్తారని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు పైబడిన ప్రతి మహిళకు నెలకు 15 వందల రూపాయలు అందిస్తారని తెలిపారు. పింఛను రూ.4 వేలుకు పెంచుతారని, రైతన్నలకు ఆర్థిక సహాయం కింద రూ.20 వేలు ఇస్తారని ఆమె వివరించారు.

రేబాలలో ముస్లిం సోదరులకు షాదీఖానాను నిర్మిస్తామని ఆమె ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీల కోసం కమ్యూనిటీ హాలు ఏర్పాటు చేయిస్తామన్నారు. పశ్చిమ హరిజనవాడలో నిర్మాణ దశలో ఉన్న చెన్నకేశవస్వామివారి ఆలయాన్ని పునర్నిర్మిస్తామన్నారు.

అదేవిధంగా స్థానిక స్మశానవాటికలో అన్ని వసతులు కల్పిస్తామని వివరించారు. పాతూరుకు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉందని, దాన్ని తప్పకుండా మరమ్మతులు చేయించి ప్రజల ఇబ్బందులు తొలగిస్తామన్నారు. ప్రతిఒక్కరూ ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆశీర్వదించి గెలిపించాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తిచేశారు.

# సమ సమాజమే లక్ష్యంగా పనిచేస్తా



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మహాశయుని ఆశయాలకు అనుగుణంగా సమసమాజ నిర్మాణమే లక్ష్యంగా తాను పనిచేస్తానని కోవూరు శాసనసభ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. ఈనెల 14న ఆమె కోవూరు నియోజకవర్గం విడవలూరు మండల పరిధిలోని గాదెలదిన్నె గ్రామంలో టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, జనసేన–బీజేపీ నాయకులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డా. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని గ్రామంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డా. అంబేద్కర్ ఆశయాలకు వైకాపా ప్రభుత్వం తూట్లుపొడిచిందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలన్నారు. కోవూరు ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని ఆదరించి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. టీడీపీ స్థానిక నాయకుడు దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.





## రామిరెడ్డి వారి ఇంట... మ్రోగిన కళ్యాణ గంట!

నెల్లూరు - కడప జిల్లాల సరిహద్దులోని మారుమూల గ్రామం కదిరినాయుడుపల్లిలో పుట్టి, నేడు అమెరికా దేశం ఫ్లోరిడా రాష్ట్రంలోని టాంపా నగరంలో ప్రఖ్యాత గుండెవైద్య నిపుణుడిగా ప్రసిద్ధి చెందిన డాక్టర్ కేశవ్ రామిరెడ్డి - డాక్టర్ అనుపమల కుమార్తె **ప్రణవి - అఖిల్**ల కళ్యాణం అమెరికా కాలమాన ప్రకారం, ఏప్రిల్ 12వ తేదీ శుక్రవారం ఉదయం అంగరంగ వైభవంగా జరిగింది. టాంపా నగరంలో జరిగిన ఈ పెళ్ళి వేడుకలో అమెరికాలో స్థిరపడిన నెల్లూరుజిల్లాకి చెందిన అతిరథమహారథులు, వధూవరుల బంధుమిత్రులు, రెండు కుటుంబాల ఆప్తులు, ఆత్మీయులు పాల్గొని కొత్త జంటని దీవించారు. ప్రణవి - అఖిల్ దంపతులకి 'లాయర్' శుభ దీవెనలు.

# కాకర్లతో కలిసి నడుస్తున్న పల్లె జనం



సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉదయగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ నిర్వహిస్తున్న 'పల్లె పల్లెకు కాకర్ల' కార్యక్రమం విజయవంతంగా సాగుతోంది. పల్లెజనం కాకర్ల వెంట నడుస్తూ, జేజేలు పలుకుతూ ఆయనకు మద్దతు ప్రకటిస్తున్నారు. ఈ నెల 17న ఉదయగిరి నియోజక వర్గంలోని వరికుంటపాడు మండలం జడదేవి, తూర్పు చన్నంపల్లి, అలివేలుమంగాపురం, తూర్పు బోయమడుగుల, గువ్వాడి కాం చెరువు, ఇసుకపల్లి, నల్లబోతులవారిపల్లి, జి. కొత్తపల్లి, జి.కొండారెడ్డిపల్లి గ్రామాల్లో చేపట్టిన ఈ కార్యక్రమం పల్లె ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. ఎర్రటి ఎండను సైతం లెక్కచేయక కాకర్ల సురేష్ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమృతధార కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా ప్రజలకు తాగునీటి సౌకర్యాల కోసం 150 వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసిన అపర భగీరధుడు, టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, ఉదయగిరి ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న తనను ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. తెలుగువారి ఆత్మగౌరవానికి తెలుగుదేశం పార్టీ మరో పేరని అంటూ, రానున్న ఎన్నికల్లో టీడీపీకి విజయం చేకూర్చి అధికారంలోకి తీసుకొస్తే చంద్రబాబునాయుడు నాయ కత్వంలో రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. ముఖ్యంగా యువతకు జాబు కావాలంటే బాబు రావాలన్నారు.

### ఇంటింటికీ కుళాయి వేయిస్తా - కాకార్ల హామీ

ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి కాకర్ల మాట్లాడుతూ, తాను గెలిచిన తొలి సంవత్సరంలోనే ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో ఇంటింటికి మంచినీటి కుళాయి వేయిస్తానంటూ హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికి ఉద్యోగం ఇచ్చే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. విశాలమైన భూభాగం ఉన్న మెట్ట ప్రాంతంలో పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని ఆయన భరోసా ఇచ్చారు. అదేవిధంగా 1983 నుండి తెలుగుదేశం పార్టీ జెండా మోసిన ప్రతి కార్యకర్తను గుర్తిస్తానని, వారి సంక్షేమం కోసం ఎన్నికల అనంతరం ప్రత్యేకంగా కార్యక్రమాలు చేపడతానన్నారు. గత 40 సంవత్స రాలుగా పాలించిన పాలకులెవరూ ఉదయగిరి ప్రజల సమస్యలను పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. అదేవిధంగా టీడీపీ గెలిస్తే అమలుచేయనున్న సూపర్ సిక్స్ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని వివరించారు. మండల టీడీపీ కన్వీనర్ చంద్రా మధు సూదన్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ యాదవ్, తెలుగు యువత అధ్యక్షులు లక్ష్మీనారాయణ, అనేక మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీసీలు టీడీపీకి అండగా నిలవాలి



రాష్ట్రంలో బీసీలకు పెద్ద పీట వేసి తగిన ప్రాధా న్యత కల్పించిన పార్టీ తెలుగుదేశం పార్టీయేనని, కనుక బీసీలు అందరు ఐక్యంగా కృషి చేసి తెలుగుదేశంకు అండగా నిలవాలని ఉదయగిరి నియోజకవర్గం తెలుగుదేశం-జనసేన-బిజెపి కూటమి ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ విజ్ఞప్తి చేశారు. ఈనెల 17న ఆయన వరికుంటపాడు మండలం గువ్వాడి గ్రామంలో 'బీసీ జయహో' సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కాకర్ల మాట్లాడుతూ తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సంయుక్తంగా విడుదల చేసిన బీసీ డిక్లరేషన్‌ను ప్రస్తా విస్తూ, బీసీలకు 50 సంవత్సరాలకే పెన్షన్, పెళ్లి కానుక లక్ష రూపాయలకు పెంపు, చంద్రన్న బీమా పునరుద్ధరణ, చట్టబద్ధంగా కుల గణన, విద్యా పథకాలు, శాశ్వత కుల ధ్రువీ కరణ పత్రాలు ఇవ్వడం, బీసీ భవనాలు, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలు సంవత్స రంలో పూర్తిచేయడం, లక్షా యాభై వేల కోట్లతో సబ్ ప్లాన్ అమలు, రూ. 10 వేల కోట్లతో కార్పొరేషన్ ద్వారా రుణాలు, బీసీలకు రక్షణ చట్టం ఏర్పాటు తదితర అంశాలతో డిక్లరేషన్‌ను విడుదల చేశారని తెలిపారు. బీసీల సంక్షేమానికి కృషి చేసే టీడీపీని ఈ ఎన్నికల్లో బీసీ సోదరులందరూ కలసి గెలిపించుకోవాలని కోరారు. మాజీ ఎంపీపీ చీకుర్తి రవీంద్రబాబు మాట్లాడుతూ, జగన్ పాలనలో బీసీల పరిస్థితి దుర్భరంగా తయారైం దని, బీసీల రిజర్వేషన్లు తగ్గించి అన్యాయం చేసి, ఇప్పుడు సమన్యాయం చేస్తామనడంలో అర్థం లేదని విమర్శించారు. ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకొని ఉదయగిరి కోటపై తెలుగుదేశం జెండా ఎగురవేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# తమ్ముడి కోసం.. అన్నా-వదినల ప్రచారం



ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ గెలుపు కోసం ఆయన అన్న కాకర్ల వెంకట్, వదిన రుక్మిణి ఇద్దరూ కలసి ఉదయగిరి నియో జకవర్గంలోని పలు ప్రాం తాల్లో ప్రచారం చేస్తు న్నారు. వారితో పాటు ఆయన కోడలు మేఘన కూడా కాకర్ల సురేష్ ఈ ఎన్నికల్లో గెలవాలని కోరుకుంటూ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈనెల 13న వారు వరికుంటపాడు మండలం జడదేవి, కాకొల్లువారిపల్లి తదితర ప్రాంతాల్లో ప్రచారం చేసూ, ప్రజా సేవకుడు, అభాగ్యులకు ఆపద్బాంధవుడు, అన్నదాత, పేదల పాలిటి పెన్నిధి, ఆడపడుచులకు అన్నదమ్ముడు, రైతన్నలకు రైతు బిడ్డగా సురేష్ నియోజకవర్గ వ్యాప్తంగా సొంత నిధు లతో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, అలాంటి సేవామూర్తి ప్రజాసేవకోసం రాజకీయ రంగానికి వచ్చారని, ప్రజలు ఆయన్ను ఆశీర్వదించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం అన్ని రంగా లలో అభివృద్ధి చెందాలంటే నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. ప్రజా సేవకులైన నెల్లూరు ఉమ్మడి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌లకు విజయం చేకూర్చాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వరికుంటపాడు మండల నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# నెల్లూరంటే ప్రాణం.. ప్రజలంటే అభిమానం..

# అభివృద్ధి సూత్రం.. నారాయణ మంత్రం





గేటెడ్ కమ్యూనిటీ హౌసెస్‌ను తలపించేలా అద్భుతంగా టిడ్కో ఇళ్ళ నిర్మాణం



నగరవాసులకు ఆహ్లాదాన్ని పంచేలా పచ్చదనంతో కళకళలాడుతున్న పార్కులు

**ఆసియాలో అతి పెద్ద విద్యాసంస్థలైన 'నారాయణ విద్యాసంస్థల' వ్యవస్థాపకులుగా ప్రపంచవ్యాప్త పేరుగాంచిన డా పొంగూరు నారాయణ జిల్లాలోనే కాదు, రాష్ట్రంలోనూ దేశ విద్యారంగంలోనూ సుపరిచితులే. సహజంగానే ఆయన సహృదయుడు. సమాజసేవాభిలాషి. సౌజన్యమూర్తి కూడా. నెల్లూరు హరనాథపురంలో పేద కుటుంబంలో జన్మించి, కష్టపడి చదువుకుని ఎమ్మెస్సీ పీహెచ్‌డీలు చేసి, ఉన్నతస్థాయి విద్యావంతునిగా రాణించారు. విద్యారంగంలో మేటిగా నిలుస్తూ, నారాయణ వైద్యకళాశాలను కూడా స్థాపించారు. స్వయంకృషితో ఎదిగి తన ప్రతిభాపాటవాలతో తమ విద్యా, వైద్య సంస్థలకు ఎనలేని ఖ్యాతిని తెచ్చారు. అయితే, పేదరికం నుండి ఒక్కో మెట్టు ఎక్కి విజయ శిఖరాలు అందుకున్న నారాయణ జీవితప్రస్థానంలో ఎన్నో కష్టాలున్నాయి. అయినా వాటిని మనో నిబ్బరంతో అధిగమించారు. రాజకీయ రంగంలో ప్రవేశించి, గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపల్ పాలన, పట్టణాభివృద్ధి, పట్టణ గృహనిర్మాణాల శాఖల మంత్రిగా ఎంతో సమర్థవంతంగా పనిచేస్తూ, స్వస్థలమైన నెల్లూరు నగరాభివృద్ధికి బాటలు వేశారు. అనేక అభివృద్ధి పనులకు గత ప్రభుత్వం నుంచే కాక, కోట్ల రూపాయల్లో తన సొంతనిధులను కూడా వెచ్చించి ఆదర్శవంతమైన నాయకునిగా నారాయణ పేరొందారు.**

'నారాయణ' అంటే అభివృద్ధికి మారుపేరు అనేలా డా. నారాయణ నెల్లూరు నగరాభివృద్ధికి విశేష సేవలెన్నో చేశారు. నగర ప్రజలకు పెన్ననీరు అందుబాటులో ఉన్నా భవిష్యత్తులో కూడా తాగునీటికి ఇబ్బందులు లేకుండా సంగం నుంచి కూడా నీరందే ఏర్పాట్లు చేశారు. నగర ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేశారు.

## టిడ్కో ఇళ్ళు పేదలకు వరం

నారాయణ మంత్రిగా ఉన్నప్పుడు వేలాది కోట్ల రూపాయలను అప్పటి ప్రభుత్వం నుంచి మంజూరు చేయించి, పెద్దఎత్తున పేదలకు గృహనిర్మాణాలు చేపట్టారు. ప్రత్యేకించి అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన టిడ్కో ఇళ్లు పేదలకో వరం. ఈ ఇళ్ల కోసం పేదలు మొదటగా రిజిస్ట్రేషన్ కోసం కట్టాల్సిన 5 వందల రూపాయలను ఎంతోమంది నిరుపేదల తరఫున నారాయణే చెల్లించడం ఆయన సేవాభావానికి నిదర్శనం. అంతేకాదు ఆ ఇళ్ళను కూడా అందంగా రూపుదిద్దారు.

## సంక్షేమ భవనాల నిర్మాణం

దాదాపు 20 కోట్ల వ్యయంతో నెల్లూరు నగరంలో కాపు భవనం, బీసీ భవనం, డా. అంబేద్కర్ భవన్, బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌ల నిర్మాణాలు చేపట్టారు. కాపు భవన్ నిర్మాణానికి తన సొంతనిధులను కోటి రూపాయలు విరాళంగా ఇచ్చారు. అదేవిధంగా అంగన్‌వాడీ స్కూళ్ల కోసం తన సొంతడబ్బు కోటి రూపాయల వరకు వెచ్చించారు. కరోనా కష్టకాలం వచ్చినప్పుడు నారాయణ వైద్యశాలల్లో సాధారణ వైద్యసేవలన్నీ నిలిపేసి, కరోనా బాధితులకు మాత్రం సేవలందించేందుకు నారాయణ తీసుకున్న శ్రద్ధ అపారం, అభినందనీయం. అదేవిధంగా, పేదల విద్యాభివృద్ధికి చేయూతనిచ్చారు. మునిసిపల్ స్కూళ్ళలో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం నుంచి జీఓ వచ్చేలా కృషిచేశారు. పేద విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలనే లక్ష్యంతో, నారాయణ కళాశాలలో ప్రతిభకలిగిన అధ్యాపకులను నెల్లూరు నగర మునిసిపల్ కళాశాలల్లో నియమించి, వారి జీతాలను కూడా నారాయణే ఇచ్చారు.




ప్రయాణికులకు అలసట లేకుండా ఏర్పాటు చేసిన ఎయిర్ కండీషన్డ్ బస్ షెల్టర్లు



నెల్లూరు చెరువు వద్ద భక్తుల సౌకర్యార్థం నిర్మించిన ఘాట్‌లు

## ఆలయాల వద్ద..అద్భుతంగా ఘాట్‌లు

రంగనాయకులపేటలోని రంగనాథస్వామి ఆలయం వద్ద పెన్నానది చెంత ఆహ్లాదకరమైన రీతిలో ఘాట్‌లు ఏర్పాటుచేశారు. పూడికతీతకు కూడా నోచుకోని మూలాపేట శివాలయం వద్ద ఉన్న కోనేరును పరిశుభ్రం చేయించి సర్వాంగ సుందరం చేశారు. మైపాడు గేటు వద్ద తెప్పోత్సవం కోసం ఘాట్‌ను నిర్మించారు.

## కనువిందుగా పార్కులు

నగర ప్రజల ఆహ్లాదం కోసం పార్కులను ఆధునీకరించి అందుబాటులోకి తెచ్చారు. కోట్లాది రూపాయల వ్యయంతో ఎన్నో పార్కులను అన్ని సదుపాయాలతో తీర్చిదిద్దారు. చిన్నారులకు ఆటవస్తువులు, పెద్దలకు వ్యాయామశాలలు ఏర్పాటుచేసి అందరికీ ఆనందం కలిగించారు. నగరంలో మార్కెట్లను పరిశుభ్రంగా ఉంచారు.



పరిశుభ్రంగా తీర్చిదిద్దబడిన ముక్కంటి కోనేరు



అందంగా రూపుదిద్దబడ్డ షాదీమంజిల్

## పేదలకు అన్నంపెట్టే.. అన్న క్యాంటీన్లు

నిరుపేదలకు కేవలం 5 రూపాయలతోనే కడుపునిండా రుచికరం, శుచికరమైన భోజనం పెడుతూ, నెల్లూరు నగరంలో ఏడుచోట్ల అన్న క్యాంటీన్లను ఏర్పాటుచేశారు. పెద్దసంఖ్యలో పేదలు నిత్యం ఆ క్యాంటిన్లలో ఆకలి తీర్చుకునేవారు. ప్రయాణీకుల సౌకర్యం కోసం ఎయిర్‌కండిషన్డ్ బస్సుషెల్టర్లు కట్టించారు. బోడిగాడితోట వద్ద శ్మశానంలో కర్మక్రియలు నిర్వహించుకునేందుకు గదుల నిర్మాణం గావించారు. అంతేకాదు, పేదముస్లిమ్‌లు వివాహాలు చేసుకునేందుకు నగరంలో రెండు షాదీమంజిల్స్, ఒక కమ్యూనిటీ భవనం కూడా నిర్మాణం గావించారు.

## నిష్కళంక నాయకుడు.. నిస్వార్థ ప్రజాసేవకుడు


# నెల్లూరు ప్రగతి ప్రదాత.. నారాయణ



నిర్మాణంలో ఉన్న
భూగర్భ డ్రైనేజీ



నగర వీధుల్లో
ఎల్ఇడి కాంతులు



*నెల్లూరు నగర ప్రగతి ప్రదాత.. ఎవరంటే, పాత కాలంలో ఏసీ సుబ్బారెడ్డి అనేవారు. ఆ తర్వాత, ఇటీవలి కాలంలో ఆ స్థాయిలో నగరాభివృద్ధికి కృషిచేస్తున్న దెవరంటే.. నారాయణ పేరే సర్వత్రా వినిపిస్తోంది. తాను మంత్రిగా ఉన్నప్పుడు నెల్లూరులో ఎన్నో అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. నెల్లూరులో నారాయణ విద్యాసంస్థలను స్థాపించి రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగానికి ఎనలేని సేవలందించిన డా. పొంగూరు నారాయణ రాజకీయరంగంలోకి కూడా వచ్చి, తొలినుంచి తెలుగుదేశం పార్టీలో కొనసాగుతూ, ఆ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు తానుకూడా ఇబ్బందులను ఎదుర్కొన్నా, నెల్లూరును కానీ, నెల్లూరు నగరాభివృద్ధిని కానీ ఆయనెన్నడూ మరచిపో లేదు. గత టీడీపీ ప్రభుత్వంలో, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిత్వంలో నారాయణ మంత్రిగా పనిచేశారు. అందులోనూ ఎంతో కీలకమైన పురపాలక శాఖకు ఆయన మంత్రి కావడంతో పట్టణాలు, నగరాల అభివృద్ధికి ఏం చేయాలో ఆయనకి బాగా తెలుసు. ఆయన నేతృత్వంలో భారీ ప్రణాళికలు సిద్ధమయ్యాయి.*

తన పుట్టినగడ్డ అయిన నెల్లూరు నగరాభివృద్ధిపై ప్రత్యేక అభిమానంతో ప్రభుత్వం నుంచి కోట్ల రూపాయల నిధులను కుప్పలుగా తెచ్చి, నగరాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా ఉంచేందుకు నారాయణ తనవంతు కృషిచేశారు. దాంతో, నెల్లూరును స్మార్ట్ సిటీగా చేసేందుకు అడుగులు పడ్డాయి. అదేవిధంగా, నెల్లూరు నగర ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న రోడ్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థలను బాగుచేసేందుకు పెద్దఎత్తున పనులు ప్రారంభించారు. ఎన్నో అభివృద్ధి పనులు చేశారు కూడా. అందుకే, నేటికీ నారాయణ చేసిన సేవలను నగర ప్రజలు మరచిపోలేదు. సహజంగానే సమాజ సేవాభిలాషి అయిన నారాయణ, ఎన్నోరకాలుగా నగరానికి, నగరప్రజలకు వ్యక్తిగా, విద్యాదాతగా, మంత్రిగా ఎనలేని సేవలందించారు. 2014-19 మధ్యకాలంలో ఆయన మంత్రిగా ఉన్నప్పుడు, మంత్రి అంటే ఇలా ఉండాలి అన్నట్లుగా.. నగర ప్రజల కోసం కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధిపనులు మంజూరు చేయించి అందరి అభినందనలు అందుకున్నారు.

ఆయన చేసిన నిర్విరామ ప్రజాసేవలను ఒకసారి పరిశీలిస్తే....!

నెల్లూరు నగరాన్ని స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దేందుకు అప్పట్లో 14వ ఆర్థిక సంఘం నుంచి అమృత్ నిధులు దాదాపు రూ.25 కోట్లు మంజూరయ్యాయి. నగర సుందరీకరణలో భాగంగా రోడ్లను బాగుచేసేందుకు ఉపక్రమించారు. అవసరమైనచోట ఫుట్‌పాత్‌లను ఏర్పాటుచేశారు. మినీబైపాస్‌లో సాయిబాబా గుడివద్ద నుంచి అన్నమయ్య సర్కిల్ వరకు ఉన్న రోడ్డును సుమారు 2 కోట్ల రూపాయలతో అభివృద్ధిచేసి, 19.40కోట్ల రూపాయల స్మార్ట్‌సిటీ నిధులతో రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయడం ప్రారంభించారు. కోటీ 65 లక్షల రూపాయలతో సామాజిక మరుగుదొడ్లు నిర్మించారు. మరో 3 కోట్లా 23 లక్షల రూపాయల వ్యయంతో నగరంలో అనేక అభివృద్ధిపనులు చేపట్టారు. నగరాన్ని ఎల్ఇడి విద్యుత్ కాంతులతో శోభాయమానం చేశారు.

## పారిశుద్ధ్యపనులకు ఆధునిక యంత్రాలు

నెల్లూరు నగరంలో ఎంత చెత్త తీస్తున్నా అంతకంత వస్తూనే ఉంటుంది. ఎప్పటికప్పుడు చెత్తను పరిశుభ్రం చేసేందుకు సిబ్బంది, యంత్రాంగం ఉన్నా అవసరమైన ఆధునిక యంత్రాలు అందుబాటులో ఉండేవి కావు. ఆ పరిస్థితులను అధిగమిస్తూ నారాయణ మంత్రిగా ఉన్నప్పుడు కాంపాక్ట్ వాహనాలు, పలు రకాల స్వీపింగ్ యంత్రాలు, కాలువల్లో పూడికలు తీసేందుకు యంత్రాలు నెల్లూరుకు వచ్చాయి. మురుగులోకి నేరుగా దిగాల్సిన అవసరం లేకుండా ఆధునిక పద్ధతులతో యంత్రాల సాయంతో పరిశుభ్రతాచర్యలు చేపట్టడానికి చర్యలు తీసుకున్నారు. దోమల బెడదను నివారించేందుకు, భూగర్భ డ్రైనేజీ బాగుకు రూ.581 కోట్లతో పనులు శరవేగంగా ప్రారంభమయ్యాయి. వర్షాలు కురిసినప్పుడు ఆ నీళ్ళంతా రోడ్లమీద నిలవకుండా వరద నీటికాలువల నిర్మాణం కోసం 82 కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు.

## నగర ప్రజలకు ఆహ్లాదం కోసం.. నెక్లెస్ రోడ్డు

నెల్లూరు నగరప్రజలు ప్రశాంత వాతావరణంలో ఆహ్లాదంగా ఉండేందుకు నారాయణ ఆధ్వర్యంలో ఇరుగాళమ్మ గుడి వద్ద ఉన్న చెరువు వద్ద ఎంతో సుందరంగా నెక్లెస్ రోడ్డు నిర్మించారు. అందుకు దాదాపు 22 కోట్ల రూపాయలను వ్యయం చేశారు. చెరువు వద్దనే ఉన్న ప్రపంచవ్యాప్త పేరుగాంచిన పవిత్రమైన బారాషహీద్ దర్గా అభివృద్ధికి అప్పట్లో ప్రభుత్వం నుంచి సుమారు 20 కోట్లు మంజూరుచేయించి, దర్గాను మరింత సుందరంగా రూపుదిద్దారు. ఎక్కడా లేని విధంగా బారాషహీద్ దర్గాలో ప్రతిఏటా లక్షలాది మంది భక్తుల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగే రొట్టెల పండుగను రాష్ట్ర పండుగగా చేస్తూ గత ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంలో నారాయణ పాత్ర కీలకం.



మట్టిరోడ్ల స్థానంలో
ఎండ్ టు ఎండ్ సిమెంట్ రోడ్లు



పారిశుద్ధ్యం కోసం
అధునాతన వాహనాలు



పూడికలు తీసి
పరిశుభ్రం చేసిన పంట కాలువలు



సర్వాంగ సుందరంగా
బారా షహీద్ దర్గా

# నారాయణకి అడుగడుగునా ప్రజాదరణ

మాజీ మంత్రి, నెల్లూరు నగర శాసనసభ టీడీపీ అభ్యర్థి డా. పొంగూరు నారాయణ పట్ల నెల్లూరులో ప్రజాదరణ వెల్లువెత్తుతోంది. ఆయన ఎక్కడకు వెళ్ళినా ప్రజలు జేజేలు పలుకుతూ ఆశీర్వదిస్తున్నారు. నగరంలోని 51, 52 డివిజన్లలో ఈనెల 17న నిర్వహించిన టీడీపీ ర్యాలీ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. రంగనాయకులపేట నివాసులు నారాయణపై పూలవర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. ఆ ర్యాలీలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులంతా పాల్గొని నారాయణకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నారాయణ సతీమణి రమాదేవి, కుమార్తెలు సింధూర పొంగూరు, షరణిలు మహిళాశక్తి బృందాలతో కలిసి ప్రచార కార్యక్రమాల్లో తలమునకలయ్యారు. రానున్న ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వానికి పట్టం కట్టాలని, ఎమ్మెల్యేగా నారాయణను, ఎంపీగా వేమిరెడ్డిలను భారీమెజారిటీతో గెలిపించాలని వారు ప్రజలను అభ్యర్థించారు.

### టీడీపీకీ.. వైసీపీకీ తేడా గమనించండి

ఈ సందర్భంగా నారాయణ విలేకర్లతో మాట్లాడుతూ, నెల్లూరు నగర ప్రజల ఆదరణ మరువలేనిదని

## • టీడీపీకి జేజేలు పలుకుతున్న ప్రజలు





సంతోషం వ్యక్తం చేశారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని, 2019 నుంచి 2024 వరకు వైసీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలే పోల్చి చూసుకుని తేడాను గమనించాలన్నారు. వైకాపాను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని...ఆ రోజులు పోయాయని అంటూ, తాను ఏ డివిజన్‌కి వెళ్లినా ప్రజలందరూ తమపట్ల ఎంతో ఆదరణ చూపుతున్నారని, 'మీరు రావాల...ఆగిపోయిన పనులన్నింటిని మీరే పూర్తి చేయాల' అంటూ చెప్తున్నారని ఆయన తెలిపారు. ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోన్న వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు విసిగిపోయారన్నారు. సీఎం జగన్ తీరుతో రాష్ట్రవ్యాప్తంగా బిల్డర్లు, వ్యాపారస్తులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులందరూ ఇతర రాష్ట్రాలకి పారిపోయారని అన్నారు. బీటెక్, ఎంబీఏలు చేసిన ఎంతోమంది యువత నేటికీ ఉద్యోగాలు రాక పడే అవస్తలు వర్ణనాతీతమన్నారు. వారందరూ కూడా ఉద్యోగాలు కోసం ఎదురు చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో మళ్ళీ వైకాపా ప్రభుత్వం వస్తే, ఇక యువతకు ఒక్క ఉద్యోగం కానీ, ఉపాధి కానీ దొరికే పరిస్థితి ఉండదని అన్నారు. ప్రజల బాధలు తీరి, రాష్ట్రం బాగుపడాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయ కులు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వచ్చేది మన ప్రభుత్వమే

## - విపిఆర్, నారాయణల ధీమా

వచ్చేది టీడీపీ - బీజేపీ - జనసేనల ఉమ్మడి ప్రభుత్వమే నని ధీమా వ్యక్తం చేస్తూ, అధికారంలోకి రాగానే నెల్లూరు ప్రజల సమస్యలు తీర్చి, నెల్లూరును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ మంత్రి, నెల్లూరుసిటీ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణ ప్రజలకు హామీ ఇచ్చారు. ఇటీవల నెల్లూరు నగరంలోని చిల్డ్రన్స్ పార్కులో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీపీఆర్, నారాయణ ఇద్దరూ కలసి పార్క్‌లో కలియదిరుగుతూ జిమ్ చేసి, షటిల్ ఆడి, వాకర్స్‌తో కొద్దిసేపు సరదాగా గడిపారు. వాకర్స్ వారి దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. మన ప్రభుత్వం వచ్చిన వెంటనే చిల్డ్రన్స్ పార్క్‌లో నెలకొన్న సమస్యలన్నింటిని పరిష్కరించి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని వాకర్స్‌కి వారు హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో అందరి సహకారం తమకు ఎంతో అవసరమని, తనను ఎంపీగా, నారాయణను ఎమ్మెల్యేగా గెలిపించాలని వాకర్స్‌కి వారు విజ్ఞప్తి చేశారు. నెల్లూరులో అభివృద్ధి జరిగిందంటే అది ఒక్క నారాయణ వల్లేనని విపిఆర్ స్పష్టం చేశారు. వచ్చేది ఉమ్మడి ప్రభుత్వమేనని, ఎవరూ అధైర్యపడొద్దని వారు ధీమాగా చెప్పారు. అనంతరం నారాయణ మీడియాతో మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే నెల్లూరులోని పార్క్‌లన్నింటిని అభివృద్ధి చేస్తామన్నారు.





# నగరంలో తెలుగు తమ్ముళ్ళ భారీ ర్యాలీ



టీడీపీ అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, డా.పొంగూరు నారాయణలు నెల్లూరు నగరంలో చేస్తున్న ఎన్నికల ప్రచారాలకు జనం పెద్దఎత్తున తరలివస్తున్నారు. ఇటీవల ఇరగాళమ్మ గుడి నుంచి ములుమూడి బస్టాండ్ వరకు జరిగిన భారీ ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు వేలసంఖ్యలో పాల్గొని వారికి బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా పూల వర్షం కురిపిస్తూ... నీరాజనాలు పట్టారు. అనంతరం వీపీఆర్, నారాయణ ప్రచార రథం నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ తాళ్లపాక అనూరాధ, నారాయణ సతీమణి రమాదేవి, కుమార్తె షరణి, టీడీపీ నాయకులు రూప్‌కుమార్ యాదవ్, మామిడాల మధు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, స్వర్ణాల చెరువును మంచి టూరిస్ట్ ప్రాంతంగా చేయాలని నారాయణ చాలా కష్టపడ్డారన్నారు. అందుకోసం ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్డుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. కానీ ప్రస్తుత పరిస్థితి అందుకు పూర్తిగా భిన్నంగా ఉందని, అది నెక్లెస్ రోడ్డులా లేదని, చెత్త డంపింగ్ యార్డులా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దానిని బాగుచేయాలంటే తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. ప్రజలందరూ తనను ఎంపీగా, నారాయణని ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. తామిద్దరినీ గెలిపిస్తే నెల్లూరు అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని, నెల్లూరు నగరాన్ని భారతదేశంలోనే నెం.1 మోడల్ సిటీగా చేస్తామని హామీ ఇచ్చారు.

# జనసేన నాయకులతో నారాయణ



రానున్న ఎన్నికల్లో ఉమ్మడి ప్రభుత్వ సాధనే లక్ష్యంగా పాటుపడాలని నెల్లూరు నగర టీడీపీ అభ్యర్థి, మాజీమంత్రి డా. నారాయణ జనసేన నాయకులకు పిలుపునిచ్చారు. ఇటీవల నెల్లూరు నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు సుజయ్‌బాబు ఆధ్వర్యంలో 28 డివిజన్ల ఇన్‌ఛార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని తెలుగుదేశం పార్టీలో ఉన్న నాయకులకు తాము ఏ విధమైన గౌరవం ఇస్తామో జనసేన వారికి కూడా అదే గౌరవం ఇస్తామన్నారు. నగరంలోని 28 డివిజన్ల నాయకులు మద్దతుగా నిలిచి, తన గెలుపుకి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

# 'క్రీస్తుతో సంగీత సాయంత్రం'లో పాల్గొన్న నారాయణ



నెల్లూరు వీఆర్‌సీ మైదానంలో ఇటీవల సింహపురి క్రైస్తవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన 'క్రీస్తుతో సంగీత సాయంత్రం' కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు నగర అభ్యర్థి పొంగూరు నారాయణ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి కమిటీ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ప్రముఖ సినీ సంగీత దర్శకులు అనూప్ రూబెన్స్, నోయల్, సినీ నటులు రాజా, జబర్దస్త్ నటులు, ఇతర సినీ ప్రముఖులు ఈ కార్యక్రమాన్ని వీనులవిందు చేశారు. సంగీత కళాకారులు ఆలపించిన ఏసుక్రీస్తు పాటలను వీపీఆర్, నారాయణలు ఆసక్తిగా విన్నారు. ఈ జిల్లా అభివృద్ధి కోసం రానున్న ఎన్నికల్లో తమను ఆశీర్వదించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## అభాగ్యులకు దేవిరెడ్డి సుధాకరరెడ్డి సాయం

# పేదవారి కోసం కార్పొరేట్ వైద్యాలయం

## • దేవిరెడ్డి శారద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి శంకుస్థాపన

*"ధనముంటే ధనవంతుడంటారు..*
*అదే దానం చేస్తే భగవంతుడంటారు"*

సాక్షాత్తూ అదే చేస్తున్నారు దేవిరెడ్డి సుధాకరరెడ్డి. తనని విడిచి శాశ్వతంగా వెళ్లిపోయిన తన సహధర్మచారిణి దేవిరెడ్డి శారద పేరు సమాజంలో చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా సేవా కార్యక్రమాలకి శ్రీకారం చుడుతున్నారాయన. అందులో భాగంగా ఏప్రిల్ 15వ తేదీ నెల్లూరు భక్తవత్సలనగర్ ప్రాంతంలో "దేవిరెడ్డి శారద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్" నిర్మాణం కోసం శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.






తమ కుటుంబసభ్యులు, పుర ప్రముఖులు, దేవిరెడ్డి కుటుంబ అభిమానులు, జిల్లా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సభ్యుల సమక్షంలో ఈ మహత్కార్యక్రమానికి శంకుస్థాపన చేశారు. పేదవారికి అంతర్జాతీయ స్థాయిలో అత్యాధునిక చికిత్సలు అందించడానికి అందుబాటులోకి రానున్న ఈ ఆసుపత్రి "సింహపురి వైద్య సేవా సమితి" ఆధ్వర్యంలో నడుస్తుంది. ఇప్పటికే వారి నేతృత్వంలో సేవలందిస్తున్న జయభారత్ హాస్పిటల్‌కి అనుబంధంగా ఈ ఆధునిక వైద్యాలయం అందుబాటులోకి రానుంది. భారతదేశంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో రాబోతున్న అతిపెద్ద రెండవ కార్పొరేట్ ఆసుపత్రి ఇదే కావడం గమనార్హం. మొదటిది మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో ఉంది. అయితే దక్షిణ భారతదేశంలో తొలి అతిపెద్ద ఆర్ఎస్ఎస్ ఆసుపత్రిగా ఇది ఖ్యాతి పొందనుంది.

### 40 కోట్ల అంచనా, 9 అంతస్తులు, 2 లక్షల చదరపు అడుగులు!



ప్రస్తుతానికి 40 కోట్ల రూపాయల అంచనాతో, 9 అంతస్తులలో, 2 లక్షల చదరపు అడుగులలో ఈ ఆధునిక వైద్య ప్రాంగణాన్ని నిర్మించనున్నారు. సామాన్యుడికి అసామాన్య వైద్యసేవలు అందించే సేవా వేదికగా ఈ ఆసుపత్రిని తీర్చదిద్దనున్నారు.

## పేదవాడికి గొప్ప వైద్యం అందిస్తాం!

**- దేవిరెడ్డి సుధాకరరెడ్డి**

దేవిరెడ్డి శారద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి శంకుస్థాపన అనంతరం జరిగిన సభలో ఈ బృహత్తర కార్యక్రమ స్ఫూర్తిప్రదాత దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి ప్రసంగించారు. ఇలాంటి ఆసుపత్రులలో మనం వైద్యం చేయించుకోలేమా? అని పేదవాడు కార్పొరేట్ ఆసుపత్రుల వైపు దీనంగా చూడకుండా ఉండే విధంగా ఈ ఆసుపత్రిని నిర్మించబోతున్నామని చెప్పారు. తాను చేయాలనుకున్న పనికి సింహపురి వైద్య సేవాసమితి వారు కూడా ఎంతో పెద్దమనసుతో ముందుకువచ్చారంటూ ఈ సందర్భంగా వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పద్దెనిమిది నెలల కాలంలో ఆసుపత్రి నిర్మాణం పూర్తిచేసి ప్రజల సేవ కోసం అందుబాటులోకి తేవడానికి ప్రయత్నిస్తామని అన్నారు. గత నాలుగేళ్లుగా తన స్వగ్రామం పరిసర ప్రాంతాల వాసులకి తమ ట్రస్టు అందిస్తున్న సేవల గురించి వివరించారు. తమ ట్రస్టు వేదికగా ఒక హైస్కూల్‌ని, ప్రైమరీ హెల్త్‌సెంటర్‌ని, వృత్తి నైపుణ్య కేంద్రాన్ని, కన్వెన్షన్ సెంటర్‌ని ఏర్పాటుచేసి ఎంతోమంది పేదవారికి సేవలందిస్తున్నామని చెప్పారు. తమ సంస్థల ద్వారా అనేకమంది విద్యార్థినీవిద్యార్థులు విజ్ఞానవంతులుగా మారుతున్నారని, పేదవారు ఉచిత వైద్యం అందుకోగలుగుతున్నారని, మహిళలు, యువకులు టైలరింగ్, కంప్యూటర్, బ్యూటీషియన్, మగ్గం వంటి వృత్తులలో శిక్షణ పొందుతున్నారని చెప్పారు. తమ కన్వెన్షన్ సెంటర్‌లో అనేకమంది పెళ్ళిల్లు, రిసెప్షన్‌లు వంటి కార్యక్రమాలతో పాటు వ్యాపార సమావేశాలను కూడా నిర్వహించుకుంటున్నారని తెలిపారు. తన ఆలోచనలని, ఆశయాలని, ఆకాంక్షలని నెరవేర్చడానికి ఆయన అన్న దేవిరెడ్డి దశరథరామిరెడ్డి, తమ్ముళ్లు రఘురామిరెడ్డి, ప్రభాకరరెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని అంటూ వాళ్ళ సహకారం లేకుంటే తానొక్కడినే ఇవన్నీ చేయడం అసాధ్యమన్నారు. అన్ని విషయాలలో తనకి సహకరిస్తున్న తన సోదరులకి కూడా సుధాకరరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

## దేవిరెడ్డి కుటుంబం చేస్తున్న సేవలు ప్రశంసనీయం!

**- వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి**

ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ దేవిరెడ్డి సుధాకరరెడ్డి స్ఫూర్తితో వారి సోదరుల సహకారంతో ఆ కుటుంబం చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. ముఖ్యంగా సింహపురి వైద్య సేవా సమితి ఆధ్వర్యంలో అధునాతన వైద్యశాల నిర్మాణానికి దేవిరెడ్డి కుటుంబం ముందుకు రావడం అభినందనీయం అన్నారు. ఇప్పటికే జయభారత్ ఆసుపత్రి ద్వారా సింహపురి వైద్య సేవాసమితి చేస్తున్న నిస్వార్ధ సమాజసేవకి పలు సందర్భాలలో తాను చేయూతనిచ్చానని, ఇంకా ఎప్పుడు ఏం కావాలన్నా చేయడానికి సిద్ధంగా వున్నానని హామీ ఇచ్చారు.

సింహపురి వైద్య సేవాసమితి ట్రస్టు సభ్యులు డాక్టర్ సీ.వీ.సుబ్రహ్మణ్యం జయభారత్ ఆసుపత్రి అందిస్తున్న సేవలు, సాధించిన పురోగతి, భవిష్యత్ కార్యాచరణ వివరాలను సభకి నివేదించారు.

సింహపురి వైద్య సేవాసమితి ఛైర్మెన్ పొన్నలూరు సీతారామిరెడ్డి, ఆర్ఎస్ఎస్ సహక్షేత్ర సంచాలకులు దూసి రామకృష్ణ, సహక్షేత్ర ప్రచారక్ భరత్, ప్రాంత ప్రచారక్ ఆదిత్య, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి నాగారెడ్డి హరికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరుజిల్లా వైద్య సేవారంగానికే తలమానికంగా సామాన్యుడికి అసామాన్య వైద్యం అందించడమే లక్ష్యంగా, అధునాతన అంతర్జాతీయస్థాయి వైద్య సేవాలయం ఏర్పాటుకి ముందుకొచ్చిన దేవిరెడ్డి సుధాకరరెడ్డికి, ఆయన ప్రతిపాదనకు ఆమోదం తెలిపి సహకరిస్తున్న సింహపురి వైద్య సేవాసమితి ట్రస్టువారికి 'లాయర్' అభినందనలు.

# మళ్లీ మోసపోవద్దు.. వైకాపా మాయలో పడొద్దు!

**- ప్రజలకు విపిఆర్ పిలుపు**

ప్రజలు వైకాపా మాయలో పడొద్దని, ఇప్పటికే ఒకసారి మోసపోయారని, మళ్లీ మోసపోవద్దని నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి విపిఆర్ (వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి) ప్రజలకు పిలుపునిచ్చారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని సౌత్ మోపూరులో ఆయన ఇటీవల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైకాపా ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధిక ఛార్జీలు, ధరలు తగ్గాలన్నా, కరెంటు బిల్లులు తగ్గాలన్నా, ఉచిత బస్సు ప్రయాణం కావాలన్నా ఈ ఎన్నికల్లో టీడీపీ తప్పకుండా గెలవాలన్నారు. వాలంటీర్లకు మన ప్రభుత్వం వస్తే 10 వేలు జీతం ఇస్తారన్నారు. చంద్రబాబునాయుడు సీఎం అయితే వికలాంగులకు మేలు కలుగుతుందన్నారు. పింఛనుదారులకు ఇప్పుడిస్తున్న పింఛన్‌ను ఇంకా పెంచుతారన్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఏర్పడింది రాష్ట్ర ప్రయోజనాల కోసమేనని అన్నారు. యువతకు ఉద్యోగాలు రావాలన్నా, ప్రజలకు మేలు జరగాలన్నా చంద్రబాబునాయుడు సీఎం



కావాలన్నారు. చంద్రబాబునాయుడు అంటేనే ఒక బ్రాండ్ అని, ఆయన పేరు చెబితేనే రాష్ట్రానికి పెద్దపెద్ద కంపెనీలు క్యూ కడతాయని, ఎంతోమందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. నెల్లూరు ఎంపీగా తనను, రూరల్ ఎమ్మెల్యేగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని గెలిపిస్తే ఈ నియోజకవర్గాన్ని బాగా అభివృద్ధి చేస్తామని, సౌత్ మోపూరులో రోడ్లను బాగుచేసే బాధ్యత తీసుకుంటామని విపిఆర్ హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో టీడీపీని గెలిపించి, చంద్రబాబునాయుడును సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత తీసుకోవాలని ప్రజలను కోరారు. తొలుత గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొని వేమిరెడ్డిని, శ్రీధర్‌రెడ్డిని ఘనంగా స్వాగతించారు.

## 'కంభం, మాలేపాటి'లకు పార్టీ పదవులు

**అచ్చెన్నాయుడు నుంచి ఆదేశాలు**





ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డికి, కావలి టీడీపీ నాయకుడు మాలేపాటి సుబ్బానాయుడుకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పదవులు లభించాయి. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఈనెల 14న ఆమేరకు వారిని పార్టీ పదవుల్లో నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. అదేవిధంగా ఉదయగిరికి చెందిన మన్నేటి వెంకటరెడ్డిని పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు సూచనల మేరకు ఆ నియామకాలు చేయడం జరిగిందని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

● అన్నదానాలు.. వస్త్రదానాలు

# అనాధలు, అభాగ్యులకు..
# ఆత్మ బంధువులు!



**తల్లితండ్రులన్నా, సమాజమన్నా, పేదప్రజలన్నా విపిఆర్‌కు ఎంతో అభిమానం. దైవభక్తి-దేశభక్తి ఆయనకు ప్రాణప్రదం. మానవసేవ-మాధవ సేవ ఆయనకు ఉచ్వాస నిశ్వాసలు. అందుకే, అవకాశం వచ్చినప్పుడల్లా వారు దానధర్మాలు చేస్తూనే ఉంటారు. అవొక నిరంతర ప్రవాహంగా జరుగుతూనే ఉంటాయి. విపిఆర్ ఫౌండేషన్ సారధ్యంలో విపిఆర్ దంపతులు ఏళ్ళతరబడిగా చేస్తున్న అన్నదానాలు, వస్త్రదానాలు, గుప్తదానాలు లెక్కలేనన్ని. ఎన్నని చెప్పగలం?..ఒక్కమాటలో చెప్పాలంటే సౌజన్యమూర్తులైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు.. అనాధలకు.. అభాగ్యులకు ఆత్మబంధువులు!...**



'అన్నం పరబ్రహ్మ స్వరూపం' అన్నారు పెద్దలు. ఎంతమందికి అన్నం పెడితే అంత పుణ్యం వస్తుందంటారు. అందుకే, అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న అని చెప్తారు. రక్తదానం, నేత్ర దానం.. ఇలా ఏ దానమైనా, అభాగ్యులకు, అసహాయులకు సాయం చేయడం కంటే పుణ్యం ఇంకేముంటుందీ?.. అందుకే అనేక సందర్భాల్లో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానాలు, వస్త్రదానాలు చేస్తూనే ఉన్నారు. రోగులకు ఆపదలో అందించేందుకు రక్తదాన శిబిరాలు కూడా ఏర్పాటు చేశారు. ప్రత్యేకించి, నెల్లూరులోని వాత్సల్య అనాధ శరణాలయం, ప్రగతి చారిటబుల్ ట్రస్ట్‌లోని మానసిక దివ్యాంగులకు ఏళ్ళ తరబడిగా విపిఆర్ దంపతులు చేస్తున్న సేవలు, చేస్తున్న దానధర్మాలు అపూర్వం..అనన్య సామాన్యం. అంతేకాదు, జిల్లాలోని పలు ఆశ్రమాల్లోని వృద్ధులకు, ఆసుపత్రుల్లో ఉన్న పేదరోగులకు అనేక సందర్భాల్లో వారు అన్నదానాలు, వస్త్రదానాలు చేశారు.

2017లో ఫిబ్రవరి నెలలో నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి బధిరుల చెస్ పోటీలకు రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన బధిర క్రీడాకారులకు విపిఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రెండు రోజుల పాటు వారికి భోజన వసతి కల్పించారు. మన జిల్లాలోనే కాదు, తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో 2023లో జరిగిన శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో తిరుమలేశుని సేవకు అంకితమైన సుమారు 2వేల మంది టిటిడి సిబ్బందికి విపిఆర్ దంపతులు నూతన వస్త్రాలను బహుకరించారు. నెల్లూరుజిల్లాలోనే కాక, రాష్ట్రవ్యాపంగా అన్నదాతగా పేరొందిన మురళీకృష్ణ హోటల్స్ అధినేత, స్వర్గీయ గ్రోసు గోపాలయ్య వృద్ధుల కోసం నెల్లూరు నగరంలోని మైపాడుగేటు వద్ద నిర్మించిన శ్రీ మాతా అన్నపూర్ణేశ్వరి వృద్ధాశ్రమానికి విపిఆర్ పెద్దమొత్తంలో సాయం అందించారు. అంతేకాదు, ఆ ఆశ్రమంలో ఉన్న వృద్ధులందరికీ ఏడాదిలో ఒక నెలరోజుల పాటు భోజన ఖర్చులన్నీ విపిఆర్ దంపతులే అందజేస్తున్నారు కూడా. ఇంకా ఎవరికి ఏ సాయం చేశారో, ఎంత మందికి గుప్తదానాలు చేశారో వారికే గుర్తుండదు. ఎన్ని కోట్ల రూపాయలను సామాజిక సేవా కార్యక్రమాలకు వితరణగా ఇచ్చారో లెక్కుండదు. అంతటి పుణ్యమూర్తులు మన జిల్లాలో ఉండడం.. ఈ నేల చేసుకున్న పుణ్యం!..

విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, సేవామూర్తులు వేమిరెడ్డి దంపతుల సారధ్యంలో జరుగుతున్న ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రతిఒక్కరికీ స్ఫూర్తి దాయకమే మరి!..








ఏప్రిల్ 19.. విపిఆర్ పుట్టినరోజు సందర్భంగా..




జననం : 01.03.1929 నిర్యాణం : 24.04.2023

స్మృత్యంజలి

మానవతామూర్తి, సేవాదీప్తి
మాకందరికీ స్ఫూర్తి, మా కుటుంబ కీర్తి
**చిల్లకూరు రాధాకృష్ణారెడ్డి గారు**
( డాక్టర్ సి.ఆర్.రెడ్డి )
పరమపదించి తేది. 24.4.2024 నాటికి ఏడాది గడవనుంది.
ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

తమ్ముడు - మరదలు
**ఆచార్య సి.యం.కె.రెడ్డి - శ్రీమతి నిర్మల, చెన్నై**
తమ్ముని కుమారుడు - కోడలు
**డా॥ సి.యం.కిషోర్ - శ్రీమతి లీలాదేవి, చెన్నై**
తమ్ముని కుమార్తె - అల్లుడు
**శ్రీమతి హారిత - డా॥ రామానందరెడ్డి, కాకినాడ**
తమ్ముని మనుమలు.. మనుమరాండ్రు
**జయేష్ & అస్మిత కీర్తన లక్ష్మి & తనవ్**

## కోవూరులో వేమిరెడ్డి దంపతుల సమక్షంలో

# 40 మంది వలంటీర్లు టీడీపీలో చేరిక

○ రాష్ట్రంలో ఇదే ప్రథమమన్న ప్రశాంతిరెడ్డి



జిల్లాలో సంచలనం నమోదైంది. వలంటీర్లు కూడా తెలుగుదేశం పార్టీలో చేరుతుండడం పట్ల జిల్లా రాజకీయాల్లో కలకలం రేపుతోంది. కోవూరు నియోజకవర్గానికి చెందిన దాదాపు 40 మంది వలంటీర్లు ఇటీవల స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. 5 వేల జీతంతో బండినెట్టుకొస్తున్న వలంటీర్లు.. టీడీపీలో చేరేందుకు సిద్ధం కావడం, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డిల సమక్షంలో టీడీపీలో చేరడం జరిగింది. వేమిరెడ్డి దంపతులు ఆ వలంటీర్లకు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేసి టీడీపీలో చేరడం రాష్ట్రంలోనే ఇదే తొలిసారని అన్నారు. ఇంకా అనేకమంది వలంటీర్లు విముక్తి కోసం వేచి ఉన్నారని, వారంతా స్వచ్ఛంధంగా టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు సీఎం అయిన వెంటనే వలంటీర్లకు 10 వేల రూపాయల జీతం ఇస్తారని, పార్టీలో చేరిన ప్రతిఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తారని తెలిపారు.

# త్వరలోనే ప్రజాపాలన

వావిళ్లలో వేమిరెడ్డి దంపతులు



రాష్ట్రంలో అయిదేళ్ళ పాటు సాగిన నియంతృత్వానికి తెరపడి, త్వరలో చంద్ర బాబు నేతృత్వంలో ప్రజాపాలన రానుందని వేమిరెడ్డి దంపతులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల వారు విడవలూరు మండలం వావిళ్ళలో ఇంటింటికీ వెళ్ళి ప్రజలతో మాట్లాడుతూ, టీడీపీ అధికారంలోకి వస్తే కోవూరు నియోజకవర్గంలో అవినీతి లేని పాలన అందిస్తామన్నారు. టీడీపీతో పాటు మిత్రపక్షంలోని జనసేన, బిజెపి కార్యకర్తలు వేమిరెడ్డి దంపతులకు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అవినీతితో పాటు నాయకుల నిర్లక్ష్యం గ్రామాల్లో అభివృద్ధికి ఆటంకమైందన్నారు. ప్రజలంతా తమను ఆశీర్వదించి గెలిపిస్తే, గ్రామీణ ప్రాంతాలలో మెరుగైన విద్య, వైద్యం, ఉపాధి చూపేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# రెడ్డిపాళెంలో ఫ్లోరైడ్ సమస్య తీరుస్తాం

- హామీ ఇచ్చిన ప్రశాంతిరెడ్డి



కోవూరు నియోజకవర్గం బుచ్చిరెడ్డిపాళెం మండలం రెడ్డిపాళెంలో ప్రజల మంచినీటికి ఎంతోకాలంగా ఇబ్బందులు పడుతున్నారని, తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆ సమస్యకు పరిష్కారం చూపుతామని కోవూరు నియోజకవర్గ ఎన్‌డీఏ ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. బుచ్చిరెడ్డిపాళెంలోని రెడ్డిపాళెంలో ఆమె ఇటీవల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెడ్డిపాళెం గ్రామంలో భూగర్భ జలాలు ఫ్లోరైడ్‌తో నిండి ఉన్నాయన్నారు. ఆ సమస్యని అధిగమించాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలన్నారు. తాను గెలిచిన వెంటనే ఈ గ్రామంలోని ప్రతి ఇంటికి శుద్ధమైన నీటిని కుళాయి కనెక్షన్ ద్వారా అందిస్తానని హామీ ఇచ్చారు.

# ప్రతి ఇంటికీ సంక్షేమం.. టీడీపీతోనే

○ కొత్తవంగల్లు సభలో ప్రశాంతిరెడ్డి

కోవూరు శాసనసభ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇటీవల కొడవలూరు మండలం కొత్త వంగల్లు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కోవూరులో వనరులున్నా అభివృద్ధి శూన్యమని విమర్శించారు. ప్రతి ఇంటికి సంక్షేమం అందాలంటే తెలుగుదేశం పార్టీ గెలవాలన్నారు. తాము గెలిస్తే, నాగ చెరువు కట్టకింద ఉన్న రెండు బావుల్లోనూ పూడిక తీసి కాంక్రీటుతో దరులు కట్టించి కొత్త వంగల్లు గ్రామానికి తాగునీటి సమస్య లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు.



## కాకర్ల సారధ్యంలోనే...

# ఉదయగిరికి.. ప్రగతి సిరి!

### హైదరాబాద్ ఆత్మీయ సమావేశంలో వలసవాసులు

### 'కాకర్ల మాటే..మా బాట'..అంటున్న అభిమానులు



**ఉదయగిరి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ సారధ్యంలోనే ఉదయగిరికి ప్రగతికి సిరి వస్తుందని ఉదయగిరి ప్రజలు గట్టిగా విశ్వసిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీకి దిగిన కాకర్లను హైదరాబాద్‌లో స్థిరపడిన ఉదయగిరివాసులు ఇటీవల జరిగిన ఆత్మీయ సమావేశంలో అభినందించి ఆశీర్వదించారు. కాకర్లకు మద్దతునిస్తూ ఎల్ల వేళలా ఆయనకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.**

జిల్లాలో అభివృద్ధిలో వెనుకబడి, సరైన నీటివసతులు లేక మెట్ట ప్రాంతంగా ముద్రపడిన ఉదయగిరి నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే టీడీపీ-బీజేపీ-జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఒక్క కాకర్ల సురేష్‌కి మాత్రమే సాధ్యమవుతుందని ఎంతోమంది వలసవాసులు ఘంటాపథంగా చెప్తున్నారు. ఉదయగిరి నుంచి హైదరాబాద్‌కు వెళ్ళి స్థిరపడిన అనేకమంది ఈనెల13న హైదరాబాద్ బిఎన్‌రెడ్డినగర్‌లో ఉదయగిరి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. బిఎన్‌రెడ్డి నగర్, వనస్థలిపురం, ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాలలో నివసిస్తున్న ఉదయగిరి నియోజకవర్గ ప్రజలు ఆ సమావేశానికి వచ్చి 'అండగా మేముంటాం.. మిమ్మల్ని గెలిపించుకుంటాం' అంటూ కాకర్ల సురేష్‌కు మద్దతు ప్రకటించడం విశేషం. 'ఈ ఆత్మీయసమావేశానికి వచ్చిన ఉదయగిరి నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు' అంటూ కాకర్ల వారికి వినమ్రంగా ధన్యవాదాలు చెప్పారు. 'ఆదరించండి-ఉదయగిరి అభివృద్ధికి సహకరించండి' అని వారందరినీ ఆయన అభ్యర్థించారు. మీకు ఏ కష్టం వచ్చినా తను అండగా ఉంటానంటూ హామీ ఇచ్చారు. ఎన్నికలకు సమయం దగ్గర పడుతోంది కనుక, ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాలకు చెందిన వలసవాసులందరూ సత్వరం తమ స్వగ్రామాలకు చేరుకొని తెలుగుదేశం పార్టీ విజయానికి పాటుపడాలని ఆయన కోరారు.



### కోవి మాల్యాద్రి ఆధ్వర్యంలో..60 కుటుంబాలు టీడీపీలో చేరిక

ఈ సందర్భంగా ఉదయగిరి నియోజకవర్గంలోని కొండాపురం మండలం గొట్టిగుండాలపాలెం గ్రామ సర్పంచ్ కోవి మాల్యాద్రితోపాటు 60 కుటుంబాల వారు వైసీపీని వదిలిపెట్టి కాకర్ల సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారందరికీ ఆయన తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వింజమూరు మండలం రావిపాడు మాజీ సర్పంచ్ మోత్కూరు హనుమంతరావు, కొండపల్లి సురేష్, దంతులూరి శ్రీనివాసులు, పవన్‌కుమార్, మోత్కూరు రామాంజనేయులు, మోత్కూరు హరీష్‌లు టీడీపీలో చేరారు. అదేవిధంగా, ఉదయగిరి ప్రాంతవాసులు కోవి కొండల్‌రావు, కోవి లక్ష్మి, కోవి మహేష్, కోవి లావణ్య, కోవి మహేశ్వరి, వింజం చెన్నయ్య, వింజం పద్మ, వింజం మురళి, ఓరుగంటి దొరస్వామినాయుడు, ఓరుగంటి స్రవంతి, ఓరుగంటి బాబురావు, ఓరుగంటి లలిత, చల్లా శ్రీనివాసులు చల్లా మస్తానమ్మ, చల్లా వికెలేష్‌నాయుడు, మలాది రాములు, తులసమ్మ, వింజం రాములు, శ్రీదేవి, రామకృష్ణ శ్రీనివాసులు, మలాది లావణ్య, బండారు మాల్యాద్రి, బండారు చెన్నమ్మ, వింజం కొండపనాయుడు, వింజం జ్ఞానాంబిక, వింజం బాలకృష్ణ, వెంకటగాంధీ, బ్రహ్మనాయుడు, భవాని, మహేశ్వరి, మలాది మాలకొండరాయుడు, భాగ్యమ్మ మలాది వెంకటేశ్వరరావు, సరస్వతి, రమేష్, కేశవ, వెంకటరత్నం, లక్ష్మి, రవి, స్వర్ణ, కోవి సుబ్బరాయుడు, కొండపనాయుడు, వెంకటరత్నం, దివ్య, వెంకటేశ్వర్లు, సుబ్బరత్నమ్మ, హరికృష్ణ, రాములు, రమాదేవి, గోపీకృష్ణ, చల్లా సుబ్బారావు, అనసూయ, రత్నం, శిరీష, అనసూయ, చల్లా రత్నం, కొండాపురం మండల కన్వీనర్ మారెళ్ళపల్లి ఓంకారం, వింజమూరు మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, కొండాపురం మాజీ జడ్పీటీసీ సభ్యులు మహేశ్వరరావు, మారెళ్ళపల్లి రామయ్య తదితర ముఖ్యనాయకులు పాల్గొన్నారు.





# జగన్‌వైపే.. జనమంతా!

## నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



ఎవరెన్ని రకాల కుట్రలు చేసి వైకాపాను ఓడించాలని ప్రయత్నం చేసినా అది సాధ్యం కాదని, జనమంతా జగన్‌వైపే ఉన్నారని, రానున్న ఎన్నికల్లో వైకాపా భారీ మెజారిటీతో విజయభేరీ మోగిస్తుందని వెంకటగిరి నియోజకవర్గం వైకాపా అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 14న ఆయన వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి మండలం దాచూరు, కమ్మ పాలెం, ముక్క తిప్ప, పెరముకొండ, దాసరపల్లి, వెరుబోట్లపల్లి గ్రామపంచాయతీలలో జరిగిన రోడ్డుషోలలో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడం కోసం ఇటీవలికాలంలో తాను ప్రతి మండలంలో ఇంటింటికీ తిరుగుతున్నానని, ఎక్కడ చూసినా జగన్ పట్ల, వైకాపా ప్రభుత్వ తీరుపట్ల ప్రజల నుంచి వస్తున్న స్పందన, ఆదరణ అద్భుతమన్నారు. వెంకటగిరి వైకాపా అభ్యర్థిగా పోటీచేస్తున్న తనను ప్రజలు ఆదరించాలని, ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే వెంకటగిరిని అభివృద్ధిలో అగ్రగామి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు

## రామ్‌ను గెలిపించండి - నేదురుమల్లి రాజ్యలక్ష్మి



వెంకటగిరి నియోజకవర్గ ప్రజలతో తమ కుటుంబానికి ఎంతోకాలం నుంచి అనుబంధం ఉందని, నేదురుమల్లి కుటుంబమంటే నియోజకవర్గ ప్రజలకు ఎంతో అభిమానమని మాజీమంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి చెప్పారు. ఇటీవల ఆమె బాలాయపల్లి మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను పరామర్శించారు. బాలాయపల్లిలో అభివృద్ధి నేదురుమల్లి కుటుంబం వల్లే సాధ్యమైందని ఆమె గుర్తు చేస్తూ, రానున్న ఎన్నికల్లో నేదురుమల్లి కుటుంబం నుంచి వైకాపా అభ్యర్థిగా పోటీలో ఉన్న రామ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు . రామ్ గెలిస్తే మళ్ళీ వెంకటగిరికి పూర్వవైభవం వస్తుందని, ఏదైనా చెప్తే తప్పకుండా చేసే తత్వం తమదని, నేదురుమల్లి కుటుంబం అంటేనే మాట తప్పని కుటుంబమని ఆమె పేర్కొన్నారు. ఆమె వెంట నాయకులు వెందోటి కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# చంద్రబాబువన్నీ ఉత్తుత్తి హామీలే

## - నాయుడుపేట సభలో కిలివేటి సంజీవయ్య విమర్శ -

జన సంక్షేమం జగనన్నతోనే సాధ్యమవుతుందని, రానున్న ఎన్నికల్లో వైకాపా విజయానికి ప్రతిఒక్కరూ తోడ్పడాలని సూళ్ళూరుపేట వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటి సంజీవయ్య కోరారు. ఈనెల 15న ఆయన తిరుపతి ఎంపీ అభ్యర్థి గురుమూర్తితో కలసి నాయుడుపేటలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు ఈ ఎన్నికల సందర్భంగా చెప్పేవన్నీ ఉత్తుత్తి మాటలేనని, అన్నీ అబద్దపు హామీలేనని విమర్శించారు. ప్రజల సంక్షేమాన్ని, రాష్ట్ర అభివృద్ధిని రెండు కళ్ళుగా భావిస్తూ, రాష్ట్రంలో కనీవినీ ఎరుగని విధంగా ప్రజల కోసం ఎన్నో పథకాలను అమలుచేస్తున్న ముఖ్యమంత్రి వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని, అందు కోసం పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలన్నారు. ముఖ్యంగా పేదలకు, బడుగు బలహీనవర్గాల వారికి, దళితులకి, బీసీలకి, మైనార్టీలకి ప్రత్యేకించి ప్రయోజనం చేకూరే విధంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలందరి ప్రశంసలందుకుంటున్నాయని ఆయన అన్నారు. ఇప్పుడు కొనసాగుతున్న ప్రజాసంక్షేమ కార్యక్రమాలు కొనసాగాలంటే మళ్ళీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాలన్నారు. కరోనా రాకాసి వ్యాధి విజృంభిస్తున్న సమయంలో, రాష్ట్రం ఎంతగా ఆర్థికసంక్షోభంలో ఉన్నా రాష్ట్ర ప్రజలకు మాత్రం సంక్షేమ పథకాలు ఆగకుండా కొనసాగించిన ఘనత ఒక్క ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఆయన కొనియాడారు. ఆ కష్టకాలంలో చంద్రబాబు కానీ, పవన్‌కల్యాణ్ కానీ హైదరాబాద్‌లో ఉన్న వాళ్ళ నివాసాల్లోంచి బయటకే రాలేదని, ఇప్పుడు ఎన్నికలు రాగానే వారికి ప్రజలు గుర్తొచ్చారంటూ కిలివేటి ఎద్దేవా చేశారు. ఇప్పుడొచ్చి ప్రజలకు అవిచేస్తాం..ఇవి చేస్తాం అంటూ అబద్దపు హామీలిస్తున్నారని, వాటిని నమ్మవద్దని ఆయన అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 'నవరత్నాల' పథకాలతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు బాసటగా నిలిచిన విషయం అందరికీ తెలిసిందేనని, అలాంటి ముఖ్యమంత్రిని మళ్ళీ ముఖ్యమంత్రిగా చూడాలని, అందుకు వైకాపా అభ్యర్థులకు భారీ మెజారిటీతో విజయం సాధించిపెట్టాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వైకాపా నాయకులు కట్టా సుధాకర్‌రెడ్డి, డీసీసీబీ ఛైర్మెన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సీనియర్ నాయకులు వేనాటి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలుత వారు పిచ్చిరెడ్డి తోపులోని విజయగణపతి, పోలేరమ్మ, పిళ్లారి గుడుల వద్ద పూజలు చేసి అనంతరం ప్రచార ర్యాలీని ప్రారంభించారు. కిలివేటి తదితర నాయకులను స్థానిక ప్రజలు, అభిమానులు పెద్దఎత్తున స్వాగతించారు.

# ప్రజలను మభ్యపెట్టేందుకే.. 'బాబు కూటమి'

## - దుయ్యబట్టిన మేరిగ మురళీధర్



తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

మోసపూరిత హామీలతో రాష్ట్ర ప్రజలను మరోసారి మభ్యపెట్టేందుకే చంద్రబాబునాయుడు 'కూటమి' కట్టారంటూ గూడూరు వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ దుయ్యబట్టారు. ఈ నెల 16న ఆయన కోట మండలంలోని పలు ప్రాంతాల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 14 ఏళ్ళు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు ప్రజల కోసం ఒక్క మంచిపనైనా చేశాడా? అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల్లో మాత్రమే లేనిపోని పథకాలంటూ ప్రజలను మభ్యపెడుతుంటాడని, ప్రజలు ఆయన మాటలను నమ్మి మోసపోవద్దని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం పాటుపడే వైకాపాను ఈ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. సీనియర్ నాయకుడు కొడవలూరు ధనుంజయరెడ్డి, నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, సంపత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మేరిగ మురళిని భారీ మెజార్టీతో గెలిపించాలి

## గూడూరు నాయకులతో మంత్రి పెద్దిరెడ్డి



గూడూరు నియోజకవర్గ వైసీపీ నాయకులు ఈ నెల 17న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న మేరిగ మురళీధర్ భారీ మెజార్టీతో గెలిచేందుకు వైసీపీ నాయకులంతా కృషి చేసి పార్టీ ద్రోహులకు గుణపాఠం కలిగేలా ఎన్నికల్లో పనిచేయాలని ఈ సందర్భంగా పార్టీ నాయకులకు మంత్రి పెద్దిరెడ్డి దిశా నిర్దేశం చేశారు. మంత్రిని కలిసిన వారిలో గూడూరు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు ఎంఆర్‌సి రెడ్డి, జగనన్న సేవా సమితి అధ్యక్షులు ఊటుకూరు మహేంద్రరెడ్డి, నియోజకవర్గ ఎన్నికల మేనేజ్‌మెంట్ కన్వీనర్ చేవూరు విజయమోహన్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి, బత్తల రాజేష్, గోపాల్ తదితరులున్నారు.



# గూడూరును నెల్లూరులో కలిపేస్తాం

## గూడూరు తెదేపా అభ్యర్థి పాశం సునీల్

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే గూడూరును యథాతథంగా నెల్లూరు జిల్లాలోనే కలిపేస్తామని మాజీ ఎమ్మెల్యే, గూడూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఈ నెల 16వతేదీ గూడూరు రెండవ పట్టణంలోని కాస్మోపాలిటన్ క్లబ్ ఫంక్షన్ హాలులో అపస్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పట్టణ ప్రైవేటు స్కూల్స్ ఉపాధ్యాయుల ఆత్మీయ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే గూడూరును తిరుపతి జిల్లా నుండి వేరుచేసి నెల్లూరులోనే కలిపేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. ఓడినా గెలిచినా తాను గూడూరులోనే ఉంటానన్నారు. రాష్ట్రం బాగుపడాలన్నా, మన బిడ్డల భవిష్యత్తు బాగుపడాలన్నా టీడీపీని గెలిపించుకోవాలన్నారు. ఎస్వీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కరెస్పాండెంట్ కేఆర్. రెడ్డి, నందిమండలం బాలకృష్ణమనాయుడు, దశరథరామిరెడ్డి, టీడీపీ నాయకులు, పట్టణ ప్రైవేటు స్కూల్స్ ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# తిప్పవరప్పాడులో నీటికి కటకట

గూడూరు మండలంలోని తిప్పవరప్పాడు గ్రామ దళిత కాలనీలో పంచాయితీ అధికారులు గత కొన్ని రోజులుగా త్రాగునీటి సరఫరాను నిలిపివేయడంతో ఆ ప్రాంత ప్రజలు గుక్కెడు నీటి కోసం నానా కష్టాలు పడుతున్నారు. ఎండలు మండిపోతున్న ఈ సమయంలో నీటిని సరఫరా చేయకపోవడంతో కాలనీ ప్రజలు అల్లాడుతున్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు త్రాగునీటి సరఫరాని వెంటనే పునరుద్దరించి తమ కష్టాలు తీర్చాలని ఆ కాలనీ వాసులు కోరుతున్నారు.

# గ్రావెల్ కోసం కొండలను కూడా తినేశారు

## • కాకాణిపై సోమిరెడ్డి ఆగ్రహం



గ్రావెల్ కోసం కొండలను కూడా తినేశారని, ప్రకృతి వనరులను కొల్లగొట్టి దోచుకోవడం, దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారే తప్ప, ఏనాడూ ప్రజల సమస్యలు కానీ, రైతుల సమస్యలు కానీ పట్టించుకోని మంత్రి కాకాణికి ప్రజలు ఈ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పాలని మాజీమంత్రి, టీడీపీ సర్వేపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఆయన వెంకటాచలం మండలం ఈదగాలి పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తీరును దుయ్యబట్టారు. కాకాణి మైనింగ్ మాఫియా ఏ స్థాయిలో చెలరేగిపోయిందో తెలుసుకునేందుకు ఈదగాలి పంచాయతీ శ్రీకాంత్ కాలనీలో పేదల ఇళ్ల చుట్టూ తవ్విన గ్రావెల్ గుంతలే ప్రత్యక్ష నిదర్శనమన్నారు. 1994లో తాను మొదటి సారి ఎమ్మెల్యే అయ్యే నాటికి ఈదగాలికి తారురోడ్డు లేదు, మంచినీటి పథకాలు లేవు..వీధిలైట్లు కూడా లేని దుస్థితి. చుట్టూ కర్రతుమ్మ చెట్లు, మధ్యలో ఊరు. పొలాల్లోకి వెళ్లేందుకు కూడా దారులు లేవు. కండ్రిగ వాసులైతే ఎండాకాలంలో రెండుమూడు కిలోమీటర్లు నడిచి నీళ్లు తెచ్చుకోవాల్సిన స్థితి. అలాంటి పరిస్థితుల్లో ఈదగాలిలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తాను నిధులు తెచ్చి నాలుగు ఓవర్ హెడ్‌ట్యాంకులు కట్టించానని, టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.6కోట్లతో సిమెంట్ రోడ్లు వేయించానని ఆయన చెప్పారు. అంతేకాదు, రూ.1.28 కోట్లతో ఇరిగేషన్ వ్యవస్థను ఆధునీకరించానని, ప్రతి ఇంటికి తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయడంతో పాటు 372 ఎల్ఈడీ వీధి దీపాలు వేయించానన్నారు. పొలాల్లో లింకు రోడ్లు, డొంక రోడ్లు వేయించి రైతుల కష్టాలు తీర్చానన్నారు. సర్వేపల్లి నుంచి ఇడిమేపల్లి, ఈదగాలి మీదుగా పూడిపర్తి వరకు తారురోడ్డు వేయించానని తెలిపారు. ఇన్ని పనులు చేశాను కనుకనే తనకు ప్రజలను ఓటు వేయమని ధైర్యంగా అడిగే హక్కు ఉందని ఆయన అన్నారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి ఎమ్మెల్యేగా, మంత్రిగా అధికారం చేతిలోకి తీసుకున్న తర్వాత ఈదగాలి చుట్టూ గ్రావెల్ సంపద మాయమైపోతోందని, గిరిజన బిడ్డలుండే శ్రీకాంత్ కాలనీ చుట్టూ వందల ఎకరాల్లో గ్రావెల్ తవ్వి కాకాణి అండ్ కో వారు కోట్లాది రూపాయలు దోచేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. పేదల ఇళ్లు చుట్టూ 30 అడుగుల లోతులో గ్రావెల్ గుంతలు తవ్వి మహిళలు, పిల్లలు బయటకు రావాలంటేనే వణికిపోయే పరిస్థితి తెచ్చారని ఆయన మండిపడ్డారు. నిత్యం కోట్ల రూపాయల సంపాదనే ధ్యాసగా బతికే కాకాణికి పేదలంటే అర్థం తెలుసా అని ఆయన ప్రశ్నించారు. పేదల కాలనీలు, ఇళ్ల పేరుతోనూ కోట్లు దోచేసుకుంటున్నారని, ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈదగాలి చుట్టూ ఎన్ని ఎకరాల్లో గ్రావెల్ ఎత్తేశారో, ఎన్ని కోట్లు దోచారో లెక్కలు చెప్పి పేదలకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతే కాకాణి ఓట్లు అడగాలని సోమిరెడ్డి అన్నారు.

# వైకాపాకు ప్రజలు గుణపాఠం చెప్పాలి



రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైకాపాను రానున్న ఎన్నికల్లో ఓడించి ప్రజలు గుణపాఠం చెప్పాలని మాజీమంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, సర్వేపల్లి నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఈనెల 16న ఆయన వెంకటాచలం మండలంలోని కసుమూరులో ముస్లిమ్ మైనార్టీల ఆత్మీయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు పాలనలో ముస్లిమ్, మైనార్టీ వర్గాల సంక్షేమానికి ఎంతో కృషి జరిగిందన్నారు. రంజాన్ తోఫా, దుల్హన్, దుకాన్-మకాన్ వంటి పథకాలు, మైనార్టీలకు విదేశీ విద్య వగైరాలను కల్పించడం వంటి పథకాలన్నీ చంద్రబాబు హయాంలో బాగా జరిగాయని ఆయన చెప్పారు. వైకాపా ప్రభుత్వం వచ్చాక, ముస్లిమ్ మైనార్టీలను ఆ సంక్షేమ పథకాలకు దూరం చేసి, వారికి తీరని అన్యాయం చేసిందని, ప్రజలు ఈ ఎన్నికల్లో టీడీపీని గెలిపించి, వైకాపా ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని ఆయన కోరారు. సర్వేపల్లి నియోజకవర్గంలో మంత్రి కాకాణి ముస్లిమ్‌లను అణచివేతకు గురిచేశారని ఆయన ఆరోపించారు. అన్నివర్గాల ప్రజలకు మేలు చేకూరేది ఒక్క టీడీపీ ప్రభుత్వంలోనే అని ఆయన స్పష్టం చేశారు. అనేకమంది ముస్లిమ్‌లు ఈ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు.


## పుస్తకమే పరిమళం!

పుస్తకంతో సయోధ్య కుదిరితేనే
అయోధ్య సంప్రాప్తిస్తుంది.
పుస్తకాలు మానవ దిక్సూచికాలు
మార్గదర్శనం చేసి
ముందుకు నడిపించే నేస్తాలు
జ్ఞానతృష్ణను తీర్చే చలివేంద్రలు
విజ్ఞాన జ్యోతిని వెలిగించే
అమృత భాండాగారాలు
పుస్తక పరిమళం అంటనిదే
మనిషి జాగృతం కాలేడు
పుస్తకాన్ని మించిన వైభవం
భువిలో లేదు
పుస్తకమే సమస్తం నేస్తం
అదే జీవనసూత్రం
పుస్తకం మనిషిలో గడ్డకట్టిన
సముద్రాన్ని గొడ్డలిలాగా
పగులగొట్టి
మున్ముందుకు నడిపిస్తుంది.
ఆ ఘోషలో మన
జీవనలయ విన్పిస్తుంది.
తిమిర వాహికలు తప్పుకొని
పచ్చటి తివాచీలు పరుస్తాయి.
పుస్తక సాంద్రతతోనే బతుకు
బోధివృక్షమై మసకేసిన
మబ్బు వెల్గుతునకై భాసిల్లుతుంది!

(ఏప్రిల్ 23
అంతర్జాతీయ
పుస్తక దినోత్సవం
సందర్భంగా)



చిన్ని నారాయణరావు
9440202942

సంస్మరణ

మాకు స్ఫూర్తిప్రదాత
శ్రీ బోగొల్లు నారాయణరెడ్డి గారి
29వ వర్ధంతి సందర్భంగా
వారి దివ్యస్మృతికి మా నివాళి.

కీ॥శే॥ బోగొల్లు నారాయణరెడ్డి గారు
నిర్యాణం : 23-4-1995 వర్ధంతి : 23-4-2024

కుమారులు
డా॥ బోగొల్లు ప్రభాకర్‌రెడ్డి
Nellore
బోగొల్లు మోహన్‌రెడ్డి
Architects & Builders
Hyderabad
మరియు కుటుంబసభ్యులు



● సాహితీ రంగం

## తెలుగు భాషాభివృద్ధికి విపిఆర్ విశేష సేవలు

# భాషపై మక్కువ.. భాషాభిమానం ఎక్కువ!

**విపిఆర్‌కు తొలినుంచీ భాషపై మక్కువ. భాషాభిమానం ఎక్కువ. అమ్మభాష పట్ల ఆత్మీయతతో ఆయన తెలుగుభాషకు ఎంతోకాలంగా తనవంతు సేవలందిస్తున్నారు. 2013లో మలేషియాలో నిర్వహించిన ప్రపంచ తెలుగు సమాఖ్య ద్వైవార్షిక సమావేశానికి లక్షలాది రూపాయలను వేమిరెడ్డి దంపతులు వితరణగా అందజేశారు. ప్రపంచ తెలుగు సమాఖ్య ఉపాధ్యక్షులుగా ఉంటూ విపిఆర్ సారధ్యంలో 2023లో నెల్లూరులో పెద్దఎత్తున ఉగాది వేడుకలు నిర్వహించారు. ఆ కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో కవులు, కళాకారులు, తెలుగుభాషాభిమానులు పాల్గొన్నారు. అదే విధంగా, తొలి తెలుగు వాగ్గేయకారుడు.. పదకవితా పితామహుడు శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యుల వారి జయంతి ఉత్సవాలను కూడా విపిఆర్ దంపతుల సారధ్యంలో ప్రతి యేటా నిర్వహిస్తున్నారు. నెల్లూరు, మినీబైపాస్‌రోడ్డులో అన్నమాచార్యుల వారి విగ్రహం వద్ద జరిగే సంకీర్తనల గోష్టిగానాలతో నెల్లూరు పులకించిపోతుంది. ఇలాంటి ఎన్నో కార్యక్రమాల ద్వారా తెలుగుభాషకు, తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట వేశారు..విపిఆర్ దంపతులు.**

ఆంధ్రప్రదేశ్ పురావస్తు శాఖ, ప్రపంచ తెలుగు సమాఖ్య సంయుక్తంగా తెలుగువారి చరిత్రను భావితరాలకు స్ఫూర్తిదాయకంగా అందించేందుకు విశాఖపట్నంలో 'ఆంధ్రప్రదేశ్ చరిత్ర' పేరుతో నిర్మించిన భారీ మ్యూజియంకు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి లక్షలాది రూపాయలను అందజేశారు. ప్రపంచ తెలుగు సమాఖ్యకు ఆయన ఉపాధ్యక్షులు కూడా. తెలుగువారి ప్రాభవ వైభవాలను చాటే ఈ సమాఖ్య ఆధ్వర్యంలో జరిగే అనేక కార్యక్రమాలకు ఆయన సహాయమందిస్తున్నారు.

నెల్లూరు సాహిత్యానికి కీర్తికేతనం వంటివారు డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి. ప్రముఖ స్వాతంత్ర్య యోధునిగా, మాజీ గవర్నర్‌గా, మచ్చలేని రాజకీయ వేత్తగా ఆయన సింహపురి సీమకే విఖ్యాతిని తెచ్చారు. స్వతహాగా ఆయన కవి. ఎన్నో కవితా సంపుటాలను ఆయన ముద్రించారు. అంతేకాదు, తాను ఉన్నత పదవుల్లో ఉన్న రోజుల్లో తెలుగుభాషకు ఆయన చేసిన సేవలు అపూర్వం. తెలుగుభాష అభివృద్ధికి నిరంతరం తపించి, సాహిత్య అకాడమీలకు, తరతరాలకు ఉపయోగపడే సాహితీ విజ్ఞాన సర్వస్వాల ముద్రణకు డా. బెజవాడ చేసిన కృషి అనన్య సామాన్యం. అలాంటి మహనీయులను గుర్తుపెట్టుకుని, వారు



తెలుగుభాషకు, సాహిత్యానికి చేసిన సేవలను భావి తరాల వారు కూడా గుర్తుంచుకునేవిధంగా నెల్లూరులో ఆయన విగ్రహాన్ని స్థాపించేందుకు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తనవంతు ఆర్థికసాయాన్ని అందించారు. నెల్లూరు మినీబైపాస్‌రోడ్డులో డా. బెజవాడ గోపాలరెడ్డి విగ్రహాన్ని సర్వాంగసుందరంగా ఏర్పాటు చేసి తెలుగు భాష పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు.. విపిఆర్!




### విపిఆర్ సారధ్యంలో.. అత్యద్భుతంగా ఉగాది వేడుకలు

తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలకు ఆలవాలమైన ఉగాది పండుగ వేడుకలను సైతం విపిఆర్ ఎంతో వేడుకగా జరిపి నెల్లూరీయుల మనసుల్లో ఆనందోత్సాహాలను నింపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారిలో తెలుగుభాష పట్ల, మన ఆచారాలు సంప్రదాయాల పట్ల, కళల పట్ల ఆదరాభిమానాలు మరింత పెంపొందించే విధంగా ప్రపంచ తెలుగు సమాఖ్య విశేష కృషిచేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. అలాంటి అత్యున్నతమైన సమాఖ్యకు అండదండగా ఉంటూ తెలుగు భాషకు, తెలుగు సారస్వత రంగానికి విపిఆర్ మరింత కృషి చేస్తుండడం తెలుగువారి అదృష్టమనే చెప్పాలి. ప్రపంచ తెలుగు సమాఖ్య ఉపాధ్యక్షులుగా ఉంటూ 2023లో శోభకృత్ నామ సంవత్సర ఉగాది ముందస్తు వేడుకలను వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దిగ్విజయంగా నిర్వహించారు. కనుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షురాలు ఇందిరాదత్ అధ్యక్షత్వంలో, విపిఆర్ పర్యవేక్షణలో ఈ వేడుకలు ఆద్యంతం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా 'తెలుగుభాషా వైభవం' పేరుతో ప్రదర్శించిన సాహితీ రూపకం, చిన్నారుల శాస్త్రీయ నృత్యాలు సింహపురీయులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

**ఏప్రిల్ 19.. విపిఆర్ పుట్టినరోజు సందర్భంగా..**

---



## జానకిరామ.. రామాయణం 9

**- ఊటుకూరు జానకి రామారావు**

**మా** తదుపరి కర్తవ్యమేమిటి బ్రహ్మర్షీ? అని వినయంగా తన చెంత దోసిలి ఒగ్గి నిలుచున్న రామ లక్ష్మణులను కడు మురిపెంగా చూస్తున్నారు మహర్షి!

ఇంతలో కొందరు ఆశ్రమవాసులు అక్కడికి వచ్చి జనకుడు యాగం చేస్తున్నాడట! మనకు ఆహ్వానం వచ్చింది అని చెప్పారు.

రామ, లక్ష్మణులారా మీరు కూడా మాతో మిధిలకు వచ్చినచో అక్కడ మీరు ఒక ధనుస్సును చూడవచ్చు అని అన్నారు.

ఆ ధనుస్సును మిధిలాధిపతి అయిన దేవరాతుడు తన యజ్ఞ ఫలంగా దేవతల వద్దనుండి పొందాడు. అది చాలా గొప్ప ధనుస్సు, దాని మధ్యభాగం చాలా దృఢమైనది! అది మిధిలేశుల రాజ మందిరంలో ప్రస్తుతం పూజలందుకుంటోంది! అని మహర్షి పలికి, తాను ప్రయాణమయ్యాడు!.

సోదరులిరువురూ, తాపసులు, వారి శకటములు అన్నీ విశ్వామిత్ర మహర్షిని అనుసరించి వెళుతున్నాయి. సాయంకాలమయ్యే వరకు ఆ విధంగా ప్రయాణం చేసి అత్యంతమనోహరమైన ఒక నది ఒడ్డుకు చేరారు.

ఆ ప్రాంత సౌందర్యాన్ని చూసి రామచంద్రుడు మునిచంద్రుని ప్రశ్నించాడు, స్వామీ ఈ ప్రదేశం కడు రమణీయంగా ఉన్నది కారణమేమి?

ఈ నది పేరు శోణనది, ఇది మగధ దేశంలో పుట్టినది!

పూర్వము బ్రహ్మదేవునకు కుశుడు అనే ఒక కుమారుడుండేవాడు. ఆ కుశునకు నలుగురు పుత్రులు. వారిలో కుశాంబుడు కౌశాంబీ నగరమును, కుశనాభుడు మహోదయపురమును, అధూర్తరజసుడు ధర్మారణ్యము అనే పట్టణాన్ని, వసురాజు గిరివ్రజ పురాన్ని నిర్మించుకొని ధర్మం తప్పకుండా పరిపాలిస్తున్నారు.

వారిలోని వసురాజుకు చెందిన భూమి ఇది! ఈ శోణనదీ తీరం ఆయన ఏలుబడిలోనిదే!

వారిలో కుశనాభుడు ఘృతాచి అనే అప్సరస్త్రీని వివాహంచేసుకొని నూరుగురు అందమైన కన్యలకు తండ్రి అయినాడు.

ఆ కన్నియలు నూరుగురూ అపురూపసౌందర్య రాశులు, దర్పన మాత్రం చేత మోహావివశులను గావింపగలరు.

వారు ఒకరోజు ఉద్యానవనంలో విహరిస్తుంటే వారిని చూసి మోహించిన వాయుదేవుడు తన కోరికను వెల్లడించి పెళ్ళి చేసుకుంటాను మిమ్ములను అని కోరిక వ్యక్త పరుస్తాడు!

అందుకు వారు, తండ్రి అనుమతి లేని కారణం చేత తిరస్కరించారు. అప్పుడు వాయుదేవుడు కోపంతో వారిని కురూపిణులుగా మారుస్తాడు.

వారికి తిరిగి శాపమివ్వగల శక్తి ఉండి కూడా వాయువును ఏమీ చేయక తండ్రి వద్దకు వెళ్ళి తమకు పట్టిన దుస్థితి వివరించి కంట నీరు పెట్టుకుంటారు.

అప్పుడు తండ్రి అయిన కుశనాభుడు వారికి యవ్వనం అశాశ్వతము, విలువలు శాశ్వతం అని బోధించి ఊరడిస్తాడు!.

పై సందర్భంలో ఒక చక్కని శ్లోకాన్ని అద్భుతంగా తెనిగించారు భాస్కర రామాయణ కర్తలు.

**క్షమయ జనులకాభరణము**
**క్షమయ కీర్తి**
**క్షమయ ధర్మంబు**
**క్షమయ సజ్జనగుణంబు**
**క్షమయ యజ్ఞంబు**
**క్షమయ మోక్షంబు**
**క్షమయ సకల దానంబు**
**క్షమయందే జగము నిలుచు.**

ఇవే పదాలతో రంగనాధరామాయణ కర్త కూడా ఇంతే అందంగా వ్రాశాడు.

ఓర్పు అనేది ఎంత ముఖ్యమో ఆరోజుననే చెప్పారు మనకు.

PATIENCE అని అంటున్నాము దానినే ఈరోజు మనం.

ఒక్కసారిగా తన కూతుళ్ళందరకూ వికృత రూపం ప్రాప్తించినా కుశనాభుడు ఆందోళన చెందక వారి వివాహం గూర్చి మంత్రులతో ఆలోచన చేశాడు.

గొప్ప తపఃసంపన్నుడైన చూళికి సోమద అనే గంధర్వస్త్రీయందు జన్మించిన బ్రహ్మదత్తుడు తగిన వరుడు అని నిశ్చయించి ఆతనికిచ్చి పాణిగ్రహణం జరిపించాడు!

ఆతని కరస్పర్శ అందరు యువతుల వికృతరూపాన్ని పోగొట్టి తిరిగి నవయవ్వనసౌందర్యాన్ని ప్రసాదించింది!..



(పాణి గ్రహణం అంటే చేతిని స్పృశించటం! స్పర్శ కలుగజేసే స్పందనలు అనేకం! స్త్రీ, పురుష విచక్షణ లేకుండా ఎంత మందితో పాణిగ్రహణం చేస్తున్నాం మనం! మనం గొప్పగా చెప్పుకొనే సంస్కృతి ఉన్నట్లా గంగలో కలిసినట్లా?).

కన్యాదానం చేసిన పిమ్మట కుశనాభుడు పుత్రకామేష్టి యాగం చేశాడు, అప్పుడు కుశుడు, కుశనాభుతునితో పుత్రా నీకు తగినవాడు, ధార్మికుడు అయిన పుత్రుడు జన్మిస్తాడు అని వరమిచ్చి అంతర్ధానమవుతాడు.

అంత కుశనాభునకు గాధి అనే పేరుగల కుమారుడు జన్మించాడు!

ఆ గాధియే మా నాయన గారు అని పలికి, రామా! ఇప్పటికే అర్ధరాత్రి అయింది, చెట్లు అన్నీ కూడ నిశ్చలంగా ఉన్నాయి, పక్షుల కదలిక ఏమాత్రమూ లేదు, మింట చుక్కలు మెరుస్తున్నాయి! చంద్రుడు పూర్తిగా ఆకాశంలోకి వచ్చి చల్లని కాంతితో ప్రాణులను ఆనందింప చేస్తున్నాడు, రామా ఇక నిదురపోవయ్యా! అని పలికి మహర్షి తాను కూడా విశ్రమించాడు!

తెలతెలవారింది సంధ్యావందనాది కార్యక్రమాలు పూర్తి చేసుకొని మరల నడక సాగించారు!

అలా నడచి, నడచి గంగా తీరాన్ని చేరారు అందరూ!

ఆ గంగా నది శాంతగంభీరంగా ప్రవహిస్తుంది.

పుణ్యజలాలతో, హంస, సారస పక్షులతో మనస్సుకు ఆహ్లాదాన్ని జనింపచేసే ఆ నదిని చూసి రాముడు ఆశ్చర్యంతో మునిని ప్రశ్నించాడు! గంగ మూడులోకాలను ఎట్లా ఆక్రమించింది? సముద్రంలో ఎలా ప్రవేశించింది తెలుసుకొనగోరుతున్నాను స్వామీ అని అడిగాడు!

..(సశేషం)

## పల్లెల దాహార్తి తీరుస్తున్న..

విపిఆర్ అమృత ధార

# అపర భగీరథుడు

- గొంతెండుతున్న జనులకు జలధార.. విపిఆర్ అమృతధార
- గ్రామాల్లో ఎక్కడ కోరుకుంటే అక్కడ పరిశుభ్ర జలం
- వేమిరెడ్డి దంపతుల సేవానిరతికి ఇదో నిదర్శనం
- విపిఆర్ ఫౌండేషన్ ద్వారా 150 వాటర్‌ప్లాంట్‌లు



**మంచినీళ్ళ కోసం ఇంట్లో కుళాయి వేసుకోవాలన్నా ఇప్పట్లో ఎంతో వ్యయప్రయాసలు పడాల్సిందే. అంత కష్టపడి వేసుకున్నా దాంట్లో మంచినీళ్లే వస్తాయో జవ్వలు లేదా ఉప్పునీళ్ళు వస్తాయో తెలియదు. అందులోనూ మెట్ట ప్రాంతాల్లో మంచినీటి వసతులు ఎంతో తక్కువ. అనేక గ్రామాల్లో మంచినీళ్ళు అందుబాటులో లేక నిత్యం గృహిణులు ఎక్కడెక్కడో ఉన్న రైతుల పొలాల్లోని మోటార్ల వద్ద, బోరుబావుల వద్దకు వెళ్ళి నీళ్ళు మోసుకుని తెచ్చుకోవాల్సి వస్తోంది. నిద్ర లేచింది మొదలు ఇదొక వేదనగా తయారైంది. మరోవైపు, ఫ్లోరైడ్ ప్రభావంతో మంచినీళ్ళు కూడా కలుషితమై, అవి తాగిన వాళ్ళకు ఎన్నో జబ్బులు వస్తున్నాయి. మంచినీళ్ళు పుష్కలంగా అందుబాటులో ఉన్నవారికి ఈ బాధలు తెలియవు కానీ, అవసరానికి మంచినీళ్ళు లేకుంటే, తాగేందుకు, అన్నం వండుకోవడానికి..ఇతరత్రా అవసరాలకు ఎంత కష్టమో అనుభవించేవారికే తెలుస్తుంది. ఆ పేదల బాధలను - కష్టాలను కళ్ళారాచూసి చలించిపోయిన మహాదాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) ప్రజల దాహం తీర్చేందుకు నడుంబిగించారు. తన సొంత నిధులతో గ్రామాల్లో పరిశుభ్రమైన నీరందించేందుకు మినరల్ వాటర్‌ప్లాంట్‌ల ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. తాగేందుకు గుక్కెడు నీళ్ళు దొరక్క, దాహార్తితో అలమటిస్తున్న ప్రజలకు మంచినీళ్ళు అందించడం కంటే పుణ్యకార్యం ఏముంటుంది?.. అందులోనూ ప్రజలు బాధపడుతుంటే చూస్తూ మౌనంగా ఉండలేని తత్వం..మానవీయమైన మనస్తత్వం ఆయనది. అందుకే ఆయన అపర భగీరథులయ్యారు. కోట్లాది రూపాయలు వ్యయమైతేనేం.. దాహమైన వారికి నీళ్ళివ్వాలంటూ జలయజ్ఞానికి శ్రీకారం చుట్టారు. ఎన్నో గ్రామాల్లో ప్రజలకు ఆయనే 'గంగ'గా మారి దాహార్తి తీరుస్తున్నారు. ఆ నీళ్ళందుకున్న ప్రజలు ఆ మానవతామూర్తి పదికాలాల పాటు చల్లగా ఉండాలంటూ ఆశీర్వదిస్తున్నారు.**

మనిషికి నీరే ప్రాణాధారం. ఆ నీరే లేకుంటే మనుగడ ఎంతో కష్టం. అనేక పల్లెల్లో నేటికీ మంచినీళ్ళు అందుబాటులో ఉండడం లేదు. ఎండాకాలం మండే ఎండల్లో నీళ్ళు లేకపోతే పరిస్థితి ఎంత దుర్భరంగా ఉంటుందో అందరికీ తెలిసిందే. అందుకే, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల దాహం తీర్చేందుకు కంకణబద్ధులైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి-ప్రశాంతిరెడ్డి దంపతులు 'విపిఆర్ వికాస్' పేరుతో ఎంతో మానవీయమైన సామాజిక సేవకు సంకల్పించి, తొలిసారిగా ఉదయగిరి మండలంలో 2017 ఏప్రిల్ 19న 8 మండలాలలోని 8 గ్రామాల్లో 'విపిఆర్ అమృతధార' పేరుతో శుద్ధిచేసిన పరిశుభ్రమైన (మినరల్ వాటర్ ప్లాంట్‌లను)నీటిని అందుబాటులోకి తెచ్చారు. స్వయంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బిందెలతో మహిళలకు నీటిని అందించి వారి దీవెనలందుకున్నారు. కనీసం 100 ప్లాంట్‌లను ఏర్పాటుచేయాలని లక్ష్యంగా నిర్ణయించుకుని ఈ సేవాపథకాన్ని ప్రారంభించినా, వేమిరెడ్డి దంపతులు సంకల్పబలంతో ఆ ప్లాంట్‌లు ఇప్పటికే ఉమ్మడి నెల్లూరుజిల్లా వ్యాప్తంగా 130కి పైగానే ఏర్పాటుచేశారంటే వారికి ఈ సేవ పట్ల ఉన్న అంకిత భావానికి నిదర్శనం. ఈ కార్యక్రమం కోసం వారు పెద్ద యంత్రాంగాన్నే సిద్ధం చేశారు. ప్లాంట్‌లు ఏర్పాటుచేసి సరిపెట్టుకోకుండా, అవి పదికాలాల పాటు ప్రజలకు చల్లని నీరందించాలని వాటి పర్యవేక్షణకు సిబ్బందిని కూడా నియమించారు. ఎక్కడైనా అవి మరమ్మతులకు గురైన సమాచారం తెలిస్తే, వెంటనే వాటిని బాగుచేసేలా ఏర్పాట్లు చేశారు. వీటన్నిటికీ భారీమొత్తంలో అయ్యే ఖర్చునంతా 'విపిఆర్ ఫౌండేషన్' భరాయిస్తుంది.



### జిల్లా వ్యాప్తంగా దాదాపు 150 వాటర్ ప్లాంట్లు

నీళ్ళు లేవని కన్నీళ్లు పెట్టుకోవద్దని, జిల్లా ప్రజల దాహార్తి తీర్చేందుకు తామున్నామంటూ విపిఆర్ దంపతులు ముందుకు వస్తున్నారు. ఎంత డబ్బు ఖర్చయినా సరే, గ్రామస్తులు ఎక్కడ కోరుకుంటే అక్కడ ఈ ప్లాంట్‌లను ఏర్పాటుచేస్తున్నారు. జిల్లాలో ఇప్పటిదాకా 150 వరకు వాటర్ ప్లాంట్‌లను నెలకొల్పారు. నీటికోసం కోటి పాట్లు పడుతున్న ఉదయగిరి నియోజకవర్గంలో 28 ప్లాంట్‌లు ఏర్పాటుచేశారు. ఆత్మకూరు నియోజకవర్గంలో 18, కోవూరు-కావలి నియోజకవర్గాల్లో 17 వంతున 34 ప్లాంట్‌లు, నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని 41వ డివిజన్ ఇరుకళలమ్మ సంగంలో 1 నిర్మించారు. నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి అనునిత్యం వచ్చే రోగుల కోసం కూడా మినరల్ ప్లాంట్‌లు ఏర్పాటుచేశారు. ఇన్‌పేషెంట్లు, ఔట్‌పేషెంట్ల విభాగాల్లోను, డయాలసిస్ వార్డులోనూ రోగులకు మంచినీటి కొరత లేకుండా మొత్తం 3 ప్లాంట్‌లను నెలకొల్పారు. నెల్లూరు నగర నియోజకవర్గం పరిధిలో ఉన్న వెంకటేశ్వరపురం ఐటిఐ కళాశాల, నవాబుపేటలోని పత్తివారి స్కూల్, 9వ వార్డు కుసుమహరిజనవాడలో.. మొత్తం 3 ప్లాంట్‌లు నెలకొల్పారు. సూళ్ళూరుపేటలో 9, వెంకటగిరి నియోజకవర్గంలో 7, సర్వేపల్లి నియోజకవర్గంలో 7, కందుకూరు నియోజకవర్గంలోని లింగంగుంట మండలంలోని మొగిలిచర్ల గ్రామంలో 1 వంతున, రాపూరు మండలం సైదాదుపల్లెలో, బాలాయపల్లి మండలంలోని కోటంబేడులో, పెళ్ళకూరు మండలంలోని సిరసనంబేడులో, కోట మండంలోని ఊనుగుంటపాళెంలో, వెంకటాచలం మండలంలోని శ్రీరామాపురంలో, సూళ్ళూరుపేట మండలంలోని కోటపోలూరులో.. ఇలా అనేకచోట్ల విపిఆర్ అమృతధార ప్రజలకు జలధారలను కురిపిస్తూనే ఉంది.



### ప్రజల దాహార్తి తీర్చడంలో ఎంతో సంతృప్తి

**- విపిఆర్**

విపిఆర్ అమృతధార కార్యక్రమంలో కనీసం 100 వాటర్‌ప్లాంట్‌లు నిర్మించాలనే లక్ష్యాన్ని కార్యసాధకులైన విపిఆర్ దంపతులు సాధించారు. 2019 నవంబరు 16వ తేదీన కావలి మండలంలోని బుడమగుంట గ్రామప్రజలకు స్వచ్ఛమైన నీరందిస్తూ 100వ ప్లాంట్‌ను అక్కడ ప్రారంభించారు. ప్లాంట్ ప్రారంభోత్సవంలో విపిఆర్ తన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో కలసి గ్రామమహిళలకు బిందెలతో పరిశుభ్రమైన నీళ్ళందించారు. తాము ఎన్నో సేవా కార్యక్రమాలను చేస్తున్నప్పటికీ, తాగేందుకు కూడా గుక్కెడు మంచి నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు 'విపిఆర్ అమృతధార' కార్యక్రమం ద్వారా పరిశుభ్ర జలాలందించడం వాటన్నిటికంటే తనకెంతో సంతృప్తిని కలిగిస్తోందని, నిజం చెప్పాలంటే ఈ సేవను తానొక అదృష్టంగా భావిస్తున్నానని 'విపిఆర్ ఫౌండేషన్' అధినేత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. జిల్లాలోని కొన్ని గ్రామాల్లో ఫ్లోరైడ్, టీడీఎస్ వంటి సమస్యలతో ప్రజలు ఎన్నో ఇక్కట్లు పడుతున్నారని, ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు తమవంతు సేవలందిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, ప్రజలకు ఇలా సేవలు చేయగలగడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.







**● శతమానం భవతి**



## స్పందించే తత్వం.. ఆదుకునే దాతృత్వం..

# విపిఆర్ దంపతుల సొంతం

### అనాధబిడ్డలకు వారు అమ్మా-నాన్నలు.. ఎవరూలేని వృద్ధులకు వారే కొడుకు-కూతుళ్ళు



**జిల్లా ప్రజలు సమస్యలతో బాధపడుతుంటే స్పందించే మన స్తత్వం, అసహాయులను ఆదుకునే తత్వం.. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్), ప్రశాంతిరెడ్డి దంపతుల సొంతం. జిల్లా కరోనా రాకాసి కోరల్లో చిక్కివున్నప్పుడు వారు కోట్లాది రూపాయలు వెచ్చించి బాధితులకు ప్రాణవాయువులందించారు. జిల్లా కరువు కాటకాల్లో ఉంటే లక్షలాది రూపాయలను విరాళాలుగా ఇచ్చారు. అభాగ్యులు, అనాధలు, అసహాయులు, దివ్యాంగులను ఆదుకునేందుకు తామున్నామంటూ ముందుకువచ్చారు. అనాధలకు వారే అమ్మానాన్నలుగా, ఎవరూ తోడులేని వృద్ధులకు తామే బిడ్డలుగా వారు ఆ అసహాయులను ఆదుకుంటున్నారు. ఆధ్యాత్మిక సామాజిక సేవారంగాల్లోనూ, విద్య-వైద్యం, కళలు-క్రీడలు తదితర ఎన్నోరంగాల్లో వారు తమ దాతృత్వం చాటుకుంటూ సమాజసేవలో తరిస్తున్నారు. అపర దానకర్ణులుగా జిల్లాలో ప్రకాశిస్తున్న సేవాసూర్యుళ్ళు వాళ్ళు. జిల్లా ప్రజలకు వారు చేసిన, చేస్తున్న సేవలు లెక్కలేనన్ని. వారి సామాజిక సేవల్లో ఇవి మరికొన్ని!..**

★ నెల్లూరుజిల్లాను 2021లో వరదలు ముంచెత్తినప్పుడు వరద బాధితుల సహాయార్థం విపిఆర్ 50 లక్షల రూపాయల భారీ విరాళాన్ని అందజేశారు.

★ 2022లో కరోనా బాధితులను ఆదుకునేందుకు కోటీ 30 లక్షల రూపాయల విలువజేసే ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను విపిఆర్ దంపతులు తమ వితరణగా అందజేశారు.

★ నెల్లూరులోని వాత్సల్య అనాధశరణాలయానికి వారే అమ్మానాన్నలుగా మారి, అక్కడున్న అనాధబిడ్డలెందరికో అన్నం పెడుతున్నారు. ఆ సంస్థకు ఏటా లక్షలాది రూపాయలు విరాళాలివ్వడంతో పాటు, ప్రతి ఏటా ఒక నెలకు వారికయ్యే భోజనఖర్చు సుమారు 3 లక్షలరూపాయలను వారే అందజేస్తున్నారు. వాత్సల్య భవన నిర్మాణాలకు 10 లక్షల రూపాయలు విరాళమిచ్చారు.

★ నెల్లూరులోని ప్రగతి చారిటీస్‌లో ఉన్న సుమారు 250 మంది మానసిక వికలాంగులకు ఏటా లక్షలాది రూపాయలు విరాళాలివ్వడంతో పాటు, వారికి కూడా ఓ నెలకయ్యే భోజనఖర్చులన్నీ విపిఆర్ దంపతులే గత కొన్నేళ్ళుగా నిరంతరాయంగా అందిస్తూనే ఉన్నారు.

★ నెల్లూరు మైపాడురోడ్డులో అన్నదాత గ్రోసు గోపాలయ్య నిర్మించిన శ్రీ మాతా అన్నపూర్ణేశ్వరి వృద్ధాలయానికి రూ. 5లక్షలు విరాళమివ్వడమేకాక, ఏడాదిలో ఒక నెల వృద్ధుల భోజన ఖర్చులన్నీ కూడా వారే భరిస్తున్నారు.

★ నెల్లూరు రామమూర్తినగర్‌లో సత్యసాయిమందిరం వరకు తన తండ్రి వేమిరెడ్డి శివకోటారెడ్డి పేరుతో 2 లక్షలు వెచ్చించి రోడ్డు వేయించి తండ్రి పేరుకు సార్ధకత తెచ్చారు. మాతృమూర్తి స్వర్గీయ శ్యామలమ్మ పేరుతో ఏటా ఆమె వర్ధంతినాడు అనేక ఆశ్రమాల్లో అన్నదానాలు, వస్త్రదానాలు, ఆసుపత్రుల్లోని బాధితుల కోసం రక్తదాన శిబిరాలు కూడా నిర్వహిస్తున్నారు.

★ నెల్లూరు ఇస్కాన్ మందిరంలో ఆధ్మాత్మిక వేడుకలు, జగన్నాథ రథయాత్రలకు లక్షలాదిరూపాయలు విరాళమివ్వడమే కాక, వారు పాఠశాలలకు-ఆసుపత్రులకు భోజనం తయారుచేసి తీసుకువెళ్లేందుకు ఒక వాహనాన్ని కూడా సమకూర్చారు.

★ ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 2012లో గుంటూరులో జరిగిన హిందూ చైతన్యశిబిరానికి విపిఆర్ ఉపాధ్యక్షునిగా ఉండడమే కాక, రూ. 10 లక్షలు విరాళంగా ఇచ్చి ఆ సంస్థ కార్యక్రమాలకు లోటులేకుండా చేశారు.

★ గాంధీజీ నడయాడిన పల్లిపాడు గ్రామాన్ని దత్తతగా తీసుకుని, అక్కడున్న శ్రీ పినాకిని గాంధీ ఆశ్రమాన్ని, పల్లిపాడు గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషిచేస్తున్నారు.

★ 2023లో, కావలి నియోజకవర్గం దగదర్తికి చెందిన రక్షిత అనే విద్యార్థినికి లివర్ చెడిపోయి అనారోగ్యం పాలైతే ఆ విద్యార్థినిని కాపాడేందుకు లివర్ ఆపరేషన్ కోసం విపిఆర్ చొరవ తీసుకుని సిఎం సహాయనిధి నుంచి 17.50 లక్షల రూపాయలు మంజూరు చేయించారు.

★ పుట్టిన ప్రతి ఒక్కరికీ చివరి మజిలీ శ్మశానమే కనుక అవి ప్రశాంతతకు నిలయంగా ఉండాలని సేవాభూషణులు విపిఆర్ వాటి బాగుకు కూడా కృషిచేశారు. నెల్లూరు పెన్నానదీ తీరంలోని హిందూ శ్మశాన వాటికకు తనవంతు చేయూతగా 10 లక్షల రూపాయలు అందజేశారు. 2023 జులైలో బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రేబాల గ్రామంలో ఉన్న స్మశానం అభివృద్ధికి కూడా విపిఆర్ దంపతులు 5 లక్షల రూపాయలు వితరణగా అందజేశారు. ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ విపిఆర్ దంపతులు తమ జీవితాలను ధన్యం చేసుకుంటున్నారు.

**ఏప్రిల్ 19.. విపిఆర్ పుట్టినరోజు సందర్భంగా..**

# నాయకులు రె'ఢీ'

(మొదటి పేజీ తరువాయి)


ప్రజలు తామనుకుంటున్నంత అమాయకులు కాదని, తమని మోసం చేయడానికి వచ్చే నాయకులకు ఎలా గుణపాఠం చెప్పాలో వాళ్ళకే బాగా తెలుసన్న విషయం పాపం ఆ నాయకులకి తెలియదు.

## మరో అవకాశం ఇవ్వమంటున్న వైసీపీ!




ఒక్క అవకాశం అంటూ 2019లో అధికారంలోకి వచ్చింది ప్రస్తుత అధికార పార్టీ వైసీపీ. విశ్వసనీయత, అవినీతి రహిత పాలన, పేదరిక నిర్మూలన, యువతకి ఉద్యోగ కల్పన, ప్రభుత్వ విభాగాలలో ప్రక్షాళన, వంటి హామీలతో పాటు మ్యానిఫెస్టో పొందుపరచిన నవరత్నాలను ప్రధానంగా ప్రచారం చేసుకుని అధికారపగ్గాలు చేపట్టారు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి. అధికారంలోకి వచ్చిన తరువాత తాను ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకున్నారా? అన్న విషయం పక్కనపెడితే, తమ మ్యానిఫెస్టోలో పొందుపరచిన నవరత్న పథకాలని మాత్రం 90 శాతానికి పైగా పూర్తిచేశారు. ఈ అయిదేళ్ల కాలంలో 130సార్లు బటన్ నొక్కడం ద్వారా 2లక్షలా 70వేల కోట్లు ప్రభుత్వ సొమ్ము ప్రజలకి పంచేశారు. నావల్ల మీకు మంచి మేలు జరిగి ఉంటేనే నాకు ఓటేయండి, నేను మీకు సహాయం చేశానని భావిస్తేనే నన్ను గెలిపించండి, నాపై మీకు నమ్మకం కలిగితేనే మరో అవకాశం ఇవ్వండి... అంటూ ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలని అభ్యర్థిస్తున్నారు. వైసీపీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులు సైతం తమ గొప్పతనాన్ని, తమ నియోజకవర్గాలలో తాము చేసిన అభివృద్ధిని చూపించి తమకి ఓటేయమని అడగడం లేదు. మా నాయకుడు మీకిచ్చిన డబ్బులు మీకు చేరి ఉంటేనే మాకు ఓటేయండి అంటున్నారు. మీకు మరో ఐదేళ్లు గత అయిదేళ్ళలాగా మళ్ళీ డబ్బులు కావాలంటేనే తమకు ఇంకో అవకాశం ఇవ్వండి అని ప్రాధేయపడుతున్నారు. మొత్తంమీద తమ అధినాయకుడితో సహా ఆ పార్టీ శ్రేణులంతా మరో అవకాశం కోసం తహతహలాడుతున్నారు!

## ఇదే చివరి అవకాశం అంటున్న టీడీపీ!



తమకి ఇదే చివరి అవకాశమని, ఇప్పుడు అధికారంలోకి రాకపోతే మళ్ళీ ఎప్పటికీ రాలేమని బాహాటంగానే చెప్పి ఓట్లు అడుగుతోంది తెలుగు దేశం పార్టీ. ఈసారి తనని గెలిపిస్తేనే తనకీ, తనతో పాటు ఈ రాష్ట్రానికీ భవిష్యత్తు అని ఆ పార్టీ అధినేత చంద్రబాబు చర్విత చరణంగా చెప్తూ ముందుకుపోతున్నారు. వైసీపీ వైఫల్యాలను ఎత్తి చూపడం తప్ప తమ ఘనతని, ప్రతిభని, తాము అధికారంలో ఉన్నప్పుడు సాధించిన ప్రగతిని ఆ పార్టీ పెద్దలు చెప్పుకోలేకపోతున్నారు. తమకి మళ్ళీ అధికారం అప్పచెప్తే రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధి చేసి చూపిస్తారన్న స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. ప్రస్తుత అధికారపార్టీలో జరుగుతున్న అవతవకలు, అక్రమాలు రేపు తాము వస్తే ఉండవన్న హామీ కల్పించలేకపోతున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని ఎలా బయటకి లాగుతారో వివరించలేకపోతున్నారు. ఇదే తమకి చివరి అవకాశమన్న అంశాన్ని మాత్రం సుస్పష్టంగా ప్రజలలోకి తీసుకెళ్తున్నారు!

## కూటమిని గెలిపించమంటున్న జేఎస్‌పీ!



గత ఎన్నికలలో చావుదెబ్బ తిన్న జనసేన ఈసారి ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మొండితనం వీడి, పట్టు-విడుపు అన్న ఫార్ములాతో అటు బీజేపీ ఇటు టీడీపీలతో దోస్తీ కొనసాగిస్తున్నారు. బీజేపీని టీడీపీతో కలపడమే తన తొలివిజయంగా జనసేనాని భావిస్తున్నారు. తన లక్ష్యం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించడమే తప్ప, తమ పార్టీని అధికారపీఠంపై కూర్చోబెట్టడం కాదని పలు సందర్భాల్లో పవన్ క్లారిటీ ఇచ్చేశారు. కూటమికి ఓటమి లేకుండా చేయడానికి ఆయన తపనతో శ్రమిస్తున్నారు. 'బీజేపీ – టీడీపీ – జనసేన అభ్యర్థులను గెలిపించండి, జగన్‌మోహన్‌రెడ్డిని ఇంటికి పంపించండి'... అనే నినాదంతో ప్రజాక్షేత్రంలో ప్రచారం చేసుకుంటూ పవన్ కళ్యాణ్ వారాహి యాత్రలు సాగిస్తున్నారు!

## ఎవరు గెలిచినా ఓకే అంటున్న బీజేపీ!



పైకి టీడీపీ – జనసేనలతో దోస్తీ చేస్తున్నట్లు ప్రకటించినా, బీజేపీ పెద్దలు మాత్రం అంతర్గతంగా వారి వ్యూహం వారు రచించుకుంటున్నారు. పాత కేసులతో చాన్నాళ్ల క్రితం జైలుకి వెళ్లొచ్చిన జగన్‌మోహన్‌రెడ్డయినా, తాజాగా కేసులలో ఇరుక్కుని రాజమండ్రి సెంట్రల్ జైల్లో కొంతకాలం గడిపొచ్చిన చంద్రబాబైనా కమల దళానికి ఒక్కటే. తాము కేంద్రంలో అధికారంలోకి రావడానికి ఆ పార్టీ నేతలు ఆంధ్రపై ఆధారపడడం లేదు. ఆంధ్రాలో ఎవరు గెలిచినా వారికి పెద్ద నష్టం లేదు. టీడీపీ అయితే నేరుగా ప్రభుత్వంలో భాగస్వామ్యమై ఉంటుంది, వైసీపీ అయితే దొడ్డిదారిన మద్దత్తు ఇస్తుందన్నది జగమెరిగిన సత్యం. ఇద్దరూ జైలుకి వెళ్లి బెయిలుపై బయట ఉన్నవారే. ఇద్దరి పీకా వారి చేతుల్లోనే ఉంటుంది కాబట్టి, ఎవరూ తోకాడించలేరు. అలాంటి పరిస్థితులలో ఆంధ్రాలో ఎవరు గెలిచినా బీజేపీకి ఓకే!

సెల్‌ఫోన్లలోని అంతర్జాలం ద్వారా మారుమూల పల్లె ప్రాంతాలలో నివసించే ప్రజలు సైతం ప్రపంచాన్ని అరచేతిలో పెట్టుకుని గమనిస్తున్నారు. ఎవరిని గద్దె దించాలి, ఎవరిని గట్టెంకించాలన్న విషయం వాళ్లెప్పుడో నిర్ణయించేసుకుని ఉంటారు. అయిదేళ్ల తరువాత వాళ్లకి వచ్చిన అవకాశాన్ని అన్ని విధాలుగా ఎలా వాడుకోవాలో వాళ్లకి బాగా తెలుసు!



### భాజపాలోకి దువ్వూరు

**భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురంధరేశ్వరి సమక్షంలో ఈ నెల 18వ తేదీ గురువారం రాజమండ్రిలోని పార్టీ కార్యాలయంలో బీజేపీలో చేరిన ముత్తుకూరు మండలం, మల్లూరు గ్రామ పంచాయితీ సర్పంచ్ దువ్వూరు విజయకుమార్‌రెడ్డి.**





# ప్రసన్నను గెలిపిస్తే.. కోవూరుకు మరింత అభివృద్ధి

## నల్లపరెడ్డి కుటుంబసభ్యుల ప్రచారం

కోవూరు ఎమ్మెల్యేగా నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించిన ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి మద్దతుగా ఈ ఎన్నికల్లో వారి కుటుంబసభ్యులు నియోజకవర్గంలో పెద్దఎత్తున ప్రచారాలు చేస్తూ, ప్రసన్నను మళ్ళీ రానున్న ఎన్నికల్లో గెలిపిస్తే కోవూరు నియోజకవర్గానికి మరింత పురోగతి ఉంటుందని ప్రజలకు చెప్తున్నారు. వైకాపా నాయకునిగా, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి సన్నిహితంగా ఉంటూ, కోవూరు అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు సాధించుకువచ్చిన ఘనత ఒక్క ప్రసన్నకే దక్కుతుందని వారు వివరిస్తున్నారు. ప్రసన్న తరపున ఆయన శ్రీమతి గీతారెడ్డి, కుమారుడు నల్లపరెడ్డి రజిత్‌రెడ్డి, కోడలు పూజారెడ్డి, ప్రసన్న సోదరుడు నల్లపరెడ్డి రాజేంద్రకుమార్‌రెడ్డి తదితరులంతా తమ కుటుంబసభ్యులతో కలసి నియోజకవర్గంలో ప్రసన్నకు మద్దతుగా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇటీవల కొడవలూరు మండలం గండవరం పంచాయతీలో వైసీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు అభిమానులతో కలిసి గడప గడపకి వెళ్లి ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వంలో, ఎమ్మెల్యే ప్రసన్న ఆధ్వర్యంలో కోవూరు నియోజకవర్గంలో చేపట్టిన సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను, వైకాపా మ్యానిఫెస్టోను వివరించి, వైకాపాను ఈ ఎన్నికల్లో ఆదరించి గెలిపించాలని కోరుతున్నారు. కోవూరు వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి, ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డికి ఘనవిజయం చేకూర్చాలని వారు ప్రజలను అభ్యర్థిస్తున్నారు. ఇటీవల కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీలో భారీ ర్యాలీ, రోడ్ షో, బహిరంగ సభ నిర్వహించి, ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న వైకాపాకు ఈసారి కూడా ఘనవిజయం సాధించిపెట్టాలని ప్రజలను వారు అభ్యర్థించారు. ఈ సభల శాసనమండలి సభ్యులు బల్లి కళ్యాణ్ చక్రవర్తి, నల్లపరెడ్డి రాజేంద్రకుమార్‌రెడ్డి, కోవూరు యువజన విభాగం అధ్యక్షులు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## రాబోయేది వైకాపాయే - నల్లపరెడ్డి రజత్‌రెడ్డి

ఎవరెన్ని కుట్రలు చేసినా రాబోయేది వైకాపా ప్రభుత్వమేనని కోవూరు నియోజకవర్గం వైకాపా యువజన విభాగం నాయకుడు నల్లపరెడ్డి రజత్ కుమార్‌రెడ్డి చెప్పారు. ఈనెల 15న ఆయన బుచ్చిరెడ్డిపాళెంలో విలేకర్లతో మాట్లాడుతూ, జగన్‌పై ఇటీవల రాళ్ళదాడి జరగడం దారుణమన్నారు. జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక భౌతికదాడులకు పాల్పడడం సిగ్గు చేటన్నారు. టీడీపీ దిగజారుడు రాజకీయాలు చేస్తోందని, ఈ ఎన్నికల తర్వాత ఆ పార్టీ పూర్తిగా కనుమరుగవుతుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైకాపా అభ్యర్థులను పెద్దమెజారిటీతో గెలిపించాలని, కోవూరు నుంచి పోటీ చేస్తున్న తమ తండ్రి ప్రసన్నకుమార్‌రెడ్డికి విజయం చేకూర్చాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# సంక్షేమ సారథి జగనన్నకే ప్రజాదరణ

## - మేకపాటి విక్రమ్‌రెడ్డి



రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం తపించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల ప్రజల ఆదరణ మెండుగా ఉందని, రానున్న ఎన్నికల్లో వైకాపా విజయం తథ్యమని, జగనన్న నిర్వహిస్తున్న బస్సుయాత్రలు ఎంతో దిగ్విజయంగా జరుగుతున్నాయని, గతంలో కంటే ఈసారి తమపార్టీకి మరింత మెజార్టీ వస్తుందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ధీమాగా చెప్పారు. సంక్షేమ సారథి జగన్ మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన అన్నారు. ఈనెల 16న ఆత్మకూరు పట్టణంలోని 15, 16 వార్డుల్లో మాజీ జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డితో కలసి ఆయన ఎన్నికల ప్రచారాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు రోజుల్లోనే వందలాదిమంది వైకాపాలో చేరారని, ప్రజల అభిమానంతో తమ పార్టీ మరింత బలోపేతం అవుతోందని సంతోషం వ్యక్తం చేశారు. ప్రతిపక్షం వారు కొంతమంది ప్రజాప్రతినిధులను ప్రలోభపెట్టి పార్టీలోకి చేర్చుకుంటున్నారని ఆయన ఆరోపిస్తూ, అయినా.. ఆత్మకూరు నియోజకవర్గంలో అలాంటి ప్యాకేజీ రాజకీయాలు చెల్లవని ఆయనన్నారు. ఈ ప్రచారాల్లో భాగంగా విక్రమ్‌రెడ్డి పట్టణంలోని అనేక ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి వైకాపా ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పార్టీ కరపత్రాలను, మేనిఫెస్టోలను ఆయన ఇంటింటికీ పంచారు. ప్రజలకు మేలు చేసే వైకాపా మళ్ళీ అధికారంలోకి వచ్చేలా అందరూ సహకరించి, రానున్న ఎన్నికల్లో వైకాపా అభ్యర్థులకు ఘనవిజయం సాధించిపెట్టాలని ఆయన ప్రజలను కోరారు.

# కాంగ్రెస్ గెలిస్తేనే ప్రజలకు మేలు

## - ఎంపీ అభ్యర్థి కె.రాజు



రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తేనే ప్రజలకు మేలని, మళ్లీ బీజేపీ గెలిస్తే అరాచకమేనని కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు, నెల్లూరు పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కె.రాజు ధ్వజమెత్తారు. ఇటీవల ఆయన నెల్లూరులోని ఇందిరాభవన్‌లో డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డితో కలసి పార్టీ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ సారధ్యంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో మతపరంగా విద్వేషాలను రెచ్చగొడుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అన్నివర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. ఆమేరకు మేనిఫెస్టోను కూడా రూపొందించడం జరిగిందన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు మాట్లాడుతూ, రాష్ట్రంలో వైకాపా, తెదెపాలు రెండూ ప్రజల సంక్షేమాన్ని విస్మరించాయని, ఆ పార్టీలకు ప్రజలు గుణపాఠం చెప్పి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

## టూకీగా...

### పంచేడులో గిరిజనులకు ఓటుహక్కుపై అవగాహన

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పంచేడు గిరిజన కాలనీ వాసులకు ఈనెల 13న ఓటుహక్కుపై అధికారులు అవగాహన కలిగించారు. కోవూరు స్వీప్ నోడల్ ఆఫీసర్ వెంకటరత్నం, సభ్యులు రవిశంకర్‌రెడ్డి, రాజశేఖర్, మల్లీశ్వరరెడ్డి, బిఎల్‌ఓలు పాల్గొని ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. ఓటున్న వారంతా ఓటుహక్కు వినియోగించుకోవాలని చెప్పారు.

### పొదలకూరులో పోలేరమ్మకు పొంగళ్ళు

పొదలకూరు గ్రామదేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారికి మంగళవారం (ఈనెల 16) రోజున పట్టణంలోని నాయీ బ్రాహ్మణుల సేవా సంఘం ఆధ్వర్యంలో పాలపొంగళ్ళను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉగాది తర్వాత వచ్చే తొలి మంగళవారం ఏటా ఆనవాయితీగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పెద్దసంఖ్యలో నాయీబ్రహ్మణులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

### కొత్తసత్రం పేకాటస్థావరంపై పోలీసుల దాడి

కావలి రూరల్ మండలం తుమ్మలపెంట పంచాయతీలోని కొత్తసత్రంలో నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై ఈనెల 15వ తేది రాత్రి పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న ఇద్దరని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 3600 నగదు స్వాధీనం చేసుకుని, పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేశారు.

### ఇందుకూరుపేట సెబ్ స్టేషన్ తనిఖీ

ఇందుకూరుపేటలో ఉన్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) స్టేషన్‌ను ఈనెల 13న జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి పి.దయాసాగర్ తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలిచ్చారు. సెబ్ సీఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

### నందిపాడులో తేనెటీగలు కుట్టి ఇద్దరికి గాయాలు

దుత్తలూరు మండలంలోని నందిపాడులో ఈనెల 14న కె. వెంకటేశ్వర్లు, ఎన్.తరుణ్‌లు తమ పొలాల వద్ద పంప్‌సెట్ ఆన్‌చేయడానికి వెళ్ళగా ఒక్కసారిగా అక్కడున్న తేనెటీగలు దాడిచేయడంతో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని వెంటనే ఉదయగిరి ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు.

### పొదలకూరులో అగ్నిమాపక వారోత్సవాలు

పొదలకూరు అగ్నిమాపక కార్యాలయంలో ఈనెల 14న అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. తహశీల్దారు వీరవసంతకుమార్ పాల్గొని వారోత్సవాల పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. అగ్నిమాపక అధికారి టి.విజయవీరకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

### బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తా

ఈనెల 13న నెల్లూరు నుంచి గూడూరు వైపుకు గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న ఓ మినీ లారీ మనుబోలు మండలం బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద అదుపుతప్పి బారికేడ్లను ఢీకొని బోల్తా కొట్టింది. లారీలోంచి కొన్నిసిలిండర్లు పడిపోయినా గ్యాస్ లీక్ కాకపోవడంతో ప్రమాదం తప్పింది. ట్రాఫిక్ స్తంభించడంతో ఎస్ఐ అజయ్‌కుమార్, పోలీసులు క్రమబద్ధీకరించారు.




## ఎవరినీ నొప్పించని నాయకత్వం, అందరినీ మెప్పించే మనస్తత్వం.. ప్రభాకరరెడ్డి వ్యక్తిత్వం

# ఆదాలని ఆశీర్వదించడానికి రూరల్ ప్రజలు సంసిద్ధం!



ఆదాల ప్రభాకరరెడ్డికి జనం అంటే ఇష్టం. జనంలో ఉండడమంటే ఇష్టం. రాజకీయాల లోకి రాకముందు కూడా తన పేరుతో ఏర్పాటు చేసిన ట్రస్టు ద్వారా ప్రజలకి సేవలు అందించేవారు. తమ గ్రామ చుట్టుపక్కల ప్రాంత రైతులను నిత్యం కలుసుకుంటూ ఉండేవారు. తన స్వగ్రామం నార్త్‌మోపూర్ గ్రామ అవసరాలని కనుక్కొని మరీ తీర్చేవారు. మూడుసార్లు శాసన సభ్యుడిగా, ఒకసారి మంత్రిగా, ఐదేళ్లు పార్లమెంటు సభ్యుడిగా ప్రజా క్షేత్రంలో ఆయన చేసిన సామాజిక సేవాకార్యక్ర మాలకి లెక్కేలేదు. వ్యాపారమైనా, రాజకీయ మైనా, సేవా కార్యక్రమమైనా తాను చేపట్టిన పని క్రమశిక్షణతో, అంకితభావంతో, చిత్తశుద్ధితో చేయడం ఆదాలకి అలవాటు. నాణ్యత విషయంలో రాజీపడరు. ఖర్చుకి వెనకాడరు. తన వల్ల సమాజానికి తద్వారా ప్రజలకి మంచి జరుగుతుందంటే ఆ పని ఎంత కష్టతరమైందైనా, ఎంతటి ఖర్చుతో కూడుకున్నదైనా చేయడానికి ప్రభాకరరెడ్డి ముందుంటారు.











## పార్లమెంటు నుండి అసెంబ్లీకి!

రెండు దశాబ్దాల సుధీర్ఘ రాజకీయ అనుభవంతో పార్లమెంటు సభ్యుడిగా ఢిల్లీ స్థాయికి ఎదిగారు ఆదాల ప్రభాకరరెడ్డి. ఆయనకి ఉన్న పలుకుబడికి, ఢిల్లీ స్థాయిలో వున్న మంచి పేరుకి, దేశ స్థాయిలో వున్న పరిచయాలకి ఆయన కావాలనుకుంటే రాజ్యసభ స్థానం తీసుకోవచ్చు. లేదా మళ్ళీ పార్లమెంటుకే పోటీచేసి గెలవచ్చు. కానీ ఆయన అలా చేయలేదు. నిత్యం ప్రజలతో సంబంధముండే పదవే కావాలనుకున్నారు. ప్రజలతోనే మమేకం కావాలని సంకల్పించారు. ప్రజల మధ్యే ఉండాలని భావించారు. అసెంబ్లీ వేదికగా ప్రజా సంక్షేమం కోసం పాటు పడాలనుకున్నారు. అందుకోసమే మళ్ళీ శాసనసభ అభ్యర్థిగానే పోటీ చేయాలనుకున్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని తన భవిష్యత్ రాజకీయ సేవా కార్యక్రమాలకు ఎంచుకున్నారు.

## వ్యాపార రంగానికి ఊపిరొచ్చింది..!

రూరల్ ప్రాంతంలో భారీ పెట్టుబడులతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలన్నా, అపార్టుమెంట్ల నిర్మాణాలను చేపట్టాలన్నా , సొంతంగా చిన్న వ్యాపార సముదాయం కట్టుకోవాలన్నా, కొత్తగా వ్యాపారం పెట్టుకోవాలన్నా మామూళ్ల బెడదతో హడలి పోతుండినవారికి ఊపిరి వచ్చింది. తాము ఇంక ఎవరికీ మామూళ్లు ఇచ్చుకోవాల్సిన అవసరం లేదన్న ధైర్యం వచ్చింది. ఇప్పుడు రూరల్ ప్రజలు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. తమకి జరిగిన అన్యాయాలకు గుణపాఠం చెప్పడానికి సంసిద్ధులవుతున్నారు. ఓటుపోటుతో తమ సత్తా చాటుకోవడానికి "సిద్ధం" అంటున్నారు!



## ఆదాల అభ్యర్థిత్వానికి జన నీరాజనం... వాడవాడలా ప్రభంజనం!

ఆదాల ప్రభాకరరెడ్డిని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించి పద్నాలుగు నెలలయింది. ఈ పద్నాలుగు నెలల కాలంలో ప్రభాకరరెడ్డి ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలుకుతున్నారు. మనసున్న నాయకుడు వచ్చాడని మురిసిపోతున్నారు. కులాలు మతాలు, వర్గాలు అన్న మాటే లేకుండా జనమంతా ఒక్కటై ప్రజా సమూహమై ఆదాల ప్రభాకరరెడ్డిని బలపరుస్తున్నారు. రౌడీలు, దుర్మార్గులు, దోపిడీదారులైన పాలకుల నుండి తమకి విముక్తి లభించిందని సంతోషపడుతున్నారు. దేవాలయాలకి తీసుకెళ్లి పూజలు చేయిస్తున్నారు. మసీదులు, చర్చిలలో ప్రార్ధనలు చేయించి ఆశీస్సులు అందిస్తున్నారు. ఇంటింటికీ పిలిచి ఆదరిస్తున్నారు. మావాడు – మనవాడు వచ్చాడని ఇరుగుపొరుగుకి చెప్పుకుంటున్నారు. మనకి మంచిరోజులొస్తున్నాయంటూ పొంగిపోతున్నారు.

## ప్రజల నమ్మకాన్ని ఆయన వమ్ముచేయలేదు!

ఆదాల ప్రభాకరరెడ్డి కూడా రూరల్ నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయలేదు. ఇన్‌ఛార్జిగా తాను బాధ్యతలు చేపట్టిననాటినుండి ప్రజాక్షేత్రంలో తిరుగుతున్నారు. మీకందరికీ అండగా నేనున్నానన్న భరోసా కల్పించారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా తాను ఆదుకుంటానన్న ధైర్యాన్ని ఇచ్చారు. రూరల్ నియోజకవర్గం మొత్తం కలియతిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సాధ్యమైనంత వరకు ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరింపజేశారు. కొన్ని భారీ కార్యక్రమాల వివరాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వం నుండి పనులను మంజూరు చేయించి ప్రగతిని పరుగులు పెట్టించారు. గ్రామీణ నేపథ్యం నుండి వచ్చిన నాయకుడు కావడంతో రూరల్ నియోజక పరిధిలోకి వచ్చే గ్రామాలపైనా ప్రత్యేక దృష్టి సారించారు. ఆదాల రాకతో వై.ఎస్.ఆర్ కాంగ్రెస్‌పార్టీ ద్వితీయశ్రేణి నాయకులలో కూడా ఉత్సాహం వచ్చింది. మన కష్టాలు తెలిసిన మనిషి మన నాయకుడిగా వచ్చాడన్న నమ్మకం కలిగింది. ఆదాల ప్రభాకరరెడ్డిని పోటీలు పడి మరీ తమ తమ ప్రాంతాలకి తీసుకువెళ్లారు. సిమెంటు రోడ్లు వేయించుకున్నారు. డ్రైనేజీ సమస్యలు పరిష్కరింప చేసుకున్నారు. విద్యాలయాలను, వైద్యాలయాలను ఆధునీకరింపచేసుకున్నారు. ధీర్ఘకాలంగా పరిష్కారం కాని అనేక సమస్యలని పరిష్కరింపచేసుకున్నారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com